సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00 సంపుటి: 12 సంచిక: 134

ఆదివారం 4-8-2019



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

SUNDAY Special

## కోడలి క్వశ్చన్స్



మెగా మామగారితో కొణిదెలవారి కోడలు ఉపాసన ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో

## తల్లిలాంటి పార్టీ బీజేపీ



పార్టీ ఎంపీల శిక్షణా కార్యక్రమంలో మోదీ

- 5లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# మంచు దుప్పట్లో సెగలు!



- రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఏ, ఆర్టికల్ 370ను రద్దు చేస్తారని ప్రచారం
- గవర్నర్ మాలిక్‌తో ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా సమావేశం
- ప్రధాని ప్రకటనకు కాంగ్రెస్, ఎన్సీ డిమాండ్
- కశ్మీర్ వెళ్లొద్దు: పౌరులకు ఆస్ట్రేలియా, బ్రిటన్ హెచ్చరిక

- 5లో

**35ఏ.. ఎందుకంత ప్రాముఖ్యం?**
కశ్మీరీల ప్రత్యేక హక్కులు ఏమిటి

**పాక్ 'బ్యాట్' సైనికుల హతం**
సైన్యం కాల్పుల్లో ఐదుగురు మృతి

## ఉందిలే మంచికాలం

- వచ్చే 5 రోజులు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు
- మహారాష్ట్ర, కర్ణాటక, గోవాలకు ఐఎండీ హెచ్చరిక
- మరో వారంలోనే శ్రీశైలం నిండుతుందన్న సీడబ్ల్యూసీ

2లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి... గెలవండి
2 మాస్టర్ కూపన్

# 60 రోజుల్లో పల్లెకు పచ్చదనం

- సర్కారు కార్యాచరణ... త్వరలోనే అమలు షురూ
- ప్రజాప్రతినిధులు, అధికారులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం
- 60 రోజుల తర్వాత అధికారులతో 100 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- పంచాయతీరాజ్, పరిషత్‌లలో పోస్టుల భర్తీ
- చట్టం అమల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తాం
- పచ్చదనం, పరిశుభ్రతపై పంచాయతీలు దృష్టి పెట్టాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసే విధంగా త్వరలోనే అన్ని గ్రామ పంచాయతీల్లో '60 రోజుల కార్యాచరణ ప్రణాళిక'అమలు చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. పల్లెల సమగ్రాభివృద్ధితోపాటు పూర్తి స్థాయిలో పచ్చదనం, పరిశుభ్రతను సాధించేందుకు వివిధ అంశాలపై స్పష్టతనిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడేందుకు వీలుగా నూతన పంచాయతీరాజ్ చట్టంలో నిర్దేశించిన వివిధ విషయాలపై మరింత స్పష్టతనిస్తూ మార్గదర్శకాలు జారీచేశారు. 60 రోజుల కార్యాచరణ అమలులో భాగంగా పవర్ వీక్, హరితహారం నిర్వహించాలని చెప్పారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఏర్పడే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం కోసం

మిగతా 2వ పేజీలో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 44 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 155 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 107 కిలో | స్కిన్‌లెస్ | 177 కిలో |

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టుల మృతి
- ఓ జవానుకు గాయాలు
- రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ఘటన -5లో

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుత్తా

- ఆయన పేరు ఖరారు చేసిన కేసీఆర్
- నామినేషన్ పర్యవేక్షణ బాధ్యత ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డికి - 4లో








# అలా మొదలైంది..

ఏ బంధానికైనా స్నేహబంధమే పునాది. దానికి ఎల్లలు ఉండవు. ఎల్లలు లేని స్నేహానికి గుర్తుగా ఒక రోజుని పాటించే సంస్కృతి ఈనాటిది కాదు. అయితే ఒక్కో దేశం ఒక్కో రోజు జరుపుకోవడం విశేషం. నిజానికి స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం 1930లో పక్తు మార్కెట్ వ్యూహాలతో మొదలైంది. హాల్‌మార్క్ గ్రీటింగ్ కార్డుల వ్యవస్థాపకుడు జోయస్ హాల్ ఏటా ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించారు. అందుకు తగ్గట్లు కొన్ని గ్రీటింగ్ కార్డులు మార్కెట్లోకి పంపారు. కానీ దీని వెనుక స్నేహం కన్నా డబ్బులు సంపాదించే వ్యూహం దాగి ఉందన్న విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత 1958లో పరాగ్వేలో వరల్డ్ ఫ్రెండ్‌షిప్ క్రూసేడ్ అనే సంస్థ జూలై 30న ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రతిపాదించగా.. క్రమంగా చాలా దేశాలు దీన్ని పాటించడం మొదలుపెట్టాయి. దీంతో ఐక్యరాజ్యసమితి 2011లో ఆ రోజును అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవంగా ప్రకటించింది. ఇంగ్లిష్ రచయిత ఎ.ఎ.మిల్నె సృష్టించిన 'విన్నీ ది పూహ్'కార్టూన్ క్యారెక్టర్ టెడ్డీబేర్‌ను స్నేహానికి ప్రపంచ స్నేహ రాయబారిగా ఐక్యరాజ్య సమితి అప్పటి ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ భార్య నానె అన్నన్ 1998లో ప్రకటించారు. అప్పట్నుంచి ఫ్రెండ్‌షిప్‌డే రోజు టెడ్డీబేర్‌లు గిఫ్ట్‌లుగా ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి మొదలైంది. అయితే భారత్, మలేసియా, బంగ్లాదేశ్, కొన్ని అరబ్ దేశాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకొంటారు. పాకిస్తాన్‌లో మాత్రం జూలై 30న చేసుకుంటారు. అర్జెంటీనా, బ్రెజిల్, ఈక్వెడార్, ఉరుగ్వేల్లో జూలై 20న నిర్వహిస్తారు.



## ముస్తఫా.. ముస్తఫా..

జీవితాంతం స్నేహం అన్నది మనుషులకే కాదు.. జంతువుల్లోనూ ఉందట. అంతేకాదు.. తమ జాతి వాటితోనే కాకుండా.. వేరే జాతులకు చెందినవాటితోనూ అవి ఫ్రెండ్‌షిప్ చేస్తాయట. చింపాంజీలు, బబూన్లు, గుర్రాలు, ఏనుగులు, డాల్ఫిన్లు వంటి జంతువులపై జరిపిన పరిశోధనల్లో ఈ విషయం తేలింది. ముఖ్యంగా తిమింగలాలకైతే బోలెడంత మంది బెస్ట్ ఫ్రెండ్‌లు ఉంటారట.



మనం జీవితంలో ఎంతమందిని స్నేహితులను చేసుకుంటామో తెలుసా? చెప్పలేరు కదూ.. ఒక అధ్యయనం ప్రకారం 396 మందిని అట. అయితే ప్రతి 12 మంది స్నేహితుల్లో ఒక్కరితో మనం స్నేహప్రయాణం కొనసాగిస్తామట.



## అధికారికంగా ప్రొ.జయశంకర్ జయంతి

సాక్షి, హైదరాబాద్: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. ప్రతి ఏటా ఆగస్టు 6న ప్రభుత్వ కార్యాలయాల్లో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించాలని స్పష్టం చేసింది. ఈమేరకు అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు పంపింది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించాలని సూచిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## విశ్రాంత ఉద్యోగులకు ప్రోత్సాహకమేది?

### టీఎన్జీఓ చైర్మన్ రవీందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పెన్షనర్లకు తెలంగాణ సాధన ప్రోత్సాహకాన్ని తక్షణమే ఇవ్వాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శనివారం జరిగిన తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్, పెన్షనర్స్ జేఏసీ ముందుంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. పీఆర్సీ చేసిన సిఫార్సుల అమలు, 70 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ 15 శాతం, అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత, పరిమితులు లేని చికిత్స అందించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల నర్సయ్య, నవనీతరావు, టి.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్, సీఎంలను కలిసిన పీసీసీఎఫ్ శోభ



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శోభ

సాక్షి, హైదరాబాద్: ప్రధాన అటవీ సంరక్షణాధికారి (పీసీసీఎఫ్–ఇన్‌చార్జి) ఆర్. శోభ శనివారం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సీఎం కేసీఆర్‌లను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జూలై 31న పీసీసీఎఫ్‌గా ప్రశాంత్‌కుమార్ ఝా పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ఆర్. శోభను పీసీసీఎఫ్–ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల జారీచేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లో అటవీశాఖ అత్యున్నత హోదాలో బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా శోభ నిలిచారు.

## ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు 31 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరీక్ష ఫీజును చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈనెల 29 చివరి తేదీ అని, ఏడో తరగతిలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి 2019–20 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు చేసుకోడానికి అర్హులని పేర్కొన్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను నవంబర్ 3వ తేదీన నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లేదా ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో 9908299131, 9247834799 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 'రేపు డిగ్రీ లెక్చరర్లకు నియామక పత్రాలు'

సాక్షి, హైదరాబాద్: గిరిజన గురుకుల సొసైటీ డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ లెక్చరర్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 5వ తేదీన నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు తెలంగాణ గిరిజన గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అర్హత సాధించిన అభ్యర్థులంతా సోమవారం ఉదయం 10 గంటలకల్లా మాసబ్‌ట్యాంక్‌లోని టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్/టీఆర్ఈఐఆర్‌బీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించింది.

## 7 నుంచి అగ్రి వర్సిటీలో కౌన్సెలింగ్

హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం బైపీసీ స్ట్రీమ్ కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 7 నుంచి 14 వరకు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కౌన్సెలింగ్ జరగనుంది. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ కోర్సులకు ఇది వరకే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను **(www.pjtsau.edu.in)** సంప్రదించవచ్చని రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ఎంసెట్–2019 ర్యాంకుల ఆధారంగా రిజర్వేషన్ నిబంధనలకు లోబడి అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు అదే రోజు ఫీజు చెల్లించాలని, లేకపోతే వారి సీటు రద్దు అవుతుందని చెప్పారు. కౌన్సెలింగ్ పూర్తయిన తరువాత సీట్ల ఖాళీల వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. ఒకవేళ అభ్యర్థులు వారికి సంబంధించిన కేటగిరీలో సీట్లు ఖాళీగా లేకపోతే కౌన్సెలింగ్‌కు హాజరుకావలసిన అవసరం లేదన్నారు. పేమెంట్ కోటాకు సంబంధించిన సీట్ల కోసం విడిగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేస్తామని తెలిపారు. ఎన్నారై/ఎన్నారై స్పాన్సర్డ్ కోటా సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీని ఈ నెల 29 వరకు పొడిగించామని వివరించారు.

## యూరియాకు భారీ డిమాండ్

- వర్షాలు ఊపందుకోవడంతో దుకాణాలకు రైతుల క్యూ
- తక్షణం 81 వేల టన్నుల సరఫరా చేయాలని కంపెనీలకు సర్కారు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వానలు ఊపందుకోవడంతో రాష్ట్రంలో యూరియాకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో ఎక్కడికక్కడ రైతులు దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. ఇప్పటికే పత్తి 42 లక్షల ఎకరాల్లో సాగు కావడం, మొక్కజొన్న సాగు, వరి నాట్లు కూడా ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల ప్రణాళిక ప్రకారం అవసరమైన యూరియాను తక్షణమే సరఫరా చేయాలని కంపెనీలను వ్యవసాయశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి పలు ఎరువుల కంపెనీలకు లేఖ రాశారు. సాధారణంగా ఈ నెలకు మొత్తంగా 4.96 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. అందులో 2.21 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా, దాదాపు 49 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ తదితర ఎరువులు అవసరముంది. ఆ మేరకు వ్యవసాయశాఖ ప్రణాళిక రచించింది. అయితే ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో ఎరువులకు మరింత డిమాండ్ ఏర్పడింది. ఈ నెల 15వ తేదీ నాటికి 81,250 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేయాలని పార్థసారథి ఎరువుల కంపెనీలను కోరారు. ముందస్తుగానే జిల్లాలకు సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. ఇదిలా వుండగా మార్క్‌ఫెడ్ వద్ద నిరంతరం 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్‌స్టాక్‌గా అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం లక్షన్నర మెట్రిక్ టన్నులు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఉందిలే మంచి కాలం..!

- వచ్చే 5రోజులు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మధ్య మహారాష్ట్ర, కోస్తా కర్ణాటక, కొంకణ్ (గోవా) ప్రాంతాలతోపాటు మహాబలేశ్వర్‌లో గడచిన వారం రోజులుగా సగటున 20సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో వారం రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తాజా నివేదికలో వెల్లడించింది. భారీ వర్షాలు కురుస్తాయని, ఇందుకు తగ్గట్లుగానే ముందుజాగ్రత్తలు తీసుకోవాలని మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాలను హెచ్చరించింది. వచ్చే వారం పాటు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున శ్రీశైలానికి ప్రవాహం 3.5–4 లక్షల క్యూసెక్కుల (32–37టీఎంసీలు)కు పెరగవచ్చని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేస్తోంది. అదే నిజమైతే శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టానికి చేరడానికి నాలుగైదు రోజులు పడుతుంది. అక్కడినుంచి సాగర్‌కు వారం రోజుల్లోనే కృష్ణానది ప్రవాహం మొదలవుతుంది.

### 25 నుంచి 30 సెంటీమీటర్ల వర్షం

కృష్ణానది జన్మస్థలమైన పశ్చిమ కనుమల్లో వచ్చే 5రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తాజా నివేదిక వెల్లడించింది. మహాబళేశ్వర్‌తో పాటు మధ్య మహారాష్ట్ర, కోస్టల్ కర్నాటక, కొంకణ్ గోవాలో భారీ వర్షాలు కురుస్తాయంది. వచ్చే ఐదు రోజులు 25–30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేస్తోంది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుని సీడబ్ల్యూసీ కృష్ణానది, దాని ఉప నదులపై ఉన్న ప్రాజెక్టుల్లో నీటిమట్టాల నిర్వహణను జాగ్రత్తగా గమనించాలని తెలంగాణ సహా పరీవాహక ప్రాంతాల్లోని రాష్ట్రాలకు సూచించింది. పశ్చిమ కనుమల్లో నమోదవుతున్న వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవాహాలను కిందకు వదిలాలని సూచించింది. నదీ పరివాహక ప్రాంతంలో భారీగా వర్షాలు కురవడంతో కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో రోజురోజుకూ వరద ప్రవాహం పెరుగుతోంది. గడిచిన 3రోజులతో పోలిస్తే శనివారం కృష్ణానదిలో వరదఉధృతి మరింతగా పెరిగింది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో శనివారం రాత్రికి శ్రీశైలంలో నీటి నిల్వ 80టీఎంసీలకు చేరింది.

### ఆగస్టు చివరి నాటికి సాగర్‌కు జలకళ

ఆగస్టు 15కు కాస్త అటూఇటుగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 312 టీఎంసీలకు గానూ 126.30 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వలున్నాయి. కృష్ణా ఉపనది భీమాలోనూ వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. దాదాపు 38,078 క్యూసెక్కులు వచ్చి చేరడంతో భీమా నదిపైన ఉన్న ఉజ్జయిని (మహారాష్ట్ర) జలాశయంలో నీటి నిల్వ 81.35 టీఎంసీలకు చేరుకుంది. మరో 35.89 టీఎంసీలు వస్తే ఉజ్జయినీ నిండుతుంది. వరద ఇదే రీతిలో కొనసాగితే ఈ నెల రెండో వారం నాటికి ఉజ్జయినీ నిండుతుంది. ఆ తర్వాత భీమా వరద జూరాల మీదుగా శ్రీశైలాన్ని చేరుతుంది. ఐఎండీ అంచానాలు నిజమైతే ఈ నెలాఖరు నాటికి నాగార్జునసాగర్‌కు భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉంటుంది.



బీడీఎల్ స్వర్ణజయంతి వేడుకల్లో పాల్గొన్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఎమ్మార్ఎస్ఏమ్ క్షిపణి నమూనాను అందజేస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్ రెడ్డి, ఎయిర్ మార్షల్ ఆర్కేఎస్ బహదూరియా తదితరులు

# మనం ముందంజలో ఉన్నాం

- విదేశాలకు క్షిపణుల్ని అందించే స్థాయికి ఎదిగాం
- బీడీఎల్ స్వర్ణ జయంతి ఉత్సవాల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్: ప్రస్తుతం మనం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందంజలో ఉన్నామని, ఇతర దేశాలనుంచి క్షిపణుల్ని కొనే స్థాయి నుంచి విదేశాలకు వాటిని అమ్మేస్థాయికి మనదేశం ఎదిగిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. కంచన్‌బాగ్‌లోని భారత డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్)లో శనివారం ఘనంగా నిర్వహించిన ఆ సంస్థ స్వర్ణ జయంతి ఉత్సవాలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్‌కు బీడీఎల్ రిటైర్డ్ సీఎండీ సిద్ధార్థ మిశ్రా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బీడీఎల్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి, దివంగత నేత అబ్దుల్ కలాం విగ్రహంతోపాటుగా కలాం తపాల స్టాంపులు, మిస్సైల్ నమూనాలను మంత్రి ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నంలోని జలనిధిని ఇక్కడ్నుంచే రిమోట్ ద్వారా మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ..దేశంలో బీడీఎల్ అతి పెద్ద రక్షణ సంస్థ అని, అబ్దుల్ కలాం ప్రేరణతోనే ఈ రక్షణ సంస్థ సాధ్యమైందని వివరించారు. గత 50 ఏళ్లల్లో మనదేశం అన్ని రకాల క్షిపణులను తయారు చేసి విదేశాలకు దీటుగా నిలిచిందన్నారు. రష్యా వంటి దేశాల నుంచి క్షిపణుల్ని కొనే స్థాయి నుంచి వాటిని విదేశాలకు అందించే స్థాయికి ఎదిగామన్నారు. సృష్టికి కారణమైన పృథ్వీ, ఆకాశ్, అగ్ని, త్రిశూల్, బ్రహ్మోస్ వంటి పేర్లను క్షిపణులకు పెడుతున్నామన్నారు. అంతకుముందు బీడీపీఏవీ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఓ చైర్మన్, డిఫెన్స్ ఆర్ అండ్ డీ సెక్రటరీ సతీశ్ రెడ్డి, డిఫెన్స్ ఫైనాన్స్ సెక్రటరీ గార్గీ కౌల్, ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ వైస్ చీఫ్ ఆర్కేఎస్ బదహూరియా, ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అమిత్ సాహే తదితరులు పాల్గొన్నారు.

# 60 రోజుల్లో పల్లెకు పచ్చదనం

▶ మొదటి పేజీ తరువాయి

అమలుచేస్తున్న ఈ కార్యాచరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధం కావాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామ వికాసం, పూర్తి స్థాయిలో అభ్యున్నతి కోసం ప్రభుత్వం సమగ్రవిధానం తీసుకువస్తోందని ఆయన తెలిపారు. 60 రోజుల గ్రామ వికాసంతో పంచాయతీరాజ్ శాఖది చాలా క్రియాశీలకమైన పాత్రన్న ముఖ్యమంత్రి ఈ శాఖను సంస్థాగతంగా బలోపేతం చేయనున్నట్టు స్పష్టంచేశారు. దీని కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఎప్పటి నుంచి దీన్ని అమలు చేయాలన్న దానిపై రెండు మూడ్రోజుల్లోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. 60రోజుల తర్వాత ముఖ్య అధికారుల నేతృత్వంలోని 100 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ఆకస్మిక తనిఖీలు చేపడతాయన్నారు. ఏ గ్రామంలో అయితే 60రోజుల కార్యాచరణలో నిర్దేశించిన పనులు చేపట్టలేదో అక్కడ సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు.

### పీఆర్, పరిషత్ పోస్టులు భర్తీ

పంచాయతీరాజ్, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల్లోని పోస్టులను భర్తీ చేస్తామని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ఏమేమి పనులు చేయాలో స్పష్టంగా నిర్వచించుకుని ఎవరి విధులు వారే నిర్వహించాలన్నారు. శనివారం ప్రగతిభవన్‌లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళికపై వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, డీపీవోలు, ఈవోపీఆర్డీలు, సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సీఎస్ ఎస్‌కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్య కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, పంచాయతీ రాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, పాలమూరు, సిద్దిపేట, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, సిరిసిల్ల జిల్లాల డీపీవోలు, రిటైర్డ్ డీపీవో లింబగిరి స్వామి, ఈవోపీఆర్డీలు సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన యాదవ్, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ చందర్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి బాచిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిక్కచ్చిగా వ్యవహరిస్తాం

'స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా గ్రామాల పరిస్థితి ఇంకా మారలేదు. వివిధ రూపాల్లో వేల కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పడి ఉన్నాయి. ఎవరికి వారు బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను బాగుచేసుకునే పద్ధతి రావడం లేదు. ఈ పరిస్థితిలో గుణాత్మక మార్పు రావాలి. అందుకోసమే కొత్త పీఆర్ చట్టం తెచ్చాం. అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఖచ్చితమైన బాధ్యతలు పెట్టాం. ఎవరేం పని చేయాలో నిర్దేశించాం. అవసరమైన అధికారాలిచ్చాం. కావాల్సిన నిధులను బడ్జెట్లోనే కేటాయించాం. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారం కూడా ఈ చట్టం ప్రభుత్వానికి కల్పించింది. కొత్త చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసే విషయంలో ప్రభుత్వం చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఎవరినీ ఉపేక్షించదు. గుణాత్మక మార్పుకోసం ఏంచేయాలో అది చేస్తాం'అని కేసీఆర్ పేర్కొన్నారు.

### ఈ కార్యాచరణలో చేపట్టాల్సిన పనులు..

- గ్రామంలో పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలి. మురికి కాల్వలన్నీ శుభ్రం చేయాలి.
- గ్రామ పరిధిలోని పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థల్లో పారిశుధ్యం గ్రామ పంచాయతీల బాధ్యత.
- కూలిపోయిన ఇండ్లు, పాడైపోయిన పశువుల కొట్టాల శిథిలాలను పూర్తిగా తొలగించాలి.
- ఉపయోగించని, పాడుపడిన బావులను, నీటి బొందలను పూర్తిగా పూడ్చేయాలి. ఇందుకోసం ఉపాధిహామీ నిధులతో మొరం నింపాలి. గ్రామంలో ఎప్పటికప్పుడు దోమల మందు పిచికారి చేయాలి.
- వైకుంఠధామం (శ్మశాన వాటిక) నిర్మాణం కోసం అనువైన స్థలాలను ఎంపిక చేయాలి.
- గ్రామ డంపింగ్ యార్డు కోసం స్థలం సేకరించాలి.
- విలేజ్ కమ్యూనిటీ హాల్, గోదాము నిర్మాణానికి స్థలాలు సేకరించాలి.
- గ్రామానికి కావాల్సిన వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించాలి.

### 'పవర్'వీక్ లో చేయాల్సిన పనులు:

- 60 రోజుల కార్యాచరణలో భాగంగా 7రోజుల పాటు పూర్తిగా విద్యుత్ సంబంధమైన సమస్యలను పరిష్కరించాలి.
- ఆ గ్రామంలో వీధిలైట్ల కోసం ఎంత కరెంటువాడుతున్నారో ఖచ్చితమైన నిర్ధారణకు రావాలి.
- మీటర్లు పెట్టాలి. వీధిలైట్ల కోసం థర్డ్ లైను వేయాలి. విధిగా ఎల్ఈడీ బల్బులు అమర్చాలి.
- గ్రామంలో వంగిపోయిన స్తంభాలు, వేలాడే వైర్లు సరిచేయాలి.

### హరితహారంలో చేయాల్సిన పనులు:

- గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే విలేజ్ నర్సరీ ఏర్పాటు చేయాలి.
- మండల అటవీశాఖాధికారి సాంకేతిక సహకారం తీసుకోవాలి. ఉపాధిహామీ నిధులు వినియోగించాలి.
- గ్రామంలో విరివిగా మొక్కలు నాటాలి. వాటికి నీళ్ల పోసి, రక్షించాలి.
- పెట్టిన మొక్కలన్నీ చెట్లుగా ఎదిగే వరకు బాధ్యత తీసుకోవాలి. గ్రామస్తులకు కావాల్సిన రకం మొక్కలను సరఫరా చేయాలి.
- చింతచెట్లను పెద్ద సంఖ్యలో పెంచాలి.

### ఈవోపీఆర్డీ పేరు ఎంపీవోగా మార్పు

'అన్ని జిల్లాలకు జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో)లను నియమించాలి. రెవెన్యూ డివిజన్ ఓ డీఎల్పీవోను, మండలానికో ఎంపీవోను నియమించాలి. ఖాళీగా ఉన్న ఎంపీడీవో, సీఈవో పోస్టులను భర్తీ చేయాలి. వీటిని భర్తీ చేయడానికి వీలుగా పంచాయతీ అధికారులకు పదోన్నతులివ్వాలి. శాఖాపరంగానే కొత్త నియామకాలు చేపట్టాలి. ప్రక్రియ అంతా చాలా వేగంగా జరగాలి'అని సీఎం ఆదేశించారు.

### పంచాయతీలు నిర్వహించాల్సిన బాధ్యతలు:

- గ్రామంలో వందకు 100% పన్నులు వసూలు చేయాలి.
- వారాపు సంత (అంగడి)లో సౌకర్యాలు కల్పించాలి.
- వివాహ రిజిస్ట్రేషన్ నిర్వహించాలి.
- గ్రామంలో ఎవరు పెళ్లి చేసుకున్నా వెంటనే రికార్డు చేయాలి.
- జనన, మరణ రికార్డులు రాయాలి.
- పుట్టిన వెంటనే తల్లిదండ్రులకు, కులం వివరాలతో బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలి.
- విద్యుత్ సంస్థలకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలి.
- గ్రామపంచాయతీ నిధుతో ఉపాధి హామీ నిధులు అనుసంధానం అయ్యే విధానం రూపొందించాలి.
- ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇతర కంపెనీలతో సంప్రదించి, సీఎస్ఆర్ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించే విధానం అవలంబించాలి
- గ్రామస్తులను శ్రమదానానికి ప్రోత్సహించి, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి.

# 15కు ముందే 'శ్రీరామ' జలాభిషేకం!

- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీటి తరలింపునకు అంతా సిద్ధం
- ఎస్సారెస్పీ పునరుజ్జీవనానికి రోజుకు 0.5 టీఎంసీ నీటిని తరలించేలా పనులు పూర్తి
- కనిష్టంగా ఈ సీజన్లో 50 టీఎంసీల తరలింపు టార్గెట్
- ఈ నీటితో 6.20 లక్షల ఎకరాల మేర స్థిరీకరణకు అవకాశం
- సీఎం ఆదేశాలతో పునరుజ్జీవన పథకంలో పెరిగిన వేగం

సాక్షి, హైదరాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి కొరత తీర్చేందుకు చేపట్టిన పునరుజ్జీవన పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 15వ తేదీకి ముందే నీటిని ఆయకట్టుకు ఎత్తిపోసేలా కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రస్తుతం ఎల్లంపల్లికి భారీ వరద వస్తుండటం, కాళేశ్వరంలోని ఎల్లంపల్లి దిగువ ప్యాకేజీల పనులు మరో మూడు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఎత్తిపోతలు చేపట్టి ఈ సీజన్‌లో పునరుజ్జీవనానికి కనిష్టంగా 50 టీఎంసీల నీటిని తరలించేలా పనులు పూర్తి చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయకట్టుకు నీటిని అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో పంప్‌హౌస్‌ల పనులను వేగిరం చేశారు. ఎత్తిపోతలు మొదలైతే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల తొలి ఫలం ఎస్సారెస్పీ ఆయకట్టుకే అందనుంది.

### రోజుకు అర టీఎంసీ మేర పనులు పూర్తి

ఎస్సారెస్పీ స్టేజ్–1 కింద 9.68 లక్షలు, స్టేజ్–2 కింద మరో 4 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికింద ఉన్న కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాల్వల ద్వారా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు. అయితే గడిచిన కొన్నేళ్లుగా ఎగువ నుంచి ఎస్సారెస్పీకి వరద తగ్గడం, వచ్చినా ఆగస్టు తర్వాత ఉండటంతో ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. గరిష్టంగా 4.50 లక్షల ఎకరాలకు మించి నీరు అందడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కాళేశ్వరం ద్వారా ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందుబాటులో ఉంచేందుకు ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సైతం సీజన్ ఆరంభమై రెండు నెలలు గడిచినా ప్రాజెక్టులోకి వరద రాలేదు. శనివారం నుంచి ప్రవాహాలు కొద్దిగా మొదలయ్యాయి. ప్రాజెక్టులో 90 టీఎంసీల నిల్వలకు గానూ కేవలం 6.5 టీఎంసీల మేర మాత్రమే నిల్వ ఉంది. ఈ నీటి కొరతను దృష్టిలో పెట్టుకొనే కాళేశ్వరం ద్వారా ఎల్లంపల్లి మీదుగా మిడ్‌మానేరుకు నీటిని తరలించే క్రమంలో, మిడ్‌మానేరుకు చేరకముందే వరద కాల్వ మీద మూడు పంప్‌హౌజ్‌లను నిర్మించి రివర్స్ పంపింగ్ ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని వరద ఉండే 60 నుంచి 120 రోజుల పాటు ఎస్సారెస్పీకి తరలించేలా పనులు చేపట్టారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకంలోని మూడు పంప్‌హౌస్‌లకు గానూ రెండు పంప్‌హౌజ్‌లు సిద్ధం అవుతున్నాయి. ఈ రెండు పంప్‌హౌస్‌లలో 8 మోటార్లకు గానూ 6.5 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఐదు మోటార్ల చొప్పున సిద్ధం చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 1,450 క్యూసెక్కుల నీటిని అంటే కనిష్టంగా రోజుకు 0.5 టీఎంసీ నీటిని తరలించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిండటం, ఎల్లంపల్లి సైతం నిండేందుకు సిద్ధంగా ఉండటంతో మిడ్‌మానేరుకు మరో నాలుగు రోజుల్లో ఎత్తిపోతలు ఆరంభం కానుంది. ప్రస్తుతం ప్రాణహిత, గోదావరిలో వరద కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే మూడు నుంచి నాలుగు నెలలపాటు కనిష్టంగా 50 టీఎంసీల నీటిని ఆయకట్టుకు తరలించాలని సీఎం ఇంజనీర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ నీటితో కనిష్టంగా 6.26 లక్షల ఎకరాల మేర స్థిరీకరించే అవకాశం ఉంటుంది. ఈ నీటికి ఎస్సారెస్పీకి సహజ ప్రవాహాలతో వచ్చే మరో 30 నుంచి 40 టీఎంసీల నీరు తోడైతే పూర్తి ఆయకట్టుకు నీరందించడం సాధ్యం కానుందని ప్రాజెక్టు ఎస్ఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అర టీఎంసీ నీటి తరలింపుకు వీలుగా మూడు, నాలుగు రోజుల్లో పనులు పూర్తవుతాయని, ఆగస్టు 15కి ముందే పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీటిని తరలిస్తామని స్పష్టం చేశారు.

## ఇదం జగత్




... అవే మన దగ్గరికొస్తున్నాయ్! ఇంకెందుకెళ్తాం వేటకు!!

# డిగ్రీలో ప్రవేశాలు 45 శాతమే!

- ముగిసిన దోస్త్ తొలిదశ కౌన్సెలింగ్
- ఇప్పటివరకు కన్ఫర్మ్ అయిన సీట్లు 1.74 లక్షలు

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి తొలిదశ ప్రవేశాల కౌన్సెలింగ్ ముగిసింది. ఇందులో భాగంగా సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిగ్రీ కోర్సుల్లో 3,86,684 సీట్లు ఉండగా, శనివారం నాటికి సీట్లు పొందిన వారిలో 1,74,073 మంది విద్యార్థులు కాలేజీల్లో చేరారు. ఈమేరకు కన్ఫర్మ్‌డ్ జాబితాను దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) కన్వీనర్ విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 78,519 సీట్లుండగా.. ఇప్పటివరకు 56.22 శాతం విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీల్లో 14,665 సీట్లకు గాను 59.95 శాతం, ప్రైవేటు అన్ ఎయిడెడ్ కాలేజీల్లో 2,93,500 సీట్లకుగాను 41.27 శాతం అడ్మిషన్లు జరిగాయి. బీఏ లిటరేచర్ కేటగిరీలో హిందీ, మరాఠీ, సంస్కృతం, బీబీఎం తెలుగు కోర్సుల్లో సున్నా ప్రవేశాలు జరగ్గా.. బీఎస్సీ ఫిజికల్ సైన్స్(ఉర్దూ)లో సింగిల్ డిజిట్‌లోనే ప్రవేశాలు పొందారు. మొత్తంగా ప్రైవేటు అన్ ఎయిడెడ్ కాలేజీల్లో అతి తక్కువ శాతంలో సీట్లు భర్తీ కాగా ప్రభుత్వ కాలేజీలు రెండో స్థానంలో, ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీల్లో అధికంగా 59.95 శాతం సీట్లు నిండాయి. ప్రస్తుతం దోస్త్ రెండో దశ కౌన్సెలింగ్ కొనసాగుతోంది.

**రాష్ట్రంలో డిగ్రీ కాలేజీల్లో మొత్తం సీట్లు, చేరిన విద్యార్థుల వివరాలు**

| కేటగిరీ | సీట్లు | భర్తీ | శాతం |
|---|---|---|---|
| ప్రభుత్వ | 78,519 | 44,151 | 56.22 |
| ప్రైవేటు ఎయిడెడ్ | 14,665 | 8,793 | 59.95 |
| ప్రైవేటు అన్ ఎయిడెడ్ | 2,93,500 | 1,21,129 | 41.27 |



భద్రతా చర్యల దృష్ట్యా శ్రీనగర్‌లోని నిట్ క్యాంపస్‌ను ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో నాలుగు బస్సుల ద్వారా విద్యార్థులను జమ్మూకి తరలిస్తున్న కాలేజి యాజమాన్యం

# మన విద్యార్థులు పదిలం

- వారిని క్షేమంగా స్వస్థలాలకు చేరుస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి
- అన్ని విధాలా సాయం అందిస్తాం: కేటీఆర్

**సాక్షి, న్యూఢిల్లీ, హైదరాబాద్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో శ్రీనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) క్యాంపస్‌ను ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అందులో చదువుతున్న 135 మంది తెలుగు విద్యార్థులను క్షేమంగా వారి స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు, ధర్మపురి అరవింద్‌ల ద్వారా ఎప్పటికప్పుడు విషయాలను తెలుసుకుంటూ జమ్మూకశ్మీర్ అధికారులతో సంప్రదింపులు జరిపి విద్యార్థులు క్షేమంగా స్వస్థలాలకు చేరే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కిషన్‌రెడ్డి శనివారం ఢిల్లీలో మీడియాకు వివరించారు. ఎన్‌ఐటీలోని 5,000 మంది విద్యార్థులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు అధికారులతో సమన్వయ చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను ప్రత్యేక బలగాల రక్షణలో ముందుగా జమ్మూ పట్టణానికి తరలిస్తున్నామని, అక్కడి నుంచి వివిధ రవాణా మార్గాల ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఎలాంటి ఆందోళన చెందరాదని కోరారు. తెలంగాణ విద్యార్థుల జాబితాను బండి సంజయ్.. కిషన్‌రెడ్డికి అందజేశారు. మరోవైపు ఈ అంశంపై టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు ట్విట్టర్ ద్వారా స్పందించారు. శ్రీనగర్‌లోని తెలుగు విద్యార్థులు ఆందోళన చెందుతూ తనకు మెసేజ్‌లు పంపుతున్నారని, అయితే విద్యార్థులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందని పేర్కొన్నారు. సాయం కావాల్సిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరిని 011–233820141, 919968299337 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులతో భవన్ అధికారుల సంప్రదింపులు ఎన్‌ఐటీ విద్యార్థులతో ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి సంప్రదింపులు జరిపారు. విద్యార్థులను జమ్మూ వరకు చేర్చేందుకు ఎన్‌ఐటీ అధికారులు నాలుగు బస్సులు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి 12 గంటల వరకు విద్యార్థులు జమ్మూ చేరుకోనున్నారు. అక్కడి నుంచి వారిని 3 బస్సుల్లో ఢిల్లీకి చేర్చేందుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేశా రని, వారితో సమన్వయం చేస్తున్నామని ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. విద్యార్థులు ఢిల్లీ చేరగానే వారికి వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**ఐటీడీఏ అధికారులకు మంత్రి కొప్పుల సూచన**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. గిరిజన తండాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవ లను మరింత విస్తృతం చేయాలని సూచించారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్ నుంచి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధికారులతో గిరిజన ప్రాంతాల్లో చేపట్టాల్సిన వైద్య సదుపాయాలపై టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. కొద్ది రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వానలతో గిరిజనులు, ఆదివాసీలు విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను అందిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వైద్య సేవలు అందించడానికి క్షేత్రస్థాయిలో మెడికల్ క్యాంపులను నిర్వహించాలని తెలిపారు. అన్ని స్థాయిల్లోని అధికారులు ఈ క్యాంపుల్లో పాల్గొనాలని, అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టా లని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రాథమిక ఆసు పత్రుల్లో ముందస్తుగా మందులను నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందడం లేదన్న ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభావిత మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి పర్యవేక్షణ చేసేలా చర్య లు తీసుకోవాలని పేర్కొన్నారు.

Shobhit University
Direct Admission
Against lapsed / vacant seats
B.Sc. Agriculture
B.Tech. Agricultural Technology
MBA Agri-Business Management
Ranked in TOP 20 TECHNICAL UNIVERSITIES OF INDIA India Today
AICTE Approved | NAAC Accredited | UGC Recognised
SHOBHIT DEEMED UNIVERSITY [SIET - Estd u/s 3 of UGC Act 1956]
NH-58, Modipuram, Meerut, Delhi NCR | 9440179822 (Hyderabad)
Delhi Office: Shobhit University Tower, Mayur Vihar Ph 2, Delhi-91; M. 9870265521
Global Placements, Industry Internships, Scholarships www.shobhituniversity.ac.in




PROF. G.RAM REDDY CENTRE FOR DISTANCE EDUCATION
(Recognized by the Distance Education Bureau, UGC, New Delhi)
OSMANIA UNIVERSITY, Hyderabad-500007, Telangana State, INDIA
(A University with Potential for Excellence and Re-accredited by NAAC with A+ grade)
ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2019-20 COURSES OFFERED

| Course | Years | Eligibility |
|---|---|---|
| M.B.A. | 2 yrs | Graduate with qualifying in TS ICET / AP ICET-2019 or ET conducted by PGRRCDE, OU |
| M.C.A. | 3 yrs | Any Graduate with qualifying in TS ICET / AP ICET-2019 or ET conducted by PGRRCDE, OU |
| M.A. (Urdu / Hindi / Telugu / Sanskrit / English) | 2 yrs | A Graduate in the concerned subject |
| M.A. (Philosophy/Sociology/ Public Personal Mgt) | 2 yrs | Graduate of any faculty |
| M.A. (Economics/Pol.Science/History/Psychology) | 2 yrs | A Graduate in the concerned subject at U.G. level |
| M.Com | 2 yrs | Pass in B.Com |
| M.Sc. (Mathematics) | 2 yrs | A Graduate in the concerned subject |
| M.Sc. (Statistics) | 2 yrs | Graduate with Mathematics and Statistics |
| B.A. | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| B.A. (Mathematics & Statistics) | 3 yrs | Inter or 10+2 with Mathematics as one of the optional subject |
| B.Com (General) | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| B.B.A. | 3 yrs | Inter or 10+2 level exam Pass |
| P.G. Diploma in Mathematics | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in English Language Teaching | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in Business Management | 1 yr | Graduate of any faculty, (3 YDC) |
| P.G. Diploma in Bioinformatics | 1 yr | B.Sc/ M.Sc/ B.Sc (Ag)./ B.Pharmacy/ BVSc/ MBBS/ BDS/ BAMS/ BUMS/ BHMS/ BE with 50% of marks |
| P.G. Diploma in Computer Applications (Two Semesters) | 1 yr | Graduate of any faculty |

For On-line registration and admission details visit website: www.oucde.net
Admissions start from: 18th July, 2019.
Last date for Admission without Late fee is: 30th September, 2019.
Sd/- DIRECTOR

# 'కారు'చౌకగా టీఆర్‌ఎస్‌కు స్థలాలపై 'పిల్'



**సాక్షి, హైదరాబాద్:** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కార్యాలయాలకు జిల్లా కేంద్రాల్లో భవనాలు నిర్మించుకునే నిమిత్తం ప్రభుత్వం స్థలాలు ఇవ్వాలని నిర్ణయిస్తూ జారీ చేసిన జీవో 167ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ జీవో ఆధారంగా ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో జీవో 66 జారీ ద్వారా టీఆర్‌ఎస్ పార్టీకి గజం రూ.100కే ఇవ్వాలనే నిర్ణయం అమలు కాకుండా ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం 'పిల్' వేశారు. ప్రభుత్వం 24 జిల్లా కేంద్రాల్లో టీఆర్‌ఎస్ పార్టీకి చదరపు గజం కేవలం రూ.100కే ఇస్తూ 2019 జూన్‌లో జీవో 66 జారీ చేసిందని పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలైన టీఆర్‌ఎస్, టీడీపీ, వైసీపీ, ఎంఐఎం, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చేశారు. జీవో 167ను ఆధారంగా చేసుకుని 24 జిల్లా కేంద్రాల్లో టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల కోసం కారు చౌకగా భూమిని ఇవ్వాలని గత జూన్‌లో జారీ చేసిన జీవో 66 రాజ్యాంగ విరుద్ధమన్నారు. రెండు జీవోల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలివ్వాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు జిల్లా కేంద్రాల్లో ఎకరా భూమి 30 ఏళ్లకు లీజుకు ఇచ్చేలా 1987లో జీవో 826 వెలువడిందని, ఆయా జిల్లాల్లో భూముల విలువలను బట్టి లీజు రేట్లు ఉండేలా ఆ జీవో ఉందని, లీజు ముగిసిన తర్వాత మరోసారి లీజు పొడిగించేందుకు అవకాశం కూడా ఉందని ఆయన పిటిషన్‌లో వివరించారు. ఈ పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

Bharat 6
Petrol & Diesel




PRESENTING
SELTOS
BADASS BY DESIGN
Signature Kia Design — Globally Acclaimed
Next-gen AT & MT — Petrol & Diesel BS VI Engines
1.4 Turbo GDI with DCT — First-in-segment
37 Connectivity Features — With Kia UVO Connect

Test drive & book at nearest dealership
Visit www.kia.com/in
Book Kia Seltos
@KiaMotorsIN | @KiaMotorsIN | Kia Motors India | @KiaMotorsIN




Smart 8.0 Head-up Display
BOSE Premium Sound System with 8 Speakers & LED Sound Mood Lights
10.25 HD Touchscreen Navigation
Smart Pure Air Purifier with UVO Controls
Rear Sunshade Curtains
Remote Start & Voice Recognition with 37 Connectivity Features

Close to you, no matter where you are
Kia presents a nation-wide network of dealerships and service centres to ensure ready spare parts availability and quick service.
160 City Coverage
265 Consumer Touchpoints
206 Sales Points
192 Service Points

26 New Additional Features
Signature Tiger Nose Grille | R17 Crystal-cut Alloy Wheels | 6 Airbags | Ventilated Front Seats | Crown Jewel LED Headlamps | Sweeping LED Light Bar | Heartbeat LED DRL | Multi-layer Side Turn Indicator | Heartbeat LED Tail Lamps | Ice Cube LED Fog Lamps | Electric Sunroof | Dual Trims – GT Line and Tech Line | Dual Muffler Design | Red Brake Caliper | Red Center Cap | Ambient Mood Lighting | Advance 7.0 Colour Display Cluster | Multi-drive Mode | Multi-traction Mode | Front Sensor | 4 Disc Brakes | 360° View Camera with Blind View Monitor (BVM) | Reclining Rear Seats | Solar Glass | Driving Rear View Monitor (DRVM) | 8-way Driver Power Seat

For more information contact - 1800 108 5000

T&C Apply. Visit your nearest Kia dealership for more details. The product shown is for representation purpose only, actual features, colours and specifications as shown may not be part of standard fitment and may vary. Segment is defined as Mid SUV whose length lies between 4260-4390mm and width between 1775-1825mm. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on roads.

KIA
The Power to Surprise

FOR INFORMATION CONTACT: TELANGANA: HYDERABAD: CAR KIA, JUBILEE HILLS, PH: 7997720333, AUTOMOTIVE, KONDAPUR, PH: 6309908117, AUTOMOTIVE, LB NAGAR, NAGOLE, PH: 6309908118, VIHAAN AUTO, SECUNDERABAD, PH: 9738312345, VIHAAN AUTO, KUKATPALLY, PH: 9394812345 ANDHRA PRADHESH: GUNTUR: SIMHA, INDIRA AUTONAGAR, PH: 7331122066 TIRUPATI: HOSHI AUTO, TIRUPATI, PH: 8688829739 VIJAYAWADA: SIMHA, RAMACHANDRA NAGAR, PH: 7331122055 RAJAHMUNDRY: KANTIPUDI KIA, LALACHERUVU, PH: 9015112345 VISAKHAPATNAM: LAKSHMI KIA, BIRLA JUNCTION, PH: 7997916999 ANANTAPUR: MG BROTHERS, ANANTAPUR, PH: 8333099186

HAPPY Friendship DAY

**సాక్షి** రాష్ట్రీయం

4 నల్లగొండ | ఆదివారం | ఆగస్టు | 4 | 2019, www.sakshi.com



# సీత.. ఆమె ఫ్రెండు..

ఫ్రెండ్‌షిప్ అనేసరికి ఓసారి పురాణాల వైపు చూస్తే.. శ్రీకృష్ణుడు, సుధాముడు.. కర్ణుడు, ధుర్యోధనుడు.. అర్జునుడు, కృష్ణుడు.. ఇలా.. వీరి గురించి అందరికీ తెలిసిందే. మరి.. త్రిజట, సీత స్నేహం గురించి ఎందరికి తెలుసు.. ముఖ్యంగా ఇప్పటి తరానికి.. ఇంతకీ ఆ స్టోరీ ఏమిటంటే.. రావణాసురుడు సీతని అపహరించి లంకలోని అశోకవనంలో ఉంచాడని మనకు తెలుసుగా.. అప్పుడు సీతకు కాపలాగా త్రిజట అనే రాక్షసిని పెట్టారు.. రావణుడి గూఢచారి అయినా.. త్రిజట ధర్మం వైపే నిలిచింది.. సీతకు అండగా నిలిచింది.. శ్రీరాముడి విజయాన్ని కోరుకుంది. సీతమ్మకు ఏలోటూ రాకుండా సకల సౌకర్యాలు సమకూర్చడమే కాదు.. బయట నుంచి అన్ని వార్తలను మోసుకొచ్చి సీతమ్మ చెవిలో వేసేది. అలా వారిద్దరి మధ్య స్నేహం బలపడింది. సీతను విడిపించేందుకు శ్రీరాముడు వానర సైన్యంతో లంకకు వచ్చాడన్న వార్త సీతకు సంతోషం కలిగించలేదు. రామ, రావణ యుద్ధంలో శ్రీరాముడికి ఏం జరుగుతుందోనని ఆందోళన చెందింది. ఒకానొక దశలో రాముడు ఇక లేడేమోనన్న బెంగతో కుంగిపోయింది. అప్పుడు శ్రీరాముడి క్షేమ సమాచారాలను సీతమ్మకు తెలియజేసి ఆమె కన్నీరు తుడిచింది త్రిజటే. రావణ సంహారం తర్వాత త్రిజట చేసిన సాయానికి కృతజ్ఞతగా సీతారాములు ఆమెకు వెలలేని కానుకలిచ్చి సత్కరించారు. పేరుకు రాక్షసి అయినా సుతిమెత్తని ఆమె హృదయం అందరి మనసుల్ని దోచేసింది. అందుకే ఉజ్జయినీ, వారణాసిలో ప్రజలు త్రిజటను ఒక దేవతగా ఇప్పటికీ ఆరాధిస్తారు.



## ట్రెండు మారినా.. ఫ్రెండ్ మారడే..



సాధారణంగా మనసుకు దగ్గరైన స్నేహితులను కుటుంబంలో వ్యక్తిగా అభివర్ణిస్తుంటాం. అది కొంత వరకు నిజమే. ఎందుకో తెలుసా? డీఎన్ఏలో కూడా కొంత కామన్‌గా ఉండటమే.. ప్రాణ స్నేహితుల డీఎన్ఏలో ఒకశాతం మేర ఒకేవిధంగా ఉంటుందట. యేల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు దాదాపు రెండు వేల మందిపై జరిపిన పరిశోధనల్లో ఈ విషయం తేలింది. చాలామంది కొంత మేర జన్యువులను పంచుకున్నట్లు వెల్లడైంది.



మీరు అపాయంలో లేదా ఆపదలో ఉన్నప్పుడు మీ మెదడు ఎలా స్పందిస్తుందో.. మీ క్లోజ్ ఫ్రెండ్ ఆపద లేదా అపాయంలో ఉన్నప్పుడు కూడా మీ మెదడు అలాగే స్పందిస్తుందట. సూపర్ కదూ..

## రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ వచ్చేలా ఉంది

### సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజలకు వైద్యం అందక హెల్త్ ఎమర్జెన్సీ వచ్చేలా ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శనివారం అసెంబ్లీ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమయ్యే మందుల్లేవని, వైద్యం చేయడానికి సరిపడా డాక్టర్లు లేరని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టులు లేక మహిళలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం బాధాకరమన్నారు. సీజనల్ వ్యాధులతో ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్, గాంధీ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నా.. డాక్టర్లు సరిపడా లేకపోవడం ఏంటని భట్టి ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో తెచ్చిన 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలు పనిచేయడంలేదని ఆరోపించారు. ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ తన సొంత ఊరికే పరిమితమయ్యారని, కనీసం ఫోన్లో కూడా దొరికే పరిస్థితి లేదన్నారు. దీనిపై సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి ప్రజలకు సరైన వైద్యం అందేలా చూడాలని కోరారు.

## కాళేశ్వరంతో ఆర్థిక భారం: జీవన్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** మేడిగడ్డ నుంచి గోదావరి నీటిని తీసుకుంటూ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.50 వేల కోట్ల ఆర్థిక భారం పడిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. అవసరం లేకున్నా మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను నిర్మించారని, వరద లేని రోజుల్లో నీటిని ఎత్తిపోసి, వరద వస్తున్న సమయంలో సముద్రంలోకి నీటిని వదులుతున్నారని ఎద్దేవా చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపాదించిన తమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి సుందిళ్లకు నీటిని తరలిస్తే లాభసాటిగా ఉండేదని, ప్రాజెక్టుకు అవసరమైన 2 టీఎంసీల నీటి లభ్యత తమ్మిడిహెట్టి వద్ద ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి పాయింట్‌ను కాదని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరంతో కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే నీళ్లు అదనంగా వస్తాయని, అదీ గోదావరి వరద వచ్చినప్పుడే సాధ్యమవుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒంటెత్తు పోకడలతో ప్రజాధనమంతా వృథా అయిందన్నారు. ఎల్లంపల్లి నుంచి నీటిని మిడ్‌మానేరుకు తరలించడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు.

## అపాయింట్‌మెంట్ ఇవ్వండి

### సీఎం కేసీఆర్‌కు మాజీ ఎంపీ పొన్నం లేఖ



**సాక్షి, హైదరాబాద్:** కరీంనగర్ జిల్లాలో నెలకొన్న ప్రజా సమస్యలను వివరించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన లేఖ రాశారు. కరీంనగర్ జిల్లాలో అనేక ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 5వ తేదీన కరీంనగర్ లేదా ప్రగతిభవన్‌లో తమ జిల్లా నేతల బృందానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

## నిధులడిగితే నిర్బంధిస్తారా?: మల్లు రవి



**సాక్షి, హైదరాబాద్:** గ్రామాభివృద్ధికి నిధులు అడిగిన సర్పంచ్‌లను నిర్బంధించడం ఏమిటని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ జడ్చర్లలో నిధుల కోసం అధికారులకు వినతిపత్రం ఇద్దామని వస్తే సర్పంచ్‌లను నిర్బంధించారని మండిపడ్డారు. కొత్త సర్పంచ్‌లు వచ్చి నెలలు గడుస్తున్నా చెక్ పవర్‌పై స్పష్టత లేదని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కడతారని జోస్యం చెప్పారు.

## ఫోన్ చేస్తే చార్జిషీట్‌లో పేరు చేరుస్తారా?

### బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య



**సాక్షి, హైదరాబాద్:** ప్రాణభయం, కష్టాలు, నష్టాలు ఉన్నాయని తన వద్దకు వచ్చిన బాధితుల తరఫున ఫిర్యాదు చేయడానికి నయీంకు ఫోన్‌చేస్తే తన పేరు చార్జిషీట్‌లో చేర్చుతారా? అని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నయీంతో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, వ్యాపారస్తుల పేర్లు మాత్రం చార్జిషీట్‌లో ఎక్కడా కనిపించడం లేదని శనివారం విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. రోజూ అనేక మంది తన దగ్గరకు వస్తారని, సమస్యల పరిష్కారంలో భాగంగా నయీంతో మాట్లాడానని తెలిపారు. నయీం డైరీని బయటపెడితే అన్ని విషయాలు బయటపడతాయన్నారు. 45 ఏళ్లుగా బీసీల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నానని, నిజం ఇప్పుడు కాకపోయినా రేపైనా బయటపడక తప్పదని స్పష్టంచేశారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## ఉపరాష్ట్రపతితో ఎంపీ కోమటిరెడ్డి భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడిని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంట ఆయన కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

## అభ్యాస వర్గలో ప్రత్యేక ఆకర్షణగా సంజయ్



**సాక్షి, న్యూఢిల్లీ:** బీజేపీ ఎంపీలకు అభ్యాస వర్గ పేరుతో ఇక్కడ ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రెండు రోజులపాటు జరగనున్న అభ్యాస వర్గ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీకి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికే అవకాశం బండి సంజయ్‌కి దక్కింది. ప్రధానితో పాటు, బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు కూడా సంజయ్ కండువా కప్పి ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్వాగతం పలికారు.

## విద్యారంగాన్ని బలోపేతం చేయాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. తమ సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) గత నెల 12 నుంచి నిరసనలు చేపడుతున్నందున వెంటనే ప్రభుత్వం స్పందించాలని సూచించింది. గతేడాది మేలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీని సమావేశానికి పిలిపించి 18 సమస్యలను పరిష్కరిస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ మీడియా ముందు ప్రకటించినా నేటికీ అమలుకు నోచుకోలేదని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో విమర్శించారు.

# మునిసి'పోల్స్'పై ప్రతిష్టంభన

- హైకోర్టులో కేసులు, వరుస స్టేలతో బ్రేక్
- రిజర్వేషన్లపై ముందుకెళ్లాలా? తుది తీర్పుకోసం వేచిచూడాలా?
- పరిస్థితులను సమీక్షిస్తున్న ప్రభుత్వం
- ఎన్నికల సన్నద్ధతకు 5 నెలల గడువు కోరిన పురపాలక శాఖ
- సగం పురపాలికల్లో ఎన్నికలపై స్టే కూడా ఓ అవరోధమే
- ఎప్పుడు ఓకే చెప్పినా 20 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామంటున్న ఎస్ఈసీ

**సాక్షి, హైదరాబాద్:** మునిసిపల్ ఎన్నికల నిర్వహణపై ప్రతిష్టంభన నెలకొంది. ఈ ఎన్నికల అంశం హైకోర్టు పరిధిలోకి వెళ్లడంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. వార్డుల పునర్విభజన ప్రక్రియ, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ ఉన్నత న్యాయస్థానంలో కేసులు.. వరుస స్టేలతో సర్కారు తన దూకుడును తగ్గించింది. పంద్రాగస్టులోపు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. తాజా పరిణామాలను సమీక్షిస్తోంది. దీనికితోడు ఎన్నికల సన్నద్ధతకు 5 నెలల టైమ్‌లైన్ అవసరమని పురపాలకశాఖ దాఖలు చేసిన కౌంటర్ కూడా సర్కారుకు చిన్నపాటి సమస్యగా మారింది. ఈ టైమ్‌లైన్‌తో సంబంధం లేకుండా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై విపక్షాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం.. ఈ కేసు విచారణ వాయిదా పడటంతో మునిసిపల్ ఎన్నికల నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది.

### ఏం చేద్దాం!

పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీ కాలం 2 నెలల క్రితం ముగిసింది. కాలపరిమితిలోపు ఎన్నికలు నిర్వహించాలని ముందుగా ప్రభుత్వం భావించినా.. కొత్త పురపాలక చట్టం తేవాలనే ఉద్దేశంతో ప్రత్యేకాధికారులను నియమించింది. గత నెల 18, 19వ తేదీల్లో జరిగిన శాసనసభ సమావేశాల్లో కొత్త మునిసిపల్ చట్టానికి ఆమోదముద్ర పడగానే.. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. అయితే, ఈ హడావుడే ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసింది. వార్డుల పునర్విభజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, జాబితాల రూపకల్పనలో శాస్త్రీయత లోపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటితోపాటుగా న్యాయస్థానంలో కేసులు నమోదు కావడం.. దాదాపుగా సగం కార్పొరేషన్లు/మునిసిపాలిటీల ఎన్నికలకు స్టే విధించడంతో ఎన్నికల ప్రక్రియకు అవరోధంగా మారింది.

### వేచిచూసే ధోరణి!

గత నెల 29న హైకోర్టు వ్యక్తం చేసే అభిప్రాయాలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణపై ముందడుగు వేయాలని పురపాలక శాఖ భావించింది. అవసరమైతే ఆలోపే రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను కూడా పూర్తిచేసే అంశాన్ని పరిశీలించింది. రిజర్వేషన్లను ఖరారు చేయవద్దనిగానీ.. అప్పటివరకు ఎన్నికలను నిలుపుదల చేయాలనిగానీ చెప్పనందున న్యాయపరమైన చిక్కులు రాకపోవచ్చని భావించింది. అయితే, ఆ రోజు కూడా కేసు విచారణ వాయిదా పడటంతో పురపాలక శాఖ ఆత్మరక్షణలో పడింది. కేసు ఎప్పటిలోగా కొలిక్కి వస్తుందనే అంశంపై కూడా స్పష్టత లేనందున వేచిచూసే ధోరణిని అవలంబించడమే మంచిదనే భావనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఒకవేళ కాదూ.. కూడదని రిజర్వేషన్ల ఖరారు చేసినా.. ఇప్పటికే సగం మునిసిపాలిటీలకు స్టేలు వచ్చినందున అభాసుపాలు కావడం తప్ప మరోటి ఉండదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రిజర్వేషన్లను ఖరారు చేసి జాబితాను అందజేస్తే 20 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) హైకోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో స్పష్టం చేసింది.

### మా అనుమతితోనే బదిలీలు..!

ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్ష విధులు నిర్వర్తించే ఉద్యోగుల బదిలీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు/ఉద్యోగులకు స్థానచలనం కలిగిస్తే.. దాని ప్రభావం ఎన్నికల నిర్వహణపై పడుతుందని ఈసీ స్పష్టం చేసింది. జిల్లా స్థాయిలో అదనపు ఎన్నికల అధికారులుగా వ్యవహరించే జాయింట్ కలెక్టర్లు, రీజనల్ జాయింట్ డైరెక్టర్లను మార్చకూడదని తేల్చిచెప్పింది. నారాయణపేట జిల్లా అదనపు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓను మార్చడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎన్నికల అధికారులు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తి చేసినందున.. సంబంధిత అధికారులను బదిలీ చేయాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఎస్ఈసీ పేర్కొంది.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుత్తా

- నల్లగొండ మాజీ ఎంపీ పేరును ఖరారు చేసిన కేసీఆర్
- నామినేషన్ పర్యవేక్షణ బాధ్యత ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డికి
- రైతు సమన్వయ సమితి చైర్మన్ పదవికి గుత్తా రాజీనామా



**సాక్షి, హైదరాబాద్:** శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 26న జరిగే ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా నల్లగొండ మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరును పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ శనివారం ఖరారు చేశారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఎమ్మెల్సీ ఉప ఎన్నిక స్థానానికి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. గుత్తా నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డికి కేసీఆర్ అప్పగించారు. తనను ఎమ్మెల్సీగా ప్రకటించడంపై కేసీఆర్‌కు గుత్తా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో ప్రగతిభవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రిని సుఖేందర్‌రెడ్డి కలిశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారనే ఫిర్యాదుతో ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డిపై శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ఈ ఏడాది జనవరి 16న అనర్హత వేటు వేశారు. ఆ తర్వాత హైకోర్టు కూడా చైర్మన్ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు వెలువరించింది. శాసనమండలి సభ్యుడిగా యాదవరెడ్డి పదవీ కాలం 2021 జూన్ మూడో తేదీ వరకు ఉంది. అనర్హత వేటు నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 1న ఖాళీగా ఉన్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల 7న మొదలయ్యే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ 14 వరకు కొనసాగనుంది. ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప ఎన్నిక నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే 119 మంది శాసనసభ్యులున్న రాష్ట్ర అసెంబ్లీలో టీఆర్ఎస్‌కు 104 మంది సభ్యుల బలం ఉండటంతో.. ఎమ్మెల్సీగా గుత్తా ఎన్నిక ఏకగ్రీవం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

**రైతు సమన్వయ సమితికి రాజీనామా..**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా తన పేరు ఖరారు కావడంతో రైతు సమన్వయ సమితి రాష్ట్ర కమిటీ చైర్మన్ పదవికి గుత్తా సుఖేందర్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను శనివారం ఉదయం వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శికి అందజేశారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి గుత్తా చేసిన సేవలను గుర్తు చేస్తూ.. రాజీనామా లేఖను ఆమోదిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సాయంత్రం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

# డయాలసిస్‌కు బ్రేక్!

- ఆరోగ్యశ్రీలో ఇతర వైద్య సేవలూ అనధికారికంగా నిలిపివేత
- బకాయిలు పెరగడంతో సేవలు నిలిపివేసిన ప్రైవేట్ ఆస్పత్రులు
- త్వరలో కొంతమేర బకాయిలు చెల్లించాలని సర్కారు యోచన

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. దీంతో పేద రోగులైన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు అందక నరకయాతన పడుతున్నారు. డయాలసిస్ అత్యవసర సేవలు అందకపోతే రోగి పరిస్థితి విషమిస్తుంది. కొన్నిచోట్ల ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు అప్పు, సప్పు చేసి ఇతర ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకుంటుండగా, కొందరు స్తోమత లేక అలాగే ఉండిపోతున్నారు. దీంతో వారు ప్రాణాపాయ స్థితి చేరుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడం, తమ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారడంతో డయాలసిస్ సేవలను నిలిపివేసినట్లు ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. కేవలం డయాలసిస్ సేవలకే పరిమితం కాకుండా కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులైతే మిగిలిన వైద్య సేవలను అనధికారికంగా నిలిపివేసినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆరోగ్యశ్రీ రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇది పేదలకు పెనుశాపంగా మారింది.

**10 రోజులు దాటితే అంతే...**

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుతున్నాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులు, పీపీపీ విధానంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేసే యూనిట్లు మొత్తం 89 ఉన్నాయి. ఇవే కాకుండా నిమ్స్, గాంధీ, ఉస్మానియాలతోపాటు జిల్లా ఆస్పత్రుల్లో కూడా డయాలసిస్ సేవలను అందిస్తున్నారు. ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు నిలిచిపోవడంతో ఇప్పుడు రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ చేయించుకోలేని దుస్థితి. డయాలసిస్ సేవలు అందకపోతే రోగి పరిస్థితిని బట్టి వారం నుంచి పది రోజుల వరకు ఉండగలుగుతారు. అంతకుమించితే ప్రాణానికి ఆపాయం ఎక్కువన్నది వైద్యుల అభిప్రాయం.

**రూ.700 కోట్ల బకాయి...**

బకాయిలు పేరుకుపోవడంతోనే నెట్‌వర్క్ ఆసుపత్రులు డయాలసిస్ సేవలను నిలిపివేశాయని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు నిర్ధారించాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు అంచనా ప్రకారం దాదాపు రూ.700 కోట్లు సర్కారు నెట్‌వర్క్ ఆసుపత్రులకు సర్కారు చెల్లించాల్సి ఉంది. ఒక నెట్‌వర్క్ ఆసుపత్రికైతే ఏకంగా రూ. 70 కోట్లు, మరో నెట్‌వర్క్ ఆసుపత్రికి రూ. 40 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. దీంతో డయాలసిస్ సేవలను నిలిపివేసినట్లు ప్రైవేటు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇదిలావుంటే ఒక్క డయాలసిస్ కోసం ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో నడిచే కేంద్రాల్లో రూ.1,400 చెల్లిస్తోంది. అయితే ప్రైవేటులో అందించే ఒక్కో డయాలసిస్‌కు ప్రభుత్వం రూ.1,200 మాత్రమే చెల్లిస్తోంది. మరోవైపు రోజూ సేవలందించే డయాలసిస్ యంత్రాల నిర్వహణ ఖర్చును కూడా సర్కారు ఇవ్వడం లేదని ప్రైవేటు ఆస్పత్రులు ఆరోపిస్తున్నాయి. కాగా, రెండు మూడు రోజుల్లో రూ. 300 కోట్ల మేరకు నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

- పేదలకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించే ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు: 330
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ చేసే యూనిట్లు ఉన్నవి: 50
- సర్కారు ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో డయాలసిస్ చేసే ప్రాంతాలు: 39
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులతో కలిపి రోజూ డయాలసిస్ చేయించుకునేవారు: 9,069 మంది
- ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు పొందేవారు: 5,298 మంది
- ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రాల్లో డయాలసిస్ చేయించుకుంటున్న వారు: 3,771 మంది

# నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

- రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 390.7 మి.మీ. కాగా ప్రస్తుతం 381.4 మి.మీ.

సాక్షి, హైదరాబాద్

వాయవ్య బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న ఒడిశా, పశ్చిమబెంగాల్ తీర ప్రాంతాలలో 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంపు తిరిగి ఉంది. మరోవైపు ఆదివారం ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఫలితంగా ఆది, సోమవారాల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లా బజర్హత్నూర్‌లో 13 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. మల్కాజిగిరి మండలం దిండిగల్‌లో 12 సెం.మీ., జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం, పేరూరులలో 11 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 10 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా జుక్కల్, ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులలో 9 సెం.మీ., నాగారెడ్డిపేట, కాళేశ్వరం, పినపాక, రంజల్, లింగంపేట, సారంగాపూర్, బాన్సువాడ, యల్లారెడ్డిలలో 8 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 3 రోజులుగా ముసురు వాతావరణం నెలకొని ఉంది. దీంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పడిపోయాయి. రాష్ట్రంలో వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. జూన్ ఒకటో తేదీ నుంచి శనివారం నాటికి సాధారణంగా కురవాల్సిన వర్షపాతం 390.7 మిల్లీమీటర్లు (మి.మీ.) కాగా, ఇప్పటివరకు 381.4 ఎంఎంలు నమోదైంది. వరంగల్ అర్బన్‌లో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 30 శాతం అధిక వర్షపాతం రికార్డు కావడం గమనార్హం. ఒక్క శనివారమే రాష్ట్రంలో సాధారణం కంటే 397 శాతం అధిక వర్షపాతం నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం సాధారణంగా 7.5 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఏకంగా 37.3 మి.మీ. నమోదైంది. సిద్దిపేట జిల్లాలోనే ఒక్క రోజులో ఏకంగా 41.8 మి.మీ. నమోదైంది.

**శనివారం నమోదైన వర్షపాతం వివరాలు**

| ప్రాంతం | వర్షపాతం(సెం.మీ.) |
|---|---|
| బజార్‌హత్నూర్ | 13 |
| దిండిగల్ | 12 |
| వెంకటాపురం, పేరూర్ | 11 |
| బోథ్ | 10 |
| జుక్కల్, బెజ్జూరు | 9 |

# పరపతి పోయింది!

''నా జీతం నుంచి కట్ చేసి సహకార పరపతి సంఘం (సీసీఎస్)లో డిపాజిట్ చేసిన డబ్బు రూ.రెండున్నర లక్షలు ఉంది. అందులోంచి రూ. 2.5 లక్షల రుణం కోరితే లేదంటే ఎలా?. అత్యవసరమై పిల్లల చదువు కోసం బయట అప్పు చేశా. ప్రతినెలా రూ.10 వేలు వడ్డీ కట్టాల్సి వస్తోంది. వేతనంలో అంత మొత్తం అటు పోతే మేము బతికేదెట్లా''

– నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ గోడు

కుటుంబ అవసరాల కోసం ఓ కండక్టర్ వడ్డీ వ్యాపారి వద్ద రూ.9 లక్షలు అప్పు చేశాడు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు ఆయన కుటుంబం అప్పు తీర్చేదెలా అని లబోదిబోమంటోంది. అదే ఆర్టీసీ సహకార పరపతి సంఘం నుంచి లోన్ వచ్చి ఉంటే, ఆయన చనిపోయినందున నిబంధనల ప్రకారం ఆ అప్పు మాఫీ అయి ఉండేది.

– హైదరాబాద్‌కు చెందిన కండక్టర్ కుటుంబం ఆవేదన

- సహకార పరపతి సంఘం నిధులు స్వాహా చేసిన ఆర్టీసీ
- సొమ్ము లేక రుణాలు పొందలేకపోతున్న ఉద్యోగులు
- హైకోర్టు తలుపుతట్టిన సీసీఎస్

ఇలా ఎంతో మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు ప్రతి నెలా తమ జీతంలో నుంచి దాచి పెట్టుకున్న నిధిని ఆర్టీసీ యాజమాన్యం స్వాహా చేసేయటమే దీనికి కారణం. ఏడాది కాలంగా ఆ మొత్తాన్ని సొంత అవసరాలకంటూ ఆర్టీసీ వాడేసుకుని, ఇప్పుడు చెల్లించలేమంటూ చేతులెత్తేయడంతో కుటుంబ అత్యవసరాలకు రుణాలు అందక కార్మికులు అవస్థలు పడుతున్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, ఇళ్లు కట్టుకోవటం తదితర అవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదీ ఒకప్పుడు ఎంతో ఘనకీర్తిని మూటగట్టుకున్న ఆర్టీసీ సహకార పరపతి సంఘం దీనావస్థ. కాగా, ఆర్టీసీ యాజమాన్య తీరును నిరసిస్తూ ఆ సంఘం నిర్వాహకులు చరిత్రలో తొలిసారిగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తలుపుతట్టారు.




– సాక్షి, హైదరాబాద్

### ఏమిటీ ఈ నిధి..

ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు అవసరాల కోసం ప్రత్యేకంగా సహకార పరపతి సంఘం ఏర్పాటైంది. ప్రతి ఉద్యోగి జీతంలో బేసిక్‌పై 7 శాతం మొత్తాన్ని సంస్థ కట్ చేసి ఈ సంఘానికి జమ చేస్తుంది. అలా ప్రతినెలా తెలంగాణ ఆర్టీసీలో రూ.40 కోట్లు జమ కావాలి. అలా వచ్చే మొత్తం నుంచి కార్మికులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు కట్టుకోవటం... తదితర అవసరాలకు రుణంగా పొందుతారు. ఆ మొత్తాన్ని బ్యాంకు వడ్డీ కంటే తక్కువ వడ్డీతో చెల్లిస్తారు.

### జరిగింది ఇదీ..

దాదాపు 12 నెలలుగా ఆర్టీసీ ఆ నిధులను సీసీఎస్‌లో జమ చేయటం లేదు. దీంతో ఏడు నెలలుగా సీసీఎస్ అధికారులు రుణాలు ఇవ్వలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులూ రావటం లేదని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఉపయోగం లేదని అధికారులు పేర్కొనటంతో గత్యంతరం లేక సీసీఎస్ హైకోర్టును ఆశ్రయించింది. గతంలో సీసీఎస్ నిధిని వాడుకుంటే ఆర్టీసీ వడ్డీతో సహా తిరిగి చెల్లించేది. కానీ టీఎస్ఆర్టీసీ ఏర్పడినప్పటి నుంచి వడ్డీ ఇవ్వక రూ.45 కోట్ల బకాయిలు పడింది. దీంతో సీసీఎస్ అంటేనే కార్మికులకు నమ్మకం సడలింది. కొంతకాలంగా దాదాపు 4 వేల మంది కార్మికులు సభ్యత్వాన్ని రద్దు చేసుకుని బయటకొచ్చారు.

- **8,546:** ఇప్పటివరకు అత్యవసరాలకు రుణం కావాలంటూ దరఖాస్తు చేసుకున్న కార్మికుల సంఖ్య
- **రూ.236 కోట్లు:** ఇప్పటివరకు ఉన్న దరఖాస్తులకు రుణం ఇవ్వాలంటే కావాల్సిన మొత్తం
- **రూ.490 కోట్లు:** అవసరాల కోసమంటూ 'కార్మిక నిధి'నుంచి సంస్థ వాడుకున్న మొత్తం
- **రూ.220 కోట్లు:** కార్మికులకు రుణం ఇవ్వడం కోసం సీసీఎస్ బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు



శనివారం స్వస్థలాలకు వెళ్లేందుకు వచ్చిన యాత్రికులతో నిండిపోయిన జమ్మూ రైల్వే స్టేషన్

## కేంద్రం ఈ దిశగా ఆలోచిస్తోందా?

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో కేంద్రం ప్రధానంగా రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు న్యాయ, రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. ఇందులోభాగంగా కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 35ఏ, ఆర్టికల్ 370లను కేంద్రం రద్దుచేయడం మొదటిది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు జమ్మూకశ్మీర్‌లో ఆస్తులను కొనుగోలు చేసేందుకు, అక్కడే స్థిరపడేందుకు వీలు కలుగుతుంది. అయితే ఈ నిర్ణయంతో భారత్‌లో విలీనమయ్యేందుకు కశ్మీర్‌తో చేసుకున్న ఒప్పందం చెల్లకుండాపోయే ప్రమాదముంది. దీన్ని నివారించేందుకు జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో కలిపేస్తున్నట్లు రాష్ట్రపతి కోవింద్ ఆదేశాలు జారీచేసినా అనేక న్యాయపరమైన చిక్కుముళ్లు ఎదురవుతాయని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

### మూడు ముక్కలు చేయడం..

ఇక రెండో ప్రతిపాదన ఏంటంటే జమ్మూకశ్మీర్‌ను మూడు ముక్కలు చేయడం. అంటే జమ్మూను ఓ రాష్ట్రంగా, కశ్మీర్, లడఖ్‌లను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చే ప్రతిపాదన కేంద్రం దృష్టిలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇది అనుకున్నంత సులభమేంకాదని రాజ్యాంగ, న్యాయ నిపుణులు అంటున్నారు. రాష్ట్రాన్ని విడగొట్టాలంటే సమగ్రమైన అధ్యయనాలతో పాటు సరిహద్దుల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం చాలా సమయం పడుతుంది. కానీ ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం యత్నాలు ప్రారంభించినట్లు ఇప్పటివరకూ ఎలాంటి సంకేతాలు లేవన్నది నిపుణుల మాట. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందో అని సర్వత్రా ఆసక్తి నెలకొంది.




## 35ఏ ఎందుకంత ప్రాముఖ్యం?

- జమ్మూకశ్మీర్ సంస్థానాధీశుడు మహారాజా హరి సింగ్ 1927, 1932లో జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర పరిధిలోని అంశాలు, ప్రజల హక్కులను నిర్వచించారు. ఇదే చట్టాన్ని వలస వచ్చిన వారికీ వర్తింపజేశారు.
- కశ్మీర్ పగ్గాలు చేపట్టిన షేక్ అబ్దుల్లా 1949లో భారత ప్రభుత్వంతో జరిపిన చర్చల ఫలితంగా రాజ్యాంగంలో ఆర్టికల్ 370 చేరింది. దీంతో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి లభించింది. ఆ రాష్ట్రంపై భారత ప్రభుత్వ అధికారాలు.. రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార రంగాలకే పరిమితమయ్యాయి.
- షేక్ అబ్దుల్లా, నెహ్రూ మధ్య కుదిరిన ఢిల్లీ ఒప్పందం ప్రకారం 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు జమ్మూకశ్మీర్‌కు సంబంధించి 35ఏతోపాటు మరికొన్ని ఆర్టికల్స్‌ను రాజ్యాంగంలో చేర్చారు.
- 1956లో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం రూపుదిద్దుకుంది. దాని ప్రకారం.. 1911కు పూర్వం అక్కడ జన్మించిన, వలస వచ్చిన వారే కశ్మీర్ పౌరులు. అంతేకాకుండా, 1911కు ముందు పదేళ్లకు తక్కువ కాకుండా అక్కడ ఉంటున్న వారికే స్థిరాస్తులపై హక్కుంటుంది. జమ్మూకశ్మీర్ నుంచి వలసవెళ్లిన వారు, ఇంకా పాకిస్తాన్ వెళ్లిన వారు కూడా రాష్ట్ర పౌరులుగానే పరిగణిస్తారు.

# మంచు దుప్పట్లో సెగలు!

శ్రీనగర్/జమ్మూ/న్యూఢిల్లీ

**ఓవైపు భారీగా బలగాల మోహరింపు.. మరోవైపు కేంద్రం మౌనంతో జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా తయారైంది.**

**జమ్మూకశ్మీర్‌లో శాశ్వతనివాసం, స్వయం ప్రతిపత్తికి సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఏ, ఆర్టికల్ 370లను కేంద్రం రద్దుచేయబోతోందన్న వదంతుల నేపథ్యంలో ప్రతిపక్షాలు గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో శనివారం భేటీ అయ్యాయి. ఉగ్రముప్పు ఉన్నప్పటికీ పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ తన భద్రతాసిబ్బంది కళ్లుగప్పి నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఇంటికి వెళ్లారు. కేంద్రం తీసుకునే ఎలాంటి చర్యనైనా కలసికట్టుగా ఎదుర్కొందామని కోరారు. అనంతరం ఇతర కశ్మీరీ నేతలతో కలిసి గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో భేటీ అయ్యారు. దీంతో జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఎలాంటి రాజ్యాంగ నిబంధనల్ని సవరించడం లేదనీ, వదంతుల్ని నమ్మవద్దని మాలిక్ రాజకీయ నేతలు, మద్దతుదారులకు విజ్ఞప్తి చేశారు. జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న అనిశ్చితిపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేయగా, ఈ విషయంలో కశ్మీరీ ప్రజలకు పార్లమెంటు హామీ ఇవ్వాలని ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా కోరారు.**



**రాజ్యాంగంలోని ఆర్టికల్ 35ఏ, ఆర్టికల్ 370ను రద్దుచేస్తారని ప్రచారం**

- గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా సహా పలువురు నేతల భేటీ
- కేంద్రం ఎలాంటి రాజ్యాంగ సవరణల్ని చేపట్టడం లేదన్న గవర్నర్ మాలిక్
- శ్రీనగర్ నుంచి పర్యాటకుల తరలింపునకు 32 విమానాల ఏర్పాటు

### రంగంలోకి ఐఏఎఫ్ విమానాలు..

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి జరగొచ్చన్న ఆర్మీ హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పాలనా యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. పలువురు పర్యాటకుల్ని, అమర్‌నాథ్ యాత్రికులను ప్రత్యేక వాహనాల్లో శ్రీనగర్ విమానాశ్రయానికి తరలించాయి. జమ్మూకశ్మీర్‌లో శుక్రవారం నాటికి 20,000 నుంచి 22,000 మంది పర్యాటకులు ఉన్నారు. అయితే ఉగ్రహెచ్చరికల నేపథ్యంలో గుల్మార్గ్, పెహల్గామ్ వంటి పర్యాటక ప్రాంతాల నుంచి 6,126 మంది పర్యాటకులను శ్రీనగర్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా 5,829 మందిని 32 విమానాల్లో శనివారం తమ స్వస్థలాలకు తరలించారు. భారత వాయుసేన(ఐఏఎఫ్)కు చెందిన విమానాల్లో మరో 387 మందిని గమ్యస్థానాలకు చేర్చారు. ఈ సందర్భంగా పలు విమానయాన సంస్థలు టికెట్ల రీషెడ్యూల్, రద్దుపై విధించే అదనపు చార్జీలను ఆగస్టు 15 వరకూ ఎత్తివేశాయి. టికెట్లను రద్దుచేసుకుంటే అదనపు చార్జీలు విధించబోమని రైల్వేశాఖ చెప్పింది. మరోవైపు భారత పర్యటనలో భాగంగా జమ్మూకశ్మీర్‌కు వెళ్లవద్దని తమ పౌరులను బ్రిటన్, జర్మనీ దేశాలు హెచ్చరించాయి. భద్రతా సిబ్బందిని సంప్రదించాకే కశ్మీర్‌లో పర్యటించాలనీ, ప్రస్తుతం అక్కడి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆస్ట్రేలియా తమ పౌరులకు స్పష్టం చేసింది.

### అవన్నీ వదంతులే.. నమ్మొద్దు: గవర్నర్ మాలిక్

జమ్మూకశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) నేత, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శనివారం గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 35ఏ, ఆర్టికల్ 370లను రద్దు చేయబోతోందని చెలరేగుతున్న వదంతులపై స్పష్టత ఇవ్వాల్సిందిగా కోరింది. దీంతో గవర్నర్ స్పందిస్తూ..'ఆర్మీ హెచ్చరికల తీవ్రతను దృష్టిలో ఉంచుకునే అమర్‌నాథ్ యాత్రను తక్షణం నిలిపివేయాల్సి వచ్చింది. ఇక నాకు తెలిసినంతవరకూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనల్ని సవరించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలకు కొందరు ఇతర కారణాలను ఆపాదిస్తున్నారు. దీనివల్ల ప్రజల్లో అనవసరంగా భయాందోళన చెలరేగుతుంది' అని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై వచ్చే వదంతుల్ని, పుకార్లను నమ్మవద్దనీ, ప్రశాంతంగా ఉండాలని రాజకీయ నేతలు, వారి మద్దతుదారులకు గవర్నర్ సత్యపాల్ మాలిక్ విజ్ఞప్తి చేశారు.

### 'బుద్ధ అమర్‌నాథ్ యాత్ర' రద్దు: వీహెచ్‌పీ

ఉగ్రదాడి హెచ్చరికల నేపథ్యంలో పూంఛ్ జిల్లాలో ఈ నెల 6 నుంచి పది రోజుల పాటు సాగనున్న 'బుద్ధ అమర్‌నాథ్ యాత్ర'ను రద్దు చేసుకుంటున్నట్లు విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ప్రకటించింది. ఈ విషయమై వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు లీలాకరణ్ శర్మ మాట్లాడుతూ..'అమర్‌నాథ్ యాత్రామార్గంలో అమెరికా తయారీ స్నైపర్ తుపాకీ, మందుపాతర లభ్యంకావడం, మరోవైపు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భక్తుల భద్రత రీత్యా బుద్ధ అమర్‌నాథ్ యాత్రను నిలిపివేస్తున్నాం. అలాగే కుల్గామ్ జిల్లాలో కౌశర్‌నాగ్ యాత్ర, కిష్త్వర్ జిల్లాలో మచైల్ యాత్రను నిలిపివేస్తున్నట్లు కూడా ఆపేస్తున్నాం' అని చెప్పారు.

### మోదీ ప్రకటన చేయాలి: ప్రతిపక్షాలు

అమర్‌నాథ్ యాత్రను కేంద్ర ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేయడంతో దేశ ప్రజల్లో తీవ్రమైన ఆందోళన నెలకొందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులామ్ నబీ ఆజాద్ తెలిపారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితిపై ప్రధాని మోదీ ఉభయసభలను ఉద్దేశించి ఓ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏల కొనసాగింపు విషయంలో తమకు పార్లమెంటు నుంచి హామీ కావాలని ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. భారత్‌లో విలీనం సందర్భంగా జమ్మూకశ్మీర్‌కు ఇచ్చిన హామీలు కాలాతీతమైనవని వ్యాఖ్యానించారు.

### ప్రజలను భయపెడుతున్నారు: బీజేపీ

ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేందుకు కాంగ్రెస్, పీడీపీ, ఎన్సీ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని బీజేపీ విమర్శించింది. ఈ విషయమై రాష్ట్ర బీజేపీ చీఫ్ రవీంద్ర రైనా మాట్లాడుతూ..'రాజకీయ నేతలు ప్రజలను భయాందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ పార్టీలన్నీ కేంద్రానికి సహకరించాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఏ కారణంగా రాష్ట్రంలో ప్రశాంతత అనేది కరువైంది. ఆగస్టు 15న లోయలోని అన్ని పంచాయతీల్లో మువన్నెల జెండాను ఎగురవేస్తాం' అని ప్రకటించారు.

### శ్రీనగర్-నిట్ క్లాసులు బంద్

శ్రీనగర్‌లోని ప్రఖ్యాత నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో తరగతుల్ని నిరవధికంగా సస్పెండ్ చేస్తున్నట్లు సంస్థ రిజిస్ట్రార్ తెలిపారు. తరగతులు ప్రారంభమయ్యే విషయమై తాము త్వరలోనే సమాచారం అందజేస్తామని వెల్లడించారు. శ్రీనగర్ జిల్లా యంత్రాంగం నుంచి అందిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ ఉత్తర్వులు జారీచేస్తున్నామని చెప్పారు. అయితే ఈ ప్రకటనను జిల్లా కలెక్టర్ షాహిద్ ఖండించారు. 'శ్రీనగర్-నిట్‌ను మూసివేయాల్సిందిగా మేం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో రకరకాల వదంతులు చెలరేగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని మాత్రమే సూచించాం' అని కలెక్టర్ షాహిద్ అన్నారు. నిత్యావసర దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఏటీఎంల ముందు ప్రజలు క్యూకట్టారు.

### భద్రతా సిబ్బందికి ముఫ్తీ షాక్

పీడీపీ అధినేత్రి, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ భద్రతా సిబ్బందికి షాక్ ఇచ్చారు. ఉగ్రముప్పు ఉన్నందున ఇంటి నుంచి బయటకు వెళ్లరాదని హెచ్చరించినప్పటికీ ఆమె శుక్రవారం రాత్రి సిబ్బంది కళ్లు కప్పి గుప్కార్ రోడ్డులోని ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా ఇంటికి చేరుకున్నారు. కశ్మీరీల హక్కుల్ని కాపాడుకునేందుకు చేతులు కలుపుదామని కోరారు. అయితే తన ఆరోగ్యం బాగోలేనందున కుమారుడు ఒమర్ అబ్దుల్లాతో ఈ విషయాన్ని చర్చించాలని ఫరూక్ సూచించారు. ఒమర్ ఆదివారం నిర్వహించే అఖిలపక్ష భేటీకి రావాలని కోరారు. దీంతో ముఫ్తీ పీపుల్స్ కాన్ఫరెన్స్ అధినేత సజ్జద్ లోనే, జేకేపీఎం అధినేత, మాజీ ఐఏఎస్ అధికారి షా ఫైజల్‌తో భేటీ అయ్యారు. అనంతరం వీరంతా రాజ్‌భవన్‌కు వెళ్లారు.

### రాజ్యాంగం ఏం చెబుతోంది?



జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూ, కశ్మీర్, లడఖ్ పేరిట మూడు ముక్కలుగా చేయడం అసాధ్యం కాదని కొందరు రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగంలోని కొన్ని నిబంధనల మేరకు పాకిస్తాన్ పక్కనే ఉన్న రాష్ట్రాల సరిహద్దులు మార్చవచ్చని అంటున్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను మరో అధికరణ 368(1) ద్వారా సవరించవచ్చు. ఇందుకోసం తొలుత లోక్‌సభ, ఆ తర్వాత రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కనీసం సగం రాష్ట్రాలు ఇందుకు ఆమోదం తెలిపితే, ఆర్టికల్ 370 రద్దవుతుంది. ఇది జరిగిన వెంటనే జమ్మూకశ్మీర్ సరిహద్దుల్ని నిర్ణయించే అధికారం పార్లమెంటుకు లభిస్తుంది. ఇక రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం ఇప్పటికే ఉన్న రాష్ట్రాలకు సరికొత్తగా సరిహద్దుల్ని ఏర్పాటు చేయడంతో పాటు కొత్త రాష్ట్రాలకు సరిహద్దుల్ని నిర్ణయించవచ్చు. కానీ దీనికి ఆర్టికల్ 370 అడ్డుపడుతున్న నేపథ్యంలో ఈ అధికరణాన్ని తొలగించడం తప్ప మరో మార్గం లేదని నిపుణులు అంటున్నారు. ఈ విషయమై లోక్‌సభ మాజీ కార్యదర్శి సుభాష్ కశ్యప్ మాట్లాడుతూ..'ఆర్టికల్ 370 అన్నది తాత్కాలిక నిబంధనే తప్ప ప్రత్యేకమైన నిబంధన కాదు. మన రాజ్యాంగంలో తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేకమైన అనే నిబంధనలున్నాయి. వీటిలో తాత్కాలికమన్నది అత్యంత బలహీనమైనది' అని తెలిపారు.



శ్రీనగర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద స్థానికుల పడిగాపులు

## మధ్యవర్తిత్వం ఫలించదని తెలుసు: యోగి



**అయోధ్య:** రామజన్మభూమి–బాబ్రీ మసీదు వివాదంలో మధ్యవర్తిత్వం ఫలించదని తనకు ముందే తెలుసని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. రామమందిర నిర్మాణానికి గట్టి మద్దతుదారైన రామచంద్రదాస్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన అయోధ్య చేరుకున్నారు. అక్కడ ఉన్న వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'ఈ మధ్యవర్తిత్వం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదని మనందరికీ తెలుసు. కానీ మధ్యవర్తిత్వం మంచిదే. ఒక ప్రయత్నం జరిగిందంటే మంచిదే. మహాభారతానికి ముందు కూడా ఓ మధ్యవర్తిత్వం జరిగింది. కానీ అది కూడా విఫలమైంది. రామ మందిరం కట్టాలన్నది ప్రజలందరి కోరిక. ప్రజల అభిమతం నెరవేరుతుందని నమ్ముతున్నా. త్రేతాయుగంలో అయోధ్య ఎలా ఉందో ఇప్పుడు కలియుగంలో కూడా దాన్ని అలాగే తీర్చిదిద్దుతాం' అని చెప్పుకొచ్చారు.

## రెండువేల రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై



**న్యూఢిల్లీ:** ఉచిత వైఫై సౌకర్యం అందిస్తున్న రైల్వేస్టేషన్ల సంఖ్య దేశవ్యాప్తంగా 2 వేలకు చేరుకుందని శనివారం రైల్వే అధికారులు వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన అజ్మీర్ డివిజన్‌లోని రాణా ప్రతాప్ నగర్ స్టేషన్ ఈ సదుపాయం అందుకున్న 2,000వ స్టేషన్‌గా నిలిచిందని రైల్‌టెల్ సంస్థ సీఎండీ పునీత్ చావ్లా అన్నారు. శుక్రవారం ఒక్కరోజే 74 స్టేషన్లలో ఈ సదుపాయాన్ని తీసుకొచ్చామన్నారు. రైల్‌టెల్ సంస్థ మొదటి దశలో 1,600 స్టేషన్లకు వైఫై సదుపాయం కల్పించగా, ప్రస్తుతం టాటా ట్రస్ట్‌తో కలసి మిగిలిన స్టేషన్లకు వైఫై సదుపాయం కల్పిస్తోంది.

## పేర్లు మార్చుకోనున్న ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్




**శాన్‌ఫ్రాన్సిస్కో:** ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల పేర్లు రానున్న కాలంలో మారే అవకాశం ఉంది. దీనికి సంబంధించి వాటి మాతృసంస్థ, సోషల్‌మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ కసరత్తులు చేస్తోంది. ఆండ్రాయిడ్, యాపిల్ స్టోర్లలో ఇన్‌స్టాగ్రామ్ పేరు 'ఇన్‌స్టాగ్రామ్ ఫ్రమ్ ఫేస్‌బుక్', వాట్సాప్ పేరు 'వాట్సాప్ ఫ్రమ్ ఫేస్‌బుక్'గా మారే అవకాశం కనిపిస్తోంది. మెసేజింగ్ అప్లికేషన్లను ఏకీకృతం (మెర్జ్) చేయడంతోపాటు పాటు, ఈ సేవలన్నీ ఫేస్‌బుక్ నుంచే వస్తున్నాయన్న విషయాన్ని వినియోగదారులు గుర్తించేలా ఈ మార్పులకు శ్రీకారం చుట్టామని ఫేస్‌బుక్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈ విషయం తమ ఉద్యోగులకు ఇప్పటికే వివరించినట్లు తెలిపారు. ఇతర సోషల్‌మీడియా వేదికల నుంచి వస్తున్న గట్టి పోటీ మేరకే ఫేస్‌బుక్ ఈ నిర్ణయం తీసుకుంటోందని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

## ఐఐటీల్లో సీట్లు ఖాళీ లేవు: కేంద్రం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో (ఐఐటీ) సీట్లు ఖాళీగా లేవని మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్ఆర్డీ) అధికారులు తెలిపారు. 'ఐఐటీల్లో ఉన్న మొత్తం 13,604 అడ్మిషన్లకు గాను ఈ ఏడాది అన్ని సీట్లు నిండిపోయాయి. ఇలా అన్ని సీట్లు నిండిపోవడం ఇదే మొదటి సారి. ఇదంతా ఐఐటీల సహకారం వల్లే సాధ్యమైంది' అని హెచ్ఆర్డీ ఉన్నత విద్యా కార్యదర్శి ఆర్.సుబ్రమణ్యం వెల్లడించారు. గతేడాది మొత్తం 23 ఐఐటీల్లో 118 సీట్లు ఖాళీగా మిగిలాయని పేర్కొన్నారు. ఐదేళ్లుగా పలు ఐఐటీల్లో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నట్లు గుర్తించిన హెచ్ఆర్డీ.. ఇందుకు గల కారణాలను తెలపాలంటూ 2017లో ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ పలు సిఫార్సులు చేసింది.

## దేశమంతటా పౌర రిజిస్టర్

**ఎన్‌పీఆర్ రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధం**

**న్యూఢిల్లీ:** 2020 కల్లా జాతీయ ప్రజా రిజిస్టర్(ఎన్‌పీఆర్)ను రూపొందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. దీని ఆధారంగానే దేశవ్యాప్త పౌరసత్వ రిజిస్టర్‌ను తయారు చేయనుంది. ఎన్‌పీఆర్ పూర్తయి, అధికారికంగా ముద్రించాక ప్రభుత్వం దీనినే భారత జాతీయ పౌరసత్వ(ఎన్ఆర్ఐసీ) రిజిస్టర్‌కు ఆధారంగా చేసుకుంటుంది. అంటే, ఇది అస్సాంలో చేపట్టిన జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్నార్సీ)కి అఖిల భారత రూపమని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2020 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీల మధ్య ఈ కార్యక్రమం అస్సాం మినహా దేశవ్యాప్తంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆ ప్రాంతంలో ఆరు నెలలుగా నివాసం ఉంటున్న లేదా మరో ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం అక్కడే ఉండాలనుకున్న వ్యక్తుల పేర్లను నమోదు చేసుకుంటారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

# పాక్ 'బ్యాట్' సైనికుల హతం

**భారత సైన్యం కాల్పుల్లో ఐదుగురు మృతి**

**శ్రీనగర్:** నియంత్రణ రేఖ వెంబడి భారత్ సైనిక పోస్టులపైకి దాడికి దిగి, చొరబడేందుకు పాక్ సైన్యం చేసిన ప్రయత్నాన్ని భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా భారత సైన్యం జరిపిన కాల్పుల్లో పాక్ బోర్డర్ యాక్షన్ టీం(బీఏటీ)లోని ఐదు నుంచి ఏడుగురు మృతి చెందారని సైన్యం తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లా కేరన్ సెక్టార్‌లో జూలై 31వ తేదీ అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని సైన్యం అధికార ప్రతినిధి కల్నల్ రాజేశ్ కాలియా తెలిపారు. వీరిలో పాక్ కమాండోలతోపాటు ఉగ్రవాదులు కూడా ఉన్నారన్నారు. ఈ ఘటన అనంతరం పాక్ భారీగా సైన్యాన్ని మోహరించిందన్నారు. కశ్మీర్ లోయలో ప్రశాంత వాతావరణాన్ని, అమర్‌నాథ్ యాత్రను భగ్నం చేసేందుకు పాక్ బలగాలు గత 36 గంటల్లో పలు ప్రయత్నాలు చేశాయని, అప్రమత్తమైన సైన్యం దీటుగా బదులిచ్చిందని కల్నల్ కాలియా చెప్పారు. అదేవిధంగా, శనివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో జైషే మొహమ్మద్‌కు చెందిన



నలుగురు కరుడు గట్టిన ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు ఆయన వెల్లడించారు. వారి నుంచి పాక్‌లో తయారైన స్నైపర్ రైఫిల్, ఐఈడీ మందుపాతరను స్వాధీనం చేసుకున్నామన్నారు. బీఏటీలో సాధారణంగా పాక్ ఆర్మీకి చెందిన స్పెషల్ సర్వీస్ గ్రూప్‌తోపాటు ఉగ్రవాదులు ఉంటారని ఆయన వివరించారు.

### నలుగురు జైషే ఉగ్రవాదుల హతం

జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా, షోపియాన్ జిల్లాల్లో భద్రతా దళాలతో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నలుగురు జైషే మొహమ్మద్ (జేఎం) ఉగ్రవాదులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. గత 36 గంటల్లో ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలో ఇద్దరు జైషే ఉగ్రవాదులు హతమవ్వగా, మరో ఇద్దరు దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన ఆపరేషన్‌లో హతమైనట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. బారాముల్లా జిల్లా సోపోర్‌లోని వార్పోరా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లుగా లభించిన సమాచారం మేరకు భద్రతా దళాలు శనివారం ఉదయం గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ప్రతిగా భద్రతా దళాలు కూడా కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. వారిలో ఒకరు బండిపోరాకు చెందిన ఉమర్ షాబాజ్‌గా గుర్తించారు. మరొకరి గుర్తింపు లభించలేదు. ఘటనా స్థలంనుంచి మందుగుండు సామగ్రి, తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, షోపియాన్‌లోని పండూషన్ ప్రాంతంలో శుక్రవారం ప్రారంభమైన మరో ఆపరేషన్‌లో జైషే ఉగ్రవాదులు మంజూర్ భట్, జీనత్ ఇస్లాం నైకూలు హతమయ్యారని ఆ అధికారి తెలిపారు. నైకూ పాకిస్తాన్ జాతీయుడని, జైషే మహమ్మద్ జిల్లా కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడని వెల్లడించారు.

## కారుతో ఢీ కొట్టిన ఐఏఎస్

**జర్నలిస్టు మృతి**

**తిరువనంతపురం:** మద్యాన్ని సేవించి, అతివేగంతో కారు నడిపిన ఓ ఐఏఎస్ అధికారి, జర్నలిస్టు మృతికి కారణమయ్యాడు. ఈ ఘటన కేరళలో శనివారం జరిగింది. ఇందులో ప్రధాన నిందితుడైన ఐఏఎస్ శ్రీరామ్ వెంకటరమణ్ (33)ను ఇటీవలే రాష్ట్రప్రభుత్వం సర్వే డైరెక్టర్‌గా నియమించింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటరమణ్ తన మిత్రురాలు, మోడల్ వాఫా ఫిరోజ్‌కు చెందిన లగ్జరీ కారును వేగంగా నడిపిస్తూ మ్యూజియం రోడ్డు వద్ద మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో దానిపై ప్రయాణిస్తున్న 'సిరాజ్' వార్తాపత్రిక యువ జర్నలిస్టు కే ముహమ్మద్ బషీర్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం ధాటికి వాహనాల విడి భాగాలు, ఇతర వస్తువులు ఘటనా స్థలానికి దూరంగా ఎగిరిపడ్డాయి. ఐఏఎస్‌పై కేసు నమోదు చేశామని ఐజీపీ, పోలీస్ కమిషనర్ ధినేంద్ర కశ్యప్ అన్నారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# తల్లిలాంటి పార్టీ బీజేపీ

**పార్టీ ఎంపీల శిక్షణా కార్యక్రమంలో మోదీ**

**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ తల్లివంటిదని, ఎంపీలు, మంత్రులుగా ఎదిగిన వారు పార్టీని మరిచిపోరాదని ప్రధాని మోదీ అన్నారు. పార్టీ ఎంపీల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. పార్టీని, పార్టీ కార్యకర్తలను తల్లితో పోల్చిన మోదీ.. 'కుమారుడిని పెంచి పెద్దచేసిన తల్లి.. పెళ్లయిన తర్వాత ఆ కొడుకు తన కంటే భార్యపైనే ఎక్కువ మమకారం చూబితే చిన్నబుచ్చుకుంటుంది. అలాంటి కొడుకు మాదిరిగా కాకుండా ఎంపీలు, మంత్రులు అయిన మీరు పార్టీని, కార్యకర్తలను మరవకండి. మీకోసం ఎంతో శ్రమకోర్చిన కార్యకర్తలతో సంబంధాలు కొనసాగించండి' అని వారికి ఉద్బోధించారు. పార్టీ ఈ స్థాయికి చేరుకోవడం కార్యకర్తల కృషి ఫలితమేనన్నారు. చట్ట సభల సభ్యులైనా, మంత్రులయినా పార్టీ కార్యకర్తగా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని సూచించారు. 'వయస్సుతో పనిలేకుండా, విద్యార్థిగా భావించినప్పుడే ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోగలుగుతారు' అని ప్రధాని తెలిపారు. 'బీజేపీ కృత్రిమంగా ఏర్పడిన పార్టీ కాదు. క్షేత్ర స్థాయి నుంచి బలంగా ఏర్పడిన పార్టీ. సైద్ధాంతిక బలం, ఆలోచనా విధానం కారణంగానే ఈ స్థాయికి చేరుకుంది. అంతేగానీ, ఏదో ఒక్క కుటుంబ వారసత్వంపై నడుస్తున్న పార్టీ కాదు' అని ఈ సందర్భంగా ప్రధాని అన్నారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అనంతరం మీడియాకు తెలిపారు. రెండు రోజుల ఈ శిక్షణ కార్యక్రమంలో హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా కూడా ప్రసంగించారు. జేపీ నడ్డా ప్రసంగిస్తున్న సమయంలో ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ తదితరులు వేదికపై నుంచి కిందికి దిగి మిగతా ఎంపీల మధ్యన కూర్చున్నారు.



పార్టీ ఎంపీల శిక్షణాకార్యక్రమంలో ఎంపీల మధ్య కూర్చున్న ప్రధాని మోదీ

# ఛత్తీస్‌లో భారీ ఎన్‌కౌంటర్

**ఏడుగురు మావోల మృతి**

- ఓ జవానుకు గాయాలు
- రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ఘటన

**సాక్షి, కొత్తగూడెం:** ఛత్తీస్‌గఢ్‌లో శనివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోని షెర్పర్–సీతాగోటా అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. మృతులను దారెకాస ఏరియా కమిటీ కార్యదర్శి సుఖ్‌దేవ్, అతని భార్య, ఏరియా కమిటీ సభ్యురాలు ప్రమీల, సీమా, మీనా, రితేష్, లలిత, శిల్పలుగా గుర్తించారు. మావోల కాల్పుల్లో ఆశారామ్ అనే జవానుకు గాయాలయ్యాయి. ప్రస్తుతానికి అతనికి ఎలాంటి ప్రమాదం లేదని పోలీసులు వెల్లడించారు. జూలై 28 నుంచి ఈ నెల 3 వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించిన నేపథ్యంలో పోలీసు బలగాలు దండకారణ్యంలో భారీ కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్) బలగాలు కూంబింగ్ చేస్తుండగా మావోయిస్టు దళం ఎదురుపడింది.



వాహనంలో మృతదేహాలు

ఈ క్రమంలో బలగాలకు, మావోలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. దాదాపు రెండు గంటల పాటు కాల్పులు జరిపిన అనంతరం మావోలు అడవుల్లోకి పారిపోయారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలి నుంచి భారీగా పేలుడు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని డీజీపీ డీఎం అవస్థి వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వాటిలో ఏకే 47, 303 రైఫిల్, కార్బన్ గన్, 12 బోర్ గన్‌లు ఉన్నాయి. మావోలను హతమార్చడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్ ప్రశంసించారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి, శు.చవితి రా.11.33 వరకు తదుపరి, పంచమి, నక్షత్రం పుబ్బ ఉ.8.55 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం ప.3.35 నుంచి 5.05 వరకు, దుర్ముహూర్తం సా. 4.45 నుంచి 5.36 వరకు అమృతఘడియలు... రా.12.31 నుంచి 1.54 వరకు, నాగచతుర్థి.

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం : 6.29
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

## సుబ్రహ్మణ్య స్వామి (ఎంపీ) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తెలుసు కదా అని ఏదైనా చెప్పబోతే, 'మాకు తెలియకపోతే కదా' అని ఎవరైనా చటుక్కున అనేస్తే మనసు ఎంత చివుక్కుమంటుంది!

'డెబ్బయ్ తొమ్మిదేళ్ల వయసులోని రాజకీయవేత్తకు, ఆరితేరిన ఆర్థిక నిపుణుడికి మనకు తెలిసినవే కాకుండా, అదనంగా మరికొన్ని కూడా తెలిసి ఉండే అవకాశం ఉందేమో తెలుసుకుందాం' అని వీళ్లంతా ఎందుకు అనుకోరు?!

రీసెంట్‌గా నిర్మలా సీతారామన్‌కు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా గట్టెక్కించవచ్చో ఐదు టిప్స్ ఇచ్చాను. 'అసలు గట్టెక్కించాల్సిన అవసరం ఏముందీ' అన్నట్లు విస్తుపోయి చూశారు! బీజేపీ గట్టున ఉంటే దేశం కూడా గట్టునే కదా ఉంటుంది అని ఆమె నమ్మకం కావచ్చు.

"ఎందుకలా విస్తుపోయి చూశారు నిర్మల గారూ?" అన్నాను.

"బీజేపీ వాళ్లకు బీజేపీ వాళ్లు టిప్స్ ఇవ్వడం నేనెక్కడా చూళ్లేదు. మీరు బీజేపీ అయుండి, నేను బీజేపీ అయుండి మీరు నాకు టిప్స్ ఇవ్వడమే విస్మయంగా ఉంది" అన్నారు.

"అయితే మీకు నా టిప్స్ నచ్చాయి కానీ, ఆ టిప్స్‌ని నేనివ్వడమే మీకు నచ్చలేదన్నమాట" అన్నాను.

"నేను అడగకుండా ఎవరు నాకు టిప్స్ ఇచ్చినా నాకు నచ్చదు సుబ్రహ్మణియన్ గారూ. పైగా మీరు 'టిప్స్ ఇచ్చేదా' అని నన్ను అడక్కుండానే నాకు టిప్స్ ఇచ్చేశారు" అన్నారు సీతారామన్!

రెండు పొరపాట్లు చేశానని అర్థమైంది. అడగకుండా టిప్స్ ఇవ్వడం. టిప్స్ ఇమ్మంటారా అని అడగకపోవడం.

సీతారామన్ గురించి ఆలోచిస్తూ ఉంటే అయోధ్య రాముడి గురించి కబురొచ్చింది!

"మిస్టర్ సుబ్రహ్మణియన్.. కేసును సుప్రీం కోర్టు తీసేసుకుంది. మధ్యవర్తులు చేతులెత్తేశారు. మీరేం చెప్పదలచుకున్నారు?



ఇండియా వాంట్స్ టు నో" అంటున్నాడు ఆర్ణబ్ గోస్వామి!

"ఇండియా నా నుంచి తెలుసుకోవాలని కోరుకుంటోందా?!" అని అడిగాను నిస్సత్తువగా. చెప్పలేకపోవడం వల్ల దేహానికి కలిగిన నిస్సత్తువ కాదది. వినేవారెవరన్న నిస్పృహ వల్ల మనసును ఆవరించిన నిస్సత్తువ.

"ఎస్ మిస్టర్ సుబ్రహ్మణియన్.. ఇండియా వాంట్స్ టు నో అబౌట్ యువర్ కామెంట్స్. అయోధ్య మధ్యవర్తుల కమిటీలో ఉండేందుకు అప్పట్లో మీరూ ఉత్సాహం చూపారు కదా.." అన్నాడు ఆర్ణబ్.

"నా దగ్గర కామెంట్స్ ఏమీ లేవు ఆర్ణబ్. టిప్స్ ఉన్నాయి. అవి ఇండియాకు పనికొస్తాయా? ఎందుకంటే ఇండియాలోనే కొందరు నేనిచ్చే టిప్స్‌ని తీసుకోవాలని అనుకోవడం లేదు" అన్నాను.

"వెల్ మిస్టర్ సుబ్రహ్మణియన్. ఇండియా అంటే.. మీ టిప్స్‌ని తీసుకోనివాళ్లు మాత్రమే కాదు, మీ టిప్స్‌ని తీసుకునేవాళ్లు కూడా.." అన్నాడు ఆర్ణబ్.

"మరి ముందే టిప్స్ కావాలని ఎందుకు అడగలేదు ఆర్ణబ్! ఇండియా వాంట్స్ టు నో అబౌట్ యువర్ కామెంట్స్ అని కదా మీరన్నారు.." అన్నాను.

ఆర్ణబ్ పెద్దగా నవ్వాడు. ఆర్ణబ్ పెద్దగా చెవులు పగిలేలా మాట్లాడ్డమే తప్ప, ఏవీ పగలకుండా పెద్దగా నవ్వడం ఇదే తొలిసారి నేను వినడం! చెవులు పగలడమే బాగుంది.

"మిస్టర్ సుబ్రహ్మణియన్.. ముందే టిప్స్ కావాలని మిమ్మల్ని ఎందుకు అడగలేదంటే, కామెంట్స్ అడిగినా మీరిచ్చేది టిప్సే కదా అనే నమ్మకం.." అన్నాడు!

"నమ్మకం మంచిదే ఆర్ణబ్. ఒకవేళ నా మూడ్ బాగుండి, టిప్స్ ఇవ్వకుండా మీరడిగినట్లు కామెంట్సే ఇస్తే?" అన్నాను.

"మీకు తెలియందేముంది మిస్టర్ సుబ్రహ్మణియన్, మూడాఫ్ చెయ్యడానికి మా దగ్గర ఒక టీమ్ ఎప్పుడూ ట్వంటీ ఇంటూ సెవన్.. పని చేస్తూనే ఉంటుంది కదా" అన్నాడు ఆర్ణబ్!

# 1969 : ఎ లవ్ స్టోరీ

## జనతంత్రం



వర్దెల్లి మురళి



మనిషి చందమామను అందుకొని ఇప్పటికి యాభయ్యేళ్లయింది. ఆ వెన్నెల రాజును తాకాలన్నది ఏనాటి కోరిక? రామాయణ కాలం నుంచయితే మనకు తెలుసు. చందమామను తెచ్చి తన చేతికి ఇస్తే తప్ప అన్నం తినేది లేదని ఒకసారి బాలశ్రీరాముడు మారాం చేశాడట. పిన్నమ్మలూ, తల్లీ, తండ్రీ ఎంత బతిమాలినా వినలేదట. చివరకు సుమంతుడు అనే మంత్రి ఒక అద్దం తెచ్చి అందులో చంద్రబింబాన్ని రాముడికి చూపించాడట. చంద్రుడు తన చేతికి అందాడని రామచంద్రుడు సంబరపడ్డాడట. ఆనాటికే మనిషి మస్తిష్కంలో చంద్రుడిని చేరుకోవాలన్న కాంక్ష నాటుకొనిపోయింది. వేలయేళ్లు గడిచిన తర్వాత 1969 జూలై 20వ తారీకున ఆ కోరిక నెరవేరింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అమెరికా వ్యోమగామి ఎడ్విన్ ఆల్డ్రిన్ అనే మరో సహచరునితో కలిసి చంద్ర మండలం మీద కాలుమోపాడు. మరో సహచరుడు మైకేల్ కోలిన్స్ కక్ష్యలో తిరుగుతూ అపురూప దృశ్యాలను ఫొటోలు తీశాడు. 1969 ఒక మైలురాయిలాగా మానవ చరిత్రలో మిగిలిపోయింది. 1960వ దశకానికి ఒక అద్భుతమైన ముగింపు అరవై తొమ్మిది. అలజడితో, ఆలోచనతో, ఆవేశంతో ఎగసిపడిన అరవయ్యో దశకపు పెనుకెరటంపై మెరుపు నురగ అరవై తొమ్మిది. ఆ దశాబ్ది ప్రతినిధి అరవై తొమ్మిది. యాభయ్యేళ్లు గడిచిన సందర్భంగా 69 గురించి మాట్లాడుకోవడం అంటే ఆ మొత్తం దశాబ్ది పరిణామాల సమాహారాన్ని పరామర్శించడమే. అనంతకాల గమనంలో దశాబ్ది సమయం ఒక రెప్పపాటు మాత్రమే. కానీ, ఈ దశాబ్ది మాత్రం ఓ రెక్క విప్పిన రివల్యూషన్!

అరవయ్యో దశకానికి సంబంధించి కొంతమంది సంప్రదాయవాదులకు కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ దశాబ్ది ఉద్యమాల్లో పెడధోరణులున్నాయనీ, సాంఘిక కట్టుబాట్లను భ్రష్టుపట్టించే లక్షణాలున్నాయన్న విమర్శలు వచ్చాయి. నిజానికి, ఆ ఉద్యమాలు స్వాభావికంగానే ధిక్కార స్వరాలు. అసమానతల పునాదులపై ఏర్పడిన సాంఘిక కట్టుబాట్లపై ధిక్కారం. సంకుచిత భావనలపై ధిక్కారం. వివక్షపై ధిక్కారం! ఈ ఉద్యమాల మరో ముఖ్య లక్షణం విశ్వ మానవ సౌభ్రాతృత్వం. రెండో ప్రపంచ యుద్ధకాలంలో, ఆ తర్వాత కాలంలో పుట్టి పెరిగిన తరం ప్రధానంగా ఈ ధిక్కార స్వరాన్ని వినిపించింది. అంతర్లీనంగా ఆర్థిక కారణాలు వున్నప్పటికీ, మితిమీరిన జాతీయ దురహంకారమే రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఐదుకోట్ల మంది ప్రాణాలు బలితీసుకున్న మహా మహమ్మారి ఈ యుద్ధం. అందుకే యుద్ధాన్ని ఈ తరం అసహ్యించుకుంది. జాత్యహంకారాన్ని ఈసడించుకుంది. వియత్నాంపై అమెరికా చేస్తున్న దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకంగా లక్షలాదిమంది అమెరికా విద్యార్థులే వీధుల్లోకి వచ్చారు. తమ నేలపై అంగుళం ఖాళీ వదలకుండా అగ్రరాజ్యం బాంబులతో తూట్లు పొడుస్తుంటే, ఆ చిన్నారి దేశం తలవంచకుండా ప్రతిఘటిస్తున్న తీరును యావత్తు ప్రపంచం ఆశ్చర్యచకితమై చూసింది. అమెరికా చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా సకల దేశాల్లోని ప్రజలు – ముఖ్యంగా యువకులు నిరసన ప్రదర్శనలు చేశారు. యుద్ధ వ్యతిరేక సందేశాన్ని అమెరికా యువతరం కూడా అందుకుంది. వియత్నాం నుంచి అమెరికా సేనలు తప్పుకోవాలని కోరుతూ తీసిన ఊరేగింపుల్లో లక్షల సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. అమెరికా సైనికుల కుటుంబాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొనడం విశేషం.

చేగువేరా ఒక కమ్యూనిస్టు విప్లవకారుడు, పుట్టింది అర్జెంటీనాలో. చదివింది వైద్యశాస్త్రం. 'బాటిస్టా' ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్యూబా విప్లవకారులు కాస్ట్రో నాయకత్వంలో సాగిస్తున్న పోరాటంలో పాల్గొన్నాడు. విప్లవ ప్రభుత్వంలో కొంతకాలం మంత్రిగా చేశాడు. కానీ ఒక చిన్న దేశంలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడితే, దానిని, సామ్రాజ్యవాదం బతకనివ్వదని చే భావించాడు. ఏక కాలంలో అనేక దేశాల్లో విప్లవ పోరాటాలు జరగాలని, పెద్దసంఖ్యలో సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడాలనీ, అప్పుడే అవి మనగలుగుతాయని చే ఆలోచన. వెంటనే క్యూబాలో మంత్రిపదవి వదిలేశాడు. మొదట కాంగోలో కొన్ని ప్రయత్నాలు చేశాడు. తర్వాత బొలీవియాకు చేరుకున్నాడు. అక్కడ సీఐఏ ఏజెంట్లు గువేరాను చంపించారు. గువేరా ఒక ధిక్కారస్వరమే కాదు, ఒక ధిక్కార సంస్కృతికి బ్రాండ్ అంబాసిడర్ కూడా. పొడవైన వేలాడే జుట్టు, నక్షత్రం మార్కు ఎర్రటోపీ, గడ్డం, మీసాలు, హవాయి చుట్ట.. దేశదేశాల్లోని యువతరం అనుకరించిన రూపం అది. ఆయన చనిపోయి యాభయ్యేళ్లు దాటినా, ఆయన బొమ్మ వున్న టీ–షర్టులకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బోలెడు డిమాండ్ వుంది. ఆయనకొక దేశం లేదు. ఆయనొక విశ్వమానవ సందేశం. ఇరవయ్యో శతాబ్దపు అమెరికన్ ధ్రువతార మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్. నల్లజాతీయుల పట్ల దుర్మార్గమైన వివక్షకు వ్యతిరేకంగా ఆయన చేసిన పౌరహక్కుల పోరాటం ప్రధాన ఘట్టాలన్నీ అరవయ్యో దశకంలోనే చోటుచేసుకున్నాయి. భారత జాతిపిత మహాత్మాగాంధీ నుంచి సహాయ నిరాకరణ, అహింసాయుత పోరాట రూపాలను కింగ్ అరువు తెచ్చుకున్నారు. ఆయన చేసిన 'ఐ హ్యావ్ ఏ డ్రీమ్...' అనే ప్రసిద్ధ ప్రసంగం సమతావాద వేదం లాంటిది. మార్టిన్ లూథర్ చేసిన గాంధేయ పోరాటాలకు తలవొగ్గి లిండన్ జాన్సన్ ప్రభుత్వం ఆ దశాబ్దిలోనే కొన్ని పౌరహక్కుల చట్టాలను చేయాల్సి వచ్చింది. చివరకు ఒక దురహంకారి కాల్పులకు నేలకొరిగిన మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ రెపరెపలాడే పౌరహక్కుల పతాకం. ఆ పతాకానికి ఎల్లలు లేవు.

స్త్రీవాద ఉద్యమాలు శిరమెత్తింది కూడా ఈ దశాబ్ద కాలంలోనే. ఉద్యోగాల్లో స్త్రీల పట్ల కొనసాగుతున్న వివక్షపై అమెరికా మహిళా లోకంలో తీవ్ర అసంతృప్తి పేరుకుని వున్న సమయంలో బెట్టీఫ్రీడన్ రాసిన 'ది ఫెమినైన్ మిస్టిక్' అనే పుస్తకం 1963లో వెలువడి ప్రకంపనలు సృష్టించింది. అంతకుముందే ఫ్రెంచి ఫెమినిస్ట్ సిమోన్ ది బోవా రాసిన 'ది సెకండ్ సెక్స్'ను మించిన సంచలనం సృష్టించిన రచన ఇది. ఆకాలంలో చెలరేగిన మహిళా ఉద్యమాల పర్యవసానంగా ఉద్యోగాల్లో కొనసాగుతున్న లింగవివక్ష 1964లో అంతమైంది. రాజకీయ, సామాజిక రంగాలతోపాటు సాంస్కృతిక రంగంలోకి కూడా ధిక్కార సంస్కృతి ప్రవేశించింది. సంగీతంలోనూ, జీవనశైలిలోనూ అది ప్రభావం చూపింది. ఈకాలంలో ప్రపంచాన్ని బ్రిటన్ దేశపు 'ది బీటిల్స్' బ్యాండ్ ఉర్రూతలూగించింది. పాప్ సంగీతానికి కళాత్మకతను అద్దిన 'బీటిల్స్' దేశదేశాల సంగీత రీతులను తనలో మిళితం చేసుకుంది. అందులో భారతీయ సంగీత ఛాయలు కూడా వున్నాయి. ఈ గాయకులు కొంతకాలం పాటు రుషికేశ్‌లోని ఒక ఆశ్రమంలో వుండి యోగా, ధ్యానం కూడా కూడా నేర్చుకున్నారట. అక్కడే దాదాపు ముప్పై పాటల వరకు స్వరపరచారని చెపుతారు. అమెరికా సామాజిక వ్యవస్థలోని అసమానతలపై వైముఖ్యం, అప్పటి సంఘ కట్టుబాట్లపై నిరసన, వియత్నాంపై అమెరికా యుద్ధం పట్ల వ్యతిరేకత, ఇలాంటివన్నీ కలిసి అప్పటి యువతవరంలో హిప్పీ స్టయిల్ పేరుతో ఒక ధిక్కార సంస్కృతి ప్రవేశించింది. అనతికాలంలోనే ఈ సంస్కృతి చాలా దేశాల్లోకి ప్రవేశించింది. భుజాల దాకా వేలాడే తైల సంస్కారం లేని జుట్టు, గడ్డం, మీసాలు, బెల్‌బాటమ్ ప్యాంట్లు, ముదురు రంగుల పెద్ద కాలర్ షర్టులు.. ఒక విచిత్ర వేషధారణ వుండేది. స్వేచ్ఛ, సమానత్వం పునాదిగానే ఈ ధిక్కార జీవనశైలి పుట్టినప్పటికీ, విచ్చలవిడితనం, మాదకద్రవ్యాల అలవాటు వల్ల ప్రధాన జీవన స్రవంతి అభిశంసనకు గురై, కొంతకాలం తర్వాత అంతరించిపోయింది.

అరవయ్యో దశకపు ఉద్యమ కెరటాలు అమెరికాతోపాటు దాదాపు మొత్తం ప్రపంచాన్ని తాకాయి. యూరప్‌లో నయితే ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్, పోలండ్, యుగోస్లేవియా దేశాలను విద్యార్థి ఉద్యమాలు అట్టుడికించాయి. ఫ్రాన్స్‌లో విద్యార్థులకు ట్రేడ్ యూనియన్లు కూడా జతకలవడంతో 1968లో చార్లెస్ డీగాల్ ప్రభుత్వం దాదాపుగా పతనం అంచులకు చేరుకుంది. ఐరోపా దేశాలకు వలసలుగా వున్న ఆఫ్రికా దేశాల్లో 32 దేశాలు ఈ దశాబ్దంలో స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి. ఈ మహత్తర పరిణామం వెనుక ఐరోపా దేశాల్లోని అంతర్గత ఉద్యమాల పాత్రను విస్మరించలేము. మావోజెడాంగ్ నాయకత్వంలోని చైనాలో సాంస్కృతిక విప్లవం నడిచిన కాలం కూడా ఇదే. అది వికటించడం ఒక విషాదం. ప్రపంచమంతటా అప్పుడు వీచిన గాలుల ప్రభావం భారత్‌పై కూడా వుంది. ఇందిరా గాంధీ ప్రభుత్వం పూర్వపు సంస్థానాధీశులకు ఇచ్చే రాజభరణాలను రద్దుచేసి, బ్యాంకులను జాతీయం చేసింది 1969లోనే. పర్యవసానంగా బ్యాంకులు సామాన్యులకు కొంత చేరువై బర్రెలు, గొర్రెలు కొనుక్కునేందుకు రుణాలిచ్చాయి. బొలీవియాలో చేగువేరా హత్యకు గురైన సంవత్సరమే భారతదేశంలో చారుమజుందార్ నాయకత్వంలో నక్సల్బరీ అలజడి ప్రారంభమవడం కాకతాళీయమైనా, ఆ వేడి యాభయ్యేళ్లు దాటినా ఇంకా చల్లారక పోవడం విశేషం.

1960వ దశకం పరిణామాల్లో కొన్ని పెడధోరణులు వున్నప్పటికీ, ఆ దశాబ్దం ఎలుగెత్తి చాటిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే భావనలు సర్వకాలాలకూ, సకల మానవులకూ శిరోధార్యాలు. ఆలోచనలకు సంకెళ్లు లేని, భావాలకు సరిహద్దులు లేని, సంగీతానికి భాషాభేదం లేని, జీవనశైలికి జాతీయ దురహంకారం లేని ఒక వసుధైక కుటుంబాన్ని కలలుగన్న 1969 (60వ దశకం ముగింపు)కి స్వర్ణోత్సవ శుభాకాంక్షలు చెబుతూ... భయంతో, ఆందోళనలతో కూడిన చిన్న ఉపసంహారం – జాతీయవాదం ముదిరితే తీవ్ర జాతీయవాదం, అది ముదిరితే జాతీయ దురహంకారం. గతంలో జరిగిన ప్రపంచ యుద్ధాలకు జాతీయ దురహంకారమే ప్రధాన కారణం. తీవ్ర జాతీయవాదం దిశగా ప్రపంచ దేశాలు అడుగులు వేస్తున్న దృశ్యం కనబడుతున్నది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇండియా... ఇంకా అనేక దేశాలు ఈ దిశలోనే అడుగులు వేస్తున్నాయి. ఈ అడుగుల వడి పెరిగితే, ఇక మెదళ్లపై నిఘా వేసి, హృదయాలకు సంకెళ్లు వేసే పీడ రోజులు దగ్గరపడినట్లే.

muralivardelli@yahoo.co.in

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



### ఉద్రిక్త నిశీధి



"ఈ నిశీధిని నేను ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటాను. మనందరం కలిసి టీ తాగుదామని స్నేహితులంతా అంటున్నారు. బహుశా, మేమంతా కలిసి ఉండటం ఇదే చివరిసారి కావచ్చు. పెట్రోల్ పంపుల దగ్గర ఎవరూ అరవడం లేదు. మెడికల్ షాపుల దగ్గర ఎవరూ హడావుడి పడటం లేదు. ప్రతి ఒక్కరూ దయగా ఉన్నారు. ఇది మా చివరి రాత్రి కాకపోతే బావుండు. నిశ్శబ్దంగా, నిర్వికారంగా జరగబోయే దానికోసం ఎదురుచూస్తున్నాం"

– నసీర్ గనాయ్, కశ్మీర్ జర్నలిస్ట్

### వాయిస్



"రామన్ మెగసెసె అవార్డు గెలుచుకున్న ఎన్డీటీవీ జర్నలిస్ట్ రవీష్ కుమార్‌ను చాలా మంది స్టార్ యాంకర్లు అభినందించలేదు. ఎందుకంటే, అతడు చేసిన పనిని గుర్తించడమంటే వృత్తిపరంగా తమ కపటత్వాన్ని అంగీకరించడమే. ఇప్పుడు మీడియా గొంతులేనివారికి గొంతునివ్వడం లేదు"

– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

### ఒత్తిడి



"ఇంతకంటే ఒత్తిడిని భరించలేను. రోజులు ఇబ్బందిగా సాగుతున్నాయి. ఆందోళన, నిరాసక్తత, నిరుద్యోగం, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నా. ఒకప్పుడు వాళ్లు ఇబ్బందుల్లో ఉండగా నేను ఆదుకున్న స్నేహితులెవరూ ఆదుకోలేదు. ఎప్పుడూ ఇంత నిస్సహాయురాలిననుకోలేదు"

– రితుపర్ణా చటర్జీ, జర్నలిస్ట్

### ఆతిథ్యం



"బతుకుతెరువు కోసం కశ్మీర్ వచ్చి ఉద్రిక్త పరిస్థితుల నడుమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతున్న వారంతా కంటతడి పెడుతున్నారు. సుమారు ఇరవై ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని, ఎప్పుడూ సురక్షితంగానే ఉన్నామని చెబుతున్నారు. కశ్మీరీ ప్రజల ప్రేమను, ఆతిథ్యాన్ని మరీమరీ గుర్తు చేసుకుంటున్నారు"

– సల్మాన్ నిజామి, కాంగ్రెస్ నేత

### కన్నీరు



"అన్న క్యాంటీన్లను మీ హెరిటేజ్ సొమ్ముతో ఏమైనా నడిపారా లోకేశ్ బాబూ? మూసేశారని టీఎంసీల కొద్ది కన్నీరు కారుస్తున్నావు. మీ పథకాలన్నీ ప్రజల సంక్షేమానికి కాకుండా దోచుకునేందుకే మొదలు పెట్టారు. క్యాంటీన్ నిధులను పసుపు–కుంకుమ ప్రలోభాలకు మళ్లించి 43 కోట్ల బకాయి పెట్టారు"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

## వెంటాడుతున్న శాపం!

కొందరిని బాధలు, కష్టాలు అప్పుడప్పుడు పలకరిస్తాయి. కానీ కొందరు మాత్రం నిరంతరం వాటిమధ్యే ఉంటారు. ఒకదాని తర్వాత మరొకటి వారిని చుట్టుముడుతూనే ఉంటాయి. అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన జాన్ ఎఫ్. కెనెడీ కుటుంబం పరిస్థితి అదే. తరాలు మారుతున్నా వారి తలరాతలు మారడం లేదు. జాన్ కెనెడీ, ఆయన సోదరుడు సెనెటర్ రాబర్ట్ కెనెడీలను దుండగులు కాల్చి చంపారు. వారి సోదరుడు జోసెఫ్ కెనెడీ రెండో ప్రపంచ యుద్ధంలో మరణించాడు. వారి సోదరి కత్లీన్ కేవెన్‌డిష్ విమాన ప్రమాదంలో కన్నుమూశారు. జాన్ కెనెడీ కుమారుడు 1999లో తాను నడుపుతున్న విమానం కూలి మరణించాడు. అతనితోపాటు అతని భార్య, ఆమె సోదరి చనిపోయారు. ఇప్పుడు రాబర్ట్ కెనెడీ మనవరాలు 22 ఏళ్ల సీర్షా కెనెడీ హిల్ అతిగా మందులువాడి గురువారం రాత్రి చనిపోయింది. కెనెడీ హిల్ తాను మానసిక ఒత్తిళ్లతో ఎలా కుంగిపోయానో వివరిస్తూ రాసిన వ్యాసం 2016లో అమెరికాలో ఆమెకు పేరు తెచ్చింది. కెనెడీ హిల్ తండ్రి పాల్ మైకేల్ హిల్ ఐర్లాండ్ వాసి. ఐరిష్ రిపబ్లిక్ ఆర్మీ(ఐఆర్‌ఏ) జరిపిన బాంబు దాడుల్లో ఆయన పాత్రపై బ్రిటన్ ప్రభుత్వం పెట్టిన కేసులో ఆయన దోషిగా తేలడంతో యావజ్జీవ శిక్ష విధించారు. అయితే 15 ఏళ్ల తర్వాత 1993లో ఉన్నత న్యాయస్థానం ఆయన్ను నిర్దోషిగా విడుదల చేసింది.

**ట్రిపుల్ తలాక్ అన్నాక భర్తను జైలులో వేస్తే ఆమె భరణం ఎవరిని అడగాలి? ఎక్కడ ఉండాలి? జైలులో ఉపాధిలేని భర్త కుటుంబాన్ని ఎట్లా పోషిస్తాడు? పోనీ అలాంటి కేసుల్లో మహిళలకు ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ఏమైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాయా? భరణం, వేతనం, ఆశ్రయం కల్పిస్తాయా? అంటే అదీ లేదు. వారిని గాలికి వదిలేయడమే. ఇది బాధితులకు ఏ రకంగా న్యాయం చేసినట్టు? ఒకవైపు స్త్రీలకు రక్షణ కల్పిస్తున్నట్టు కనబడుతూ.. మరోవైపు మైనారిటీ పురుషుల్ని నేరస్తుల్ని చేసే ప్రయత్నం ఇది. మత ఆచారాలు, మూఢ సంప్రదాయాల వల్ల, ఇతర కారణాలవల్ల భార్యల్ని వదిలేసే పద్ధతులు ఎవరు అనుసరించినా అంటే మతంతో పర్సనల్ లా లతో సంబంధం లేకుండా.. అది ఒక సమస్య. దాని పరిష్కారానికి ఏం చేయాలి? గృహ హింస చట్టం అందరికీ వర్తింపజేసి పటిష్టంగా అమలు చేయటం ద్వారా కుటుంబ వివాదాలు పరిష్కరించాలనే అసలు ప్రశ్నలు గాలికి వదిలేసి.. ఎవరికి భద్రత చేకూరుస్తారు?**

## అకారణ జైలు పరిష్కారమా?

అభిప్రాయం



దేవి

బే సబాబ్ హం బే గునావోం పర్ రవా మత్ కర్ సితం/ కర్ సితం హం కోం కియా హై కతల్ క్యోం తున్ బే సబాబ్

– సిరాజ్ ఔరంగాబాదీ (1716)

''అమాయకులపై నీ క్రూరమైన చూపెందుకు?/ ఏ నేరం, ఏ కారణం లేకుండానే నీ చూపులోని క్రూరత్వం మమ్మల్ని హత్య చేసింది''

అని రాసిన ఈ గజల్ 18వ శతాబ్దం ప్రారంభం లోనిది... ఇది ప్రస్తుత ట్రిపుల్ తలాక్ బిల్లుకు సరిగ్గా సరిపోతుంది.

ట్రిపుల్ తలాక్... ఒకేసారి మూడుసార్లు ఆ మాటంటే ఆ భార్యను వదిలేయొచ్చనేది ఇస్లాంకి వ్యతిరేకం అని అంటున్నారు ఇప్పుడు. గత పాతికేళ్లుగా మహిళా ఉద్యమాలు మైనారిటీ మహిళల కనీస హక్కుల గురించి ప్రశ్నించినప్పుడంతా మిన్నకుండిపోయిన అధిక శాతం మతపెద్దలు ఇప్పుడు మమ్మల్ని ఎందుకు అడగలేదు? ఇప్పుడు టైమియ్యండి సరిచేస్తాం అంటున్నారు. గత 70 ఏళ్లుగా మైనారిటీల్లోని అభద్రతను ఆసరా చేసుకుని మతం పట్టు బిగించడం కోసం మహిళల హక్కులకు తూట్లు పొడిచి.. ఇస్లాం వ్యతిరేక ఆచారాలను అనుమతించడం లేదా చూసీ చూడనట్టు పోయినదాని పర్యవసానమే.. ఇస్లాం మహిళలను అణచివేస్తుందనే భావన బలపడటానికి కారణం. ఈరోజు మహిళల సమానత్వం ముసుగులో మైనారిటీ పురుషుల్ని నేరస్తులుగా బోనులో నిలబెట్టేందుకు బీజేపీకి అవకాశం లభించింది. ముస్లిం మతపెద్దలే ఈ పని చేసుంటే.. నిర్ద్వంద్వంగా ట్రిపుల్ తలాక్ ఇస్లాంకి విరుద్ధం అని నిషేధించి ఉంటే.. ఈ చట్టం అవసరం ఏముండేది అని సుప్రీంకోర్టు ప్రశ్నించడం చాలా సముచితం.

ట్రిపుల్ తలాక్ చట్టం ఆమోదింపచేసుకున్న పద్ధతి పార్లమెంటరీ సంప్రదాయాలను అవహేళన చేసేదిగా ఉంది. జేడీయూ, టీఆర్‌ఎస్ వంటి పార్టీల గోడమీది పిల్లి ఆట చూడటానికి అసహ్యంగా ఉంది. బిల్లును వ్యతిరేకిస్తే ఖచ్చితంగా వైఎస్సార్‌సీపీలాగ నిలబడి ఓటు వేయాలి. కానీ సభ వదిలి పోవడం అంటే బిల్లును వ్యతిరేకించినట్లు కన బడి మైనారిటీల దగ్గర పరువు కాపాడుకోవాలి. అట్లని బీజేపీతో జరిపే లాలూచీని వదులుకోకూడదు. బీజేపీ బిల్లు గెలిచేందుకు వీలు కల్పించాలి. ఇదీ వ్యూహం.

'ట్రిపుల్ తలాక్ చెప్పడం చెల్లదు' అని ఈ చట్టం పేర్కొన్నది అంటే వివాహం రద్దు కాదు. ఆ స్త్రీకి, బిడ్డలకు వైవాహిక హక్కులన్నీ ఉంటాయి. అతను అప్పటికీ నిరాకరించినా ఆమెకు చట్ట రక్షణ ఉంటుంది. మరి అతన్ని జైలుకు పంపే వ్యవహారం దేనికి? తలాక్‌లు చెప్పిన ముస్లిం భర్త ఆమెను వదిలేస్తాడు. అతనికి చట్టంతో పనిలేదు అని వాదించవచ్చు. భార్యను వదిలేయదల్చినవాడు ఏ మతానికి చెందినా అతనికి చట్టంతో పనిలేదు. భార్యాబిడ్డల్ని



నిరాధారంగా వదిలేసేవాళ్లు (ప్రజా సేవ కోసం లేదా మోక్షం కోసం వగైరా) అందర్నీ మూడేళ్లు జైలుపాలు చేస్తామంటే అందరికీ సమంగా ఆ శిక్షలుండాలి కదా.

498ఏ.. క్రిమినల్ చట్టం. తీవ్ర హింసలు, గాయాలు, మరణాలు, మానసిక హింస, వివాహ బంధంలోని మహిళల జీవించే హక్కుపై దాడి కాబట్టి అది నేరం. అయినా ఒకసారి భర్త అరెస్టయితే తిరిగి ఆ కుటుంబం కలవదు. కనుక ఎంతటి హింసలోనైనా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి స్త్రీలు ముందుకు రారు. ఆర్థికంగా ఆధారపడటం, సమాజానికి భయపడటం, పిల్లల భవిష్యత్తు, ఒంటరి మహిళకు భద్రత లేకపోవడం.. భర్తే సర్వం అనే సాంప్రదాయ భావన వగైరాలు దీనికి ప్రధాన కారణాలు.

కనుకనే మహిళా ఉద్యమం కుటుంబంలో వివాదాలు సామరస్యంగా పరిష్కరించే సివిల్ చట్టం, గృహ హింస చట్టం కోసం పాతికేళ్లు పోరాడింది. 2002లో వాజ్‌పేయి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ హింస బిల్లు మహిళా హక్కులను కాలరాసేదిగా ఉండటంతో దాన్ని అడ్డుకుని 2005లో మహిళా సంఘాలు ప్రతిపాదించిన సవరణలన్నీ ఆమోదించిన చట్టం.. గృహ హింస చట్టంగా, సివిల్ చట్టంగా వచ్చింది. అంటే పరిష్కారానికి వీలు కల్పించేలా కుటుంబ వివాదాలు (హింసకాదు) సివిల్ చట్టంగానే ఉండాలి. ముస్లిం మహిళలకు నిజంగా భద్రత కల్పించ తల్చుకుంటే ఇది సివిల్ చట్టంగా తెచ్చి దాని అమలు యంత్రాంగం ఏర్పాటు చేసి పటిష్టంగా అమలు చేయాలి. భర్తలపై ఆర్థికంగా ఆధారపడుతూ, వృత్తి నైపుణ్యాలు, విద్యలేని అసంఖ్యాక ముస్లిం మహిళల విద్య ఉపాధిపై శ్రద్ధ పెట్టాలి.

ట్రిపుల్ తలాక్ అన్నాక భర్తను జైలులో వేస్తే ఆమె భరణం ఎవరిని అడగాలి? ఎక్కడ ఉండాలి? జైలులో ఉపాధిలేని భర్త కుటుంబాన్ని ఎట్లా పోషిస్తాడు. పోనీ అటువంటి కేసుల్లో మహిళలకు ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏమైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాయా? భరణం, వేతనం, ఆశ్రయం కల్పిస్తాయా? అంటే అదీ లేదు. వారిని గాలికి వదిలేయడమే. ఇది బాధితులకు ఏ రకంగా న్యాయం చేసినట్టు? 498ఏ క్రిమినల్ చట్టం కాబట్టి దురుపయోగం అవుతుందని గగ్గోలు పెడుతున్న మగ సంఘాలు, బీజేపీ ఎంపీలు ఇప్పుడు ఈ చట్టాన్ని ఎందుకు క్రిమినల్ చట్టంగా ఆమోదించారు. నిజానికి 'సతి' చట్టం మొదలు 'నిర్భయ' సవరణల దాకా స్త్రీలకు రక్షణ కల్పించే చట్టాలన్నీ కుటుంబ వ్యవస్థకు విఘాతంగా పరిగణించే బీజేపీ భావజాలం కొనసాగింపే ఈ ట్రిపుల్ తలాక్ రద్దు బిల్లు. ఒకవైపు స్త్రీలకు రక్షణ కల్పిస్తున్నట్టు కనబడుతూ.. మరోవైపు మైనారిటీ పురుషుల్ని నేరస్తుల్ని చేసే ప్రయత్నం ఇది.

మత ఆచారాలు, మూఢ సంప్రదాయాల వల్ల, ఇతర కారణాలవల్ల భార్యల్ని వదిలేసే పద్ధతులు ఎవరు అనుసరించినా అంటే మతంతో పర్సనల్ లా లతో సంబంధం లేకుండా.. అది ఒక సమస్య. దాని పరిష్కారానికి ఏం చేయాలి? గృహ హింస చట్టం అందరికీ వర్తింపజేసి పటిష్టంగా అమలు చేయటం ద్వారా కుటుంబ వివాదాలు పరిష్కరించాలనే అసలు ప్రశ్నలు గాలికి వదిలేసి ఎవరికి భద్రత చేకూరుస్తారు.. ఎలాంటి సమానత్వం తీసుకు వస్తారు?

మహిళల హక్కులు ప్రత్యేకించి ముస్లిం మహిళల హక్కులు (షాబానో కేసు దగ్గర్నుండి) రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకునే వ్యవహారానికి స్వస్తి పలకాలి. మతాలు, కులాలు, సాంప్రదాయాలు మహిళల హక్కులకు ఆటంకంగా మారితే.. వాటిని రాజ్యాంగబద్ధంగా తొలగించాలి. అనాగరికమైన కాలంచెల్లిన కుటుంబ వ్యవస్థల స్థానంలో అణచివేత లేని సమాన భాగస్వాములుండే ప్రజాస్వామ్య కుటుంబాలు.. హింసలేని కుటుంబాలు ఏర్పరచుకునేందుకు వీలు కలిగించే కుటుంబ చట్టాలు చేయాలి తప్ప రాజకీయ ప్రయోజనాలు కక్ష సాధింపులకు కుటుంబం ఒక చట్ట సాధనం కాకూడదు.

వ్యాసకర్త సాంస్కృతిక కార్యకర్త
ఈ–మెయిల్ : pa_devi@rediffmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083









ఇండస్ట్రీలో మెగాస్టార్‌ని ఎవరైనా క్వశ్చన్ చేస్తారా?
ఆయన ఏది చేస్తే అదే రైట్. ఏది చెబితే అదే ఆన్సర్.
ఎప్పుడు చేస్తే అప్పడే ట్రెండ్.. ఎలా చేస్తే అదే ఇన్‌స్పిరేషన్.
మళ్లీ 20 ఏళ్ల బ్యాక్ లుక్‌తో చిరంజీవి ట్రెండ్‌ని చిరంజీవే మారుస్తున్నారు.
అలాంటి మెగా మామగారిని కొణిదెలవారి కోడలు క్వశ్చన్లు అడిగితే?
సైరా ఫ్యాన్స్... వెయ్యండి ఈలలు... కొట్టండి సిక్సర్లు!

# కోడలి క్వశ్చన్స్


చిరంజీవిని ఇంటర్వ్యూ చేస్తున్న కోడలు ఉపాసన


చిరంజీవి లేటెస్ట్ ఫోటోషూట్ 'సాక్షి'కి ఎక్స్‌క్లూజివ్

**ఉపాసన: 'సైరా'లో మీరు ఎన్నో సాహసాలు చేశారు. గుర్రపు స్వారీ చేశారు. కోట పైనుంచి దూకారు. తీవ్రమైన కత్తి యుద్ధం సన్నివేశాలు చేశారు. ఇలా ఎన్నో ధైర్యసాహసాలను ప్రదర్శించారు. గాయాలు లేకుండా అలవోకగా చేయడం మీకెలా సాధ్యమైంది?**

**చిరంజీవి:** షూటింగ్ సమయంలో చాలా శారీరక శ్రమ, కష్టం సహజమే. అయితే నటనపై నాకున్న ఇష్టం ఆ ఒత్తిడిని అధిగమించేలా చేసేస్తుంది. స్ట్రెస్ అనేదాన్ని దరిదాపుల్లోకి కూడా రానివ్వను. ఇంకో విషయం ఏంటంటే.. యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్నప్పుడు నేనెప్పుడూ నా వయసు గురించి ఆలోచించను. ఇది చెయ్య గలుగుతానా? లేదా అని నా మీద నాకెప్పుడూ డౌట్ రాలేదు. సినిమా కోసం ఏదైనా చేయగలననే నమ్మకం నాకుంది. కత్తి యుద్ధం కావొచ్చు, గుర్రంపైకి దూకడం లాంటివి కావొచ్చు, వేరే ఏ రిస్క్ అయినా కావొచ్చు. సినిమా చూస్తున్నప్పుడు మేం ఎక్కడా డూప్ షాట్‌లు ఉపయోగించకుండా నేనే చేశానని మీకు అర్థం అవుతుంది. సాహసాలు చెయ్యటం అనేది మన మనసుకి సంబంధించిన విషయం. మనల్ని మనం ఎలా ప్రాజెక్ట్ చేసుకుంటాం అనేది మన మీదే ఆధారపడి ఉంటుంది. మీ మనసు బలంగా ఉంటే మీ ఆత్మవిశ్వాసాన్ని మీరెప్పుడూ కోల్పోరు.

**ఉపాసన: యూత్ ఈ సినిమాని ఎందుకు చూడాలి అంటే ఏం చెబుతారు?**

**చిరంజీవి:** 'సైరా' యువతకు చాలా ముఖ్యమైన సినిమా. ఈ రోజు మనందరం, మన దేశ స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఆస్వాదిస్తున్నామంటే దానికోసం మన పూర్వికులు ఎన్నో మూల్యాలను చెల్లించారు. త్యాగాలు చేశారు. అయితే వాటిని మనం నెమ్మదిగా మరచిపోతున్నాం. భావి తరాల కోసం, లక్షలాది మంది తమ ప్రాణాలు ఎలా కోల్పోయారో తెలుసుకుంటున్నప్పుడు ఉద్వేగానికి లోనవుతాం. వారి పోరాటం గురించి వింటున్నప్పుడు రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఈ రోజు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ, వారందరి పోరాటాలు, త్యాగాల ఫలమే అనే విషయాన్ని 'సైరా' మరోసారి గుర్తు చేస్తుంది.

**ఉపాసన: ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన సినిమాలో నటించడం గురించి?**

**చిరంజీవి:** ఓ మహోన్నతమైన సినిమాలో నటించినప్పుడు ఏ నటుడికైనా చాలా ఆనందంగా ఉంటుంది. సంతృప్తి మిగులుతుంది. ఆ తరం చేసిన అన్ని త్యాగాలను తిరిగి పరిచయం చేసుకోవడం చాలా ముఖ్యం. సినిమా చూశాక యువతరం దేశభక్తి పట్ల దృష్టి ఆకర్షితులైనా, తమ స్వేచ్ఛను గౌరవించుకోవాలన్న ఆలోచన కలిగినా 'సైరా' విజయవంతమైనట్టే. ఈ సినిమా కచ్చితంగా తరాల మధ్య వారధిలా వారి అంతరాన్ని తగ్గిస్తుంది. అక్టోబర్ 2వ తేదీన మహాత్మా గాంధీ 150వ జన్మదినం సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయటం ఒక గొప్ప అనుభూతి.

**ఉపాసన: ఓకే.. మవయ్యా... మన ఇంటి గురించి మాట్లాడుకుందాం.. మన దైనందిన జీవితంలో ముఖ్యభాగమైన 'చిరు దోసె', 'చిరు కాఫీ'ల వెనక ఉన్న రహస్యాలను మాతో పంచుకోగలరా? ముందు కాఫీ గురించి చెబుతారా?**

**చిరంజీవి:** కాఫీకి సంబంధించిన క్రెడిట్ మొత్తం మీ అత్తమ్మ సురేఖదే (నవ్వుతూ). సురేఖ మద్రాస్‌లో ఉండేది కదా. మద్రాస్ అంటే రుచికరమైన ఫిల్టర్ కాఫీకి చాలా పాపులర్. సురేఖ డైలీ లైఫ్ 'మంచి ఫిల్టర్ కాఫీ'తోనే మొదలవుతుంది. నిజానికి మొదట్లో నేను కాఫీని ఇష్టపడేవాడిని కాదు. కానీ ఆ తర్వాత సురేఖ మహిమ వల్ల కాఫీ ప్రేమికుడిని అయిపోయాను (నవ్వులు). మద్రాస్‌లో ఉన్నప్పుడు తను నీలగిరి నుంచి స్వయంగా 'రోస్టెడ్ కాఫీ గింజ'లను తెప్పించేది. హైదరాబాద్ వచ్చిన తరువాత కూడా అక్కడినుంచి తెప్పించి, ఆ కాఫీ పౌడర్‌నే వాడుతోంది, అందుకే మన ఇంటి కాఫీని అందరూ ఇష్టపడతారు.

**ఉపాసన: ఇప్పుడు టేస్టీ టేస్టీ 'చిరు దోసె' గురించి కూడా చెబుతారా?**

**చిరంజీవి:** కాఫీ క్రెడిట్ అయితే సురేఖదే కానీ దోసె క్రెడిట్ మొత్తం నాదే. 'చిరు దోసె' నా ఆవిష్కరణ అని గర్వంగా చెప్పగలను. ఒకసారి షూటింగ్ సందర్భంగా చిక్‌మగళూరులోని ఒక చిన్న హోటల్‌లో ఓ రకమైన దోసె తిన్నాను. అంత రుచికరమైన దోసెని అంతకుముందు ఎప్పుడూ తినలేదు. ఎలా తయారు చేశారో తెలుసుకుందామని ఆ హోటల్ సిబ్బందిని పంపి, హోటల్ యజమానితో 'రెసిపీ' (తయారు చేసే విధానం) చెప్పమని అడిగాను. అయితే అది తమ సంప్రదాయ వంటకం అన్నారు. రెసిపీ చెప్పడానికి ఇష్టపడలేదు. అయినా నేను ఎలాగైనా తెలుసుకోవాలనుకున్నాను. ఇంటికెళ్లాక ఆ దోసె గురించి సురేఖకు చెప్పాను. ఎలాగైనా రెసిపీ కనిపెట్టాలని ఇద్దరం అనుకున్నాం. ప్రయోగాలు మొదలుపెట్టాం. ఏదైనా ట్రయల్ వేసేటప్పుడు తప్పులు జరుగుతాయి. ఆ తప్పుల నుంచి మనకు కావాల్సింది వస్తుంది. అలా మేం ప్రయత్నాలు మొదలుపెట్టాం. చివరికి రుచికరమైన దోసె తయారు చేశాం. విశేషం ఏంటంటే.. చిక్‌మంగళూరు దోసెకన్నా ఇది ఇంకా రుచిగా కుదిరింది. నూనె లేకుండా మెత్తని దోసెలు తయారు చేశాం. రుచికి రుచీ ఆరోగ్యానికి ఆరోగ్యం. చెన్నైలో ఉంటూ అప్పుడప్పుడూ ఇక్కడికొచ్చే కొందరు సినిమా స్టార్స్ ఆ దోసె తినడం కోసం మన ఇంటికి వస్తారు. ప్రభుదేవా, జయసుధ ఇలా.. నా దోసెను ఇష్టపడే స్టార్స్ చాలామంది ఉన్నారు.

**ఉపాసన: చిక్‌మంగళూరులో హోటల్ యజమానిని రెసిపీ అడిగితే చెప్పలేదు. మరి.. మీ దోసె రెసిపీని ఎవరికైనా చెప్పారా?**

**చిరంజీవి:** చట్నీస్ రెస్టారెంట్ ఓనర్ మన ఇంట్లో దోసె తిన్నారు. బాగా నచ్చడంతో తమ హోటల్ మెనూలో ఆ దోసె పెట్టుకోవచ్చా అని అడిగారు. హ్యాపీగా సరే అని, నా చెఫ్‌ని పంపి వారికి ఆ రెసిపీ తయారు చేయడానికి శిక్షణ ఇప్పించాను. వాళ్లు దానికి 'చిరు దోసె' అని పేరు పెట్టారు. దూరప్రాంతాల నుండి, విదేశాల నుండి వచ్చిన వారు కూడా 'చిరు' దోసెని ఇష్టంగా తింటారని తెలిసి నాకు చాలా ఆనందంగా ఉంటుంది.

**ఉపాసన: అత్తమ్మలో ఇప్పటిస్త్రీలు నేర్చుకోవలసిన లక్షణాల గురించి? తల్లిగా, కుమార్తెగా, అత్తగా ఆమె గురించి మీ మాటల్లో...**

**చిరంజీవి:** సురేఖ లాంటి చక్కని అవగాహన ఉన్న భార్యను పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. 'స్వార్థం' అనేది తనకు తెలియదు. ఇంటిల్లిపాదికీ ప్రేమను పంచడం మాత్రమే తనకు తెలుసు. ప్రేమను పంచడంలోనే తన ఆనందం చూసుకుంటుంది. ఒకప్పుడు నేను రోజుకి మూడు షిఫ్టులు షూటింగ్స్ చేస్తూ ఫ్యామిలీ టైమ్‌ని బాగా మిస్సయేవాడిని. అప్పుడు నా అమ్మానాన్నలను, తోడబుట్టినవాళ్లను తనే చూసుకునేది. అందరి అవసరాలు తెలుసుకుని, వాళ్లు సౌకర్యవంతంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేది. వాళ్ల ఇష్టాలకు ఏ లోటూ రానివ్వలేదు. కుటుంబాన్ని సురేఖ ఎంత బాగా చూసుకుందో చెప్పడానికి ఒక్క చిన్న ఉదాహరణ చెబుతాను. మా నాన్నగారు తనని ఎప్పుడూ పేరుతో పిలిచేవారు కాదు.. 'అమ్మా' అని పిలిచేవారు. కోడలంటే ఆయనకు ఎంతో అభిమానం, గౌరవం ఉండేవి.

**ఉపాసన: మరి... మీ అమ్మగారు మా అత్తమ్మతో ఎలా ఉండేవారు?**

**చిరంజీవి:** (నవ్వుతూ). అమ్మకు సురేఖ అంటే చాలా ప్రేమ. నా తోడబుట్టినవాళ్లకైతే సురేఖ వదిన కన్నా ఎక్కువ. అందరూ సురేఖ సలహాలను పాటిస్తారు. ఇన్‌పుట్స్ తీసుకుంటారు. మా కూతుళ్లు సుస్మిత, శ్రీజలు కూడా తల్లి సూచనలు తీసుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే కుటుంబం మొత్తానికి మీ అత్తమ్మ కేంద్రబిందువు.

**ఉపాసన: మీ గురించి చెప్పండి.. అత్తమ్మ సలహాలు వింటారా? మీ సినిమాల గురించి ఆమె ఏమంటారు?**

**చిరంజీవి:** నేను కచ్చితంగా సురేఖ సలహాలు వింటాను. నా సినిమాల గురించి మంచీ చెడూ రెండూ చెబుతుంది. మంచి విశ్లేషకురాలు. సినిమా చూశాక అందులోని సీన్స్ అన్నీ 'అప్ టు ది మార్క్' ఉన్నాయా? లేవా? అనే విషయం కూడా స్పష్టంగా చెబుతుంది. సురేఖ ఒక సూపర్ స్టార్ భార్య, గొప్ప తల్లి మాత్రమే కాదు.. అల్లు రామలింగయ్య గారిలాంటి లెజెండ్ కుమార్తె. ఒక మహానటుడి కుమార్తె. నేను ఆమెను నా 'స్టార్' అని భావిస్తాను.

సమన్వయం, కూర్పు: డి.జి. భవాని
ఫొటోలు: డబ్బూ రత్నాని

## కుటుంబం కలిసికట్టుగా ఉండాలంటే ఉపాసన ఏమంటున్నారంటే...

**■ కేవలం సంపాదన మాత్రమే కాకుండా మీ కుటుంబ విలువలను పెంచే విధంగా ఏం చేస్తున్నారు?**

**ఉపాసన:** కుటుంబాన్ని ఎప్పటికీ కలిసుండేలా చేసేందుకు నన్ను నేను ఎడ్యుకేట్ చేసుకుంటున్నాను. పర్సనల్‌గా, ప్రొఫెషనల్‌గా తాతయ్య అంచనాలను అందుకునేందుకు, వాటిని నిలబెట్టేందుకు కృషి చేస్తుంటాను. ఎడ్యుకేషన్, కష్టపడే తత్వం, అంకితభావం, ప్రేరణ, మన దేశానికి తిరిగివ్వాలి అనే ఆలోచనలతో ముందుకువెళుతున్నా.

**■ మీ కుటుంబ వారసత్వాన్ని ఏర్పరచడం లేదా కాపాడటంలో మీ సహకారం ఎంత?**

**ఉపాసన:** కుటుంబ విలువలకు నిజాయితీగా ఉండాలి. మారుతున్న కాలంతో పాటు ఫ్యామిలీ గోల్స్ ఎప్పటికప్పుడు కొత్తవి ఏర్పరచుకోవాలి. అభిప్రాయాలకు, సలహాలకు ఎప్పుడూ ఓపెన్‌గా ఉండాలి. ఫ్యామిలీ సక్సెస్‌ఫుల్‌గా, స్ట్రాంగ్‌గా ఉండటానికి మంచి అలవాట్లను ఆచరణలో పెట్టడం ముఖ్యం. చిన్న చిన్న ఫ్యామిలీ ఇష్యూల గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుకునే వాతావరణం మన ఇంట్లో ఉండాలి. అంతే కానీ దాన్ని పక్కన పెడుతూ దాని వల్ల నెగటివిటీ పెరిగేలా చేయకూడదు. కుటుంబంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఎప్పుడూ మొగ్గలోనే తుంచేస్తూ అందరి మధ్య బంధాన్ని మరింత బలపరుస్తుండాలి.

**■ మీ కుటుంబంలో అతిముఖ్యమైన విలువలేంటి? మిగతావారితో అది ఎలా విభిన్నంగా ఉంటుంది?**

**ఉపాసన:** అనుభవం, అవగాహనలు తెచ్చే గౌరవం. బాధ్యత, ఆధ్యాత్మికత వల్ల వచ్చే వినయం. నిజాయితీ, పాజిటివిటీ ఏర్పరిచే విజయం. ప్రేమ, పట్టుదల మనల్ని నడిపించే ధైర్యం.. ఇవే మా కుటుంబంలో అతి ముఖ్యమైన విలువలు.


ఉపాసన



**ఉపాసన: ఫిట్‌నెస్ విషయంలో మీరు ఎవర్ని రోల్ మోడల్‌గా భావిస్తారు?**

**చిరంజీవి:** ఫిట్‌నెస్ విషయంలో నాకు చాలామంది స్ఫూర్తి. ఫిట్‌గా ఉండటం అనేది ఒక మంచి అనుభూతి. నా చుట్టుపక్కల ఉండే వాళ్ల దగ్గర్నుంచి, నేను కలిసేవాళ్లు, చూసేవాళ్ల నుంచి ఇన్‌స్పైర్ అవుతుంటాను. హాలీవుడ్‌లో సిల్వెస్టర్ స్టలోన్, ఆర్నాల్డ్ స్క్వార్జెనెగ్గర్‌లు నాకు స్ఫూర్తిదాయకం. బాలీవుడ్‌లో అమితాబ్ బచ్చన్‌గారి గురించి చెప్పాలంటే ఈ రోజుకీ ఆయన ఎంతో చలాకీగా వుంటారు. ఆయనలో కనిపించే ఉత్సాహం, ఆయన స్టామినాతో పోటీపడటం ఇప్పటి యువకులకి కూడా చాలా కష్టం. అలాగే నా చుట్టూ ఉండేవాళ్లలో టి. సుబ్బిరామిరెడ్డిగారి గురించి కూడా ప్రత్యేకంగా చెప్పాలి. 76 ఏళ్ల వయసులో కూడా ఆయనకి ఉన్న చురుకుదనం, మానసిక ఉత్సాహం మెచ్చుకోదగ్గవి. అలాగే మురళీమోహన్ గారు ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా వుంటారు. నేను వారందర్నీ గమనిస్తుంటాను. ఫిజికల్‌గా, మెంటల్‌గా వారి నుంచి నేర్చుకోదగ్గ విషయాలను నేర్చుకుంటుంటాను. ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆచరిస్తుంటాను.






## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
ఒక దేవత వెలసింది నీ కోసమే
ఈ ముంగిట నిలిచింది మధుమాసమే
ఒక దేవత వెలసింది నీ కోసమే
ఈ ముంగిట నిలిచింది మధుమాసమే
సంధ్యాకాంతుల్లోన శ్రావణిలా
సౌందర్యాలే చిందే యామినిలా
ఎన్నో జన్మల్లోని పున్నమిలా
శ్రీరస్తంటూ నాతో అంది ఇలా
నిన్నే ప్రేమిస్తానని...
॥ఒక దేవత॥

**చరణం : 1**
విరిసే వెన్నెల్లోన మెరిసే కన్నుల్లోన నీ నీడే చూశానమ్మా
ఎనిమిది దిక్కుల్లోన నింగిని చుక్కల్లోన నీ జాడే వెతికానమ్మా
నీ నవ్వే నా మదిలో అమృతవర్షం
ఒదిగింది నీలోనే అందని స్వర్గం
నునుసిగ్గుల మొగ్గలతో ముగ్గులు వేసి
మును ముందుకు వచ్చే నెచ్చెలినే చూసి
అంటుందమ్మా నా మనసే
నిన్నే ప్రేమిస్తానని
॥ఒక దేవత॥

**చరణం : 2**
రోజా మొక్కలు నాటి ప్రాణం నీరుగ పోసి పూయించా నీ జడకోసం
రోజూ ఉపవాసంగా హృదయం నైవేద్యంగా పూజించా నీ జతకోసం
నీరెండకు నీ వెంటే నీడై వచ్చి
మమతలతో నీ గుడిలో ప్రమిదలు చేస్తా
ఊపిరితో నీ రూపం అభిషేకించి
ఆశలతో నీ వలపుకు హారతులిస్తా
ఇన్నాళ్లూ అనుకోలేదే నిన్నే ప్రేమిస్తానని
॥ఒక దేవత॥

**చిత్రం : నిన్నే ప్రేమిస్తా (2000)**
**రచన : వెనిగళ్ల రాంబాబు**
**సంగీతం : ఎస్.ఎ.రాజ్‌కుమార్**
**గానం : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం**

కట్‌చేయ్...దాచేయ్...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 5 | | 8 | | | 7 | | |
| | | 9 | 6 | | 7 | | | |
| 7 | 3 | | 2 | 5 | | | | 9 |
| | | | | | | | 7 | 6 |
| 6 | 8 | 5 | 1 | | 9 | 3 | 2 | 4 |
| 4 | 7 | | | | | | | |
| 2 | | | | 8 | 3 | | 5 | 7 |
| | | | 4 | | 6 | 1 | | |
| | | 8 | | | 5 | | 9 | |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3×3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 2 | 1 | 8 | 4 | 7 | 6 | 5 | 9 |
| 8 | 7 | 5 | 6 | 2 | 9 | 3 | 1 | 4 |
| 6 | 9 | 4 | 3 | 1 | 5 | 2 | 8 | 7 |
| 7 | 6 | 8 | 4 | 5 | 1 | 9 | 3 | 2 |
| 9 | 5 | 2 | 7 | 3 | 8 | 1 | 4 | 6 |
| 1 | 4 | 3 | 2 | 9 | 6 | 5 | 7 | 8 |
| 2 | 8 | 7 | 1 | 6 | 3 | 4 | 9 | 5 |
| 4 | 1 | 9 | 5 | 8 | 2 | 7 | 6 | 3 |
| 5 | 3 | 6 | 9 | 7 | 4 | 8 | 2 | 1 |


● రానా

# సెప్టెంబర్‌లో స్టార్ట్

ఆరోగ్య సమస్యల కారణంగా రానా చిన్న బ్రేక్‌లో ఉన్నారని సమాచారం. ఓ నెల విశ్రాంతి తీసుకున్న తర్వాత మళ్లీ యాక్షన్‌లోకి రానున్నారని తెలిసింది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి మళ్లీ షూటింగ్స్‌ను షురూ చేస్తారట. వేణు ఉడుగుల దర్శకత్వంలో రానా, సాయి పల్లవి జంటగా ‘విరాట పర్వం’ అనే చిత్రం ప్రారంభమైన విషయం తెలిసిందే. రానా తన పాత్ర షూటింగ్ ఇంకా ప్రారంభించలేదు. మిగతా సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. సెప్టెంబర్‌లో ‘విరాట పర్వంలో’ సెట్స్‌లోకి అడుగుపెడతారట. ఆ తర్వాత గుణ శేఖర్ దర్శకత్వంలో రూపొందబోయే భారీ బడ్జెట్ పౌరాణిక చిత్రం ‘హిరణ్య కశ్యప’ కూడా మొదలుపెడతారని తెలిసింది.

# స్క్రీన్‌పై తొలిసారి


● ఏఆర్ రెహమాన్

ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ సిల్వర్ స్క్రీన్ వెనక చాలా ఏళ్లుగా సందడి చేస్తూనే ఉంది. ఆయన మ్యూజిక్‌ని ఇన్నాళ్లూ వింటూనే ఉన్నాం. త్వరలోనే ఆయన్ను సిల్వర్ స్క్రీన్ మీద కూడా చూడబోతున్నాం. అయితే పూర్తి స్థాయి పాత్రలో కాదు అతిథి పాత్రలో అని తెలిసింది. అట్లీ దర్శకత్వంలో విజయ్ హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం ‘బిగిల్’. అంటే విజిల్ అని అర్థం. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో మొదటి పాట ‘సింగపెన్నే..’ రిలీజై మంచి విజయం సాధించింది. ఈ పాటలో విజయ్‌తో కలసి రెహమాన్ స్క్రీన్ మీద కనిపిస్తారట. మ్యూజిక్ ఆల్బమ్స్‌లో ఇదివరకు రెహమాన్ చాలాసార్లు నటించారు. కానీ సినిమాలో కనిపించడం ఇదే తొలిసారి కావడం విశేషం.


● ధనుష్

# మావయ్యతో నటించడం లేదు

సినిమాలు చేయడానికి భాషను హద్దుగా పెట్టుకోనంటున్నారు దర్శక–నిర్మాత–నటుడు ధనుష్. 2013లో ‘రాంజ్‌నా’, 2015లో ‘షమితాబ్’ అనే హిందీ చిత్రాల్లో నటించారు ధనుష్. తాజాగా ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో హృతిక్ రోషన్, ధనుష్, సారా అలీఖాన్ హీరో హీరోయిన్లుగా ఓ సినిమా తెరకెక్కనుందని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే. .‘షమితాబ్’ విడుదలైన తర్వాత మీరు ఇప్పటివరకు మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడానికి కారణం ఏంటీ? అన్న ప్రశ్నను ధనుష్ ముందుంచితే... ‘‘హిందీలో మరో సినిమా చేయాలని నాకూ ఉంది. అయితే ‘షమితాబ్’ సినిమా బాగా ఆడకపోవడం వల్లే నాకు హిందీలో అవకాశాలు రావడం లేదనే వాదన సరైంది కాదు. అది బ్రిలియంట్ ఫిల్మ్. సినిమా రిజల్ట్ గురించి పక్కనపెడితే ఆ సినిమాలో అమితాబ్ బచ్చన్ వంటి గొప్ప నటుడితోనే నేను స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఆ అనుభవాన్ని మరచిపోలేను. కోలీవుడ్‌లో బిజీగా ఉన్నాను. హిందీలో మరో సినిమా చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా’’ అని అన్నారు. కానీ, ఆనంద్ ఎల్. రాయ్ సినిమా గురించి మాత్రం ధనుష్ క్లారిటీ ఇవ్వలేదు. అలాగే మామా అల్లుడు రజనీకాంత్, ధనుష్ కలిసి ఓ సినిమాలో నటించబోతున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ‘అందులో నిజం లేదు’ అని స్పష్టం చేశారు ధనుష్.


● షారుక్ ఖాన్

# రీమేక్‌తో వస్తున్నారా?

‘డాన్ 3’, రాజ్‌కుమార్ హిరాణీతో ఓ లవ్ స్టోరీ, ఆదిత్య చోప్రాతో సినిమా, అట్లీతో ఓ రీమేక్ సినిమా... ఈ సినిమాల్లో షారుక్ నెక్ట్స్ సినిమా ఏంటి? అనే విషయంలో క్లారిటీ రాలేదు. లేటెస్ట్‌గా బాలీవుడ్‌లో వినిపిస్తున్న కొత్త న్యూస్ ఏంటంటే... స్పానిష్ సిరీస్ ‘మనీ హేస్ట్’ను హిందీలో రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ సిరీస్ రైట్స్‌ను కూడా షారుక్ తీసుకున్నట్టు తెలిసింది. ఈ సిరీస్‌ను ఫీచర్ ఫిల్మ్‌గా రూపొందించే ఆలోచనలో ఆయన టీమ్ ఉందని సమాచారం. బ్యాంక్ దొంగతనం ఆధారంగా ఈ కథ నడుస్తుంది. ఈ సినిమాని షారుక్ నిర్మించడం మాత్రమేనా? నటిస్తారా? అనే విషయంలో ప్రస్తుతానికి క్లారిటీ లేదు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత మిగతా వివరాలను ప్రకటించనున్నారు టీమ్.

# ప్రేక్షకులు మెచ్చిందే పెద్ద సినిమా


● శర్మ, రోషన్ సాలూరి, రాజేశ్, నరేంద్ర రెడ్డి, అనసూయ, ధనరాజ్

‘‘డబ్బుతో ముడిపెట్టి పెద్ద సినిమా, చిన్న సినిమా అని అనడం సరి కాదు. ప్రేక్షకులకు నచ్చిందే పెద్ద సినిమా.’’ అని నటి అనసూయ అన్నారు. రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘కథనం’. బేబి గాయత్రి రెడ్డి సమర్పణలో బి. నరేంద్ర రెడ్డి, శర్మ చుక్కా నిర్మించారు. ఈ నెల 9న విడుదల కానున్న ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. సీనియర్ పాత్రికేయులు పసుపులేటి రామారావు టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ– ‘‘నాగార్జున గారు నా ఫేవరెట్ హీరో. ఆయన సినిమా (‘మన్మథుడు 2’ ఈ నెల 9న విడుదల కానుంది) పోస్టర్, నా సినిమా పోస్టర్ ఒకే రిలీజ్ టైమ్‌కి చూస్తానను కోలేదు. ఇది ఆయనతో పోటీపడటం కాదు. కథనం, మన్మథుడు 2 సినిమాల జానర్స్ కూడా వేరు. ధనరాజ్ వల్లే ఈ చిత్రంలో నటించాను. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. ఇందులో ఒకే ఒక పాట ఉంది. సతీష్ కెమెరా వర్క్ నాలో కాన్ఫిడెన్స్ నింపింది. రోషన్ మంచి సంగీతం ఇచ్చారు’’ అని అన్నారు. ‘‘సెలవులు కలిసి రావడం, దగ్గర్లో మరో విడుదల తేదీ లభించకపోవడంవల్లే ఈ నెల 9న మా సినిమాను విడుదల చేస్తున్నాం. పెద్ద చిత్రంతో పోటీపడాలని కాదు. అనసూయ నటన ఈ సినిమాకు హైలైట్‌గా ఉంటుంది’’ అని నిర్మాతలు తెలిపారు. ‘‘మన్మథుడు 2’ సినిమాకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ప్రచారం చేస్తున్నాం. నైజాంలో ‘దిల్’ రాజుగారు విడుదల చేయడం హ్యాపీ’’ అన్నారు రాజేష్. ‘‘భాగమతి’ తర్వాత ఆ స్థాయి పాత్ర ఈ సినిమాలో చేసే అవకాశం వచ్చింది’’ అని ధనరాజ్ అన్నారు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎమ్. విజయ చౌదరి.

# చిక్కిన ఆఫర్?


● రాశీ ఖన్నా

చక్కనమ్మ చిక్కినా అందమే.. ఈ పాత సామెత కొత్తగా మేకోవర్ అయినవారికి చక్కగా సరిపోతోంది. ఇప్పుడు రాశీ ఖన్నాని చూసే ఇలానే అనాలనిపిస్తుంది. నిజానికి ‘ఊహలు గుసగుసలాడె’ సినిమాతో స్క్రీన్ మీద కనిపించినప్పుడు రాశీ ఖన్నా బొద్దుగానే ఉన్నారు. తర్వాత తర్వాత కొంచెం బరువు తగ్గే పనిలో పడ్డారు. ఇప్పుడైతే మెరుపు తీగలా తయారయ్యారు. ‘బికినీ’కి సూట్ అయ్యేట్లు ఫిజిక్‌ని మార్చేసుకున్నారు. బికినీలో ఫొటోషూట్ చేయించుకున్న ఫొటోలు కూడా జోరుగా షికారు చేస్తున్నాయి. ఆ మేకోవర్ చూసి ‘వావ్ రాశీఖన్నా’ అనకుండా ఉండలేక పోతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే రాశీ ఖాతాలో ఓ భారీ సినిమా చేరిందని సమాచారం. మణిరత్నం దర్శకత్వంలో రూపొందనున్న భారీ మల్టీస్టారర్ మూవీ ‘పొన్నియిన్ సెల్వన్’లో ఈ బ్యూటీని కీలక పాత్రకు అడిగారట. చోళుల చరిత్ర ఆధారంగా ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూర్తి రాసిన పొన్నియిన్ సెల్వన్ నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ప్రస్తుతం వెంకీమామ, ప్రతిరోజూ పండగే సినిమాలతో పాటు తమిళంలో ఓ సినిమా చేస్తూ బిజీగా ఉన్న రాశీఖన్నా ‘పొన్నియిన్ సెల్వన్’కి డేట్స్ ఇవ్వడం కోసం డైరీ చెక్ చేసుకుంటున్నారట. ఈ చిత్రంలో ‘జయం’ రవి, కార్తీ, విక్రమ్, అధర్వ, ఐశ్వర్యా రాయ్, అనుష్కా, కీర్తీసురేశ్, అమలాపాల్ ఇలా ఈ సినిమాలో నటించే నటీనటుల గురించి ఎప్పటికప్పుడు ఏదో వార్త వినిపిస్తూనే ఉంది. అయితే ఈ సినిమాలో నటిస్తున్నామని విక్రమ్, ఐశ్వర్యారాయ్ మాత్రమే అధికారికంగా ప్రకటించారు.


● సుస్మితా సేన్

# పెళ్లికి వేళాయె

గత ఏడాది బాలీవుడ్‌లో పెళ్లి బాజా 70 ఎమ్ ఎమ్ డీటీఎస్ సౌండ్‌లో మోగినట్లు మోగింది. బాలీవుడ్ కథానాయికలు ప్రియాంకా చోప్రా, దీపికా పదుకోన్, నేహా ధూపియాలతో పాటు మరికొందరు మెట్టినింట అడుగుపెట్టారు. తాజాగా సుస్మితాసేన్ పెళ్లి ఘడియలు దగ్గర పడ్డాయని తెలుస్తోంది. మోడల్ రోహమాన్ షా, సుస్మితా ప్రేమలో ఉన్నారనే వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ క్లోజ్‌గా ఉన్న ఫొటోలు నెటిజన్లకు బాగానే దర్శనమిస్తున్నాయి. త్వరలో ఈ ఇద్దరూ ఏడడుగులు వేయాలని నిర్ణయించుకున్నారట. ఈ ఏడాది నవంబర్‌లో పెళ్లి జరగనుందని జోరుగా ప్రచారం జరుగుతోంది. రోహమాన్ షా వయసురీత్యా సుస్మితా కన్నా దాదాపు పదిహేనేళ్లు చిన్నవాడు కావడం విశేషం.

# సైకలాజికల్ థ్రిల్లర్


● దీపాలి, అఖిల్‌రెడ్డి, దీపిక

అరుణ– కళ్యాణి టాకీస్ పతాకంపై కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం ‘ఒకడు’. శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. అఖిల్ రెడ్డి హీరోగా పరిచయమవుతున్నారు. ముహూర్తపు సన్నివేశానికి శేఖర్ మాస్టర్ క్లాప్‌నివ్వగా, సత్య మాస్టర్ కెమెరా స్విచాన్ చేశారు. స్క్రిప్ట్‌ను దర్శకుడు బీవీయస్ రవి దర్శకునికి అందించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ – ‘‘ఇది నా మొదటి చిత్రం. అందరూ అనుభవం ఉన్న టెక్నీషియన్లతో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. సంగీత దర్శకులు మణిశర్మ గారు స్వరాలందించడం హ్యాపీ. మొత్తం ఐదు షెడ్యూల్స్‌లో సినిమా పూర్తి చేస్తాం ఈనెల 16న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం’’ అన్నారు. ఈ సినిమా మంచి మెసేజ్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తుందని చిత్ర నిర్మాత ముత్తయ్య అన్నారు.‘‘నేను చేస్తున్న మొదటి సినిమాకు మంచి స్క్రిప్ట్ కుదిరింది. మంచి సైకలాజికల్ థ్రిల్లర్‌ను ప్రేక్షకులకు ఇవ్వబోతున్నాం’’ అన్నారు అఖిల్‌రెడ్డి.

# సల్మాన్ బావ... కత్రినా చెల్లి!


● ఇసాబెల్లా, ఆయుష్

ఇండియా–మయన్మార్ బోర్డర్ పరిసర ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు సల్మాన్‌ఖాన్ బావ ఆయుష్ శర్మ. ఆయుష్‌కు తోడుగా కత్రినా కైఫ్ చెల్లెలు ఇసాబెల్లా కైఫ్ కూడా వెళ్లనున్నారు. ఓ సినిమా కోసం ఇద్దరూ ఇలా తోడయ్యారు. ఈ చిత్రానికి కరణ్ భూతాని దర్శకత్వం వహిస్తారు. ‘‘కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నాం. ఇందులో నేను ఆర్మీ ఆఫీసర్‌గా నటించబోతున్నాను. ఈ పాత్ర కోసం ఫిజికల్‌గా బాగా కష్టపడుతున్నాను. ఈ సినిమా ఆసక్తికరంగా ఉంటుంది’’ అన్నారు ఆయుష్ శర్మ. ఈ సంగతి ఇలా ఉంచితే.. బాలీవుడ్‌లో ఇసాబెల్లాకు ఇది రెండో చిత్రం. ఇంతకు ముందు ‘టైమ్ టు డ్యాన్స్’ అనే సినిమా కమిట్ అయ్యారామె. ఇది చిత్రీకరణలో ఉండగానే రెండో సినిమాకి అవకాశం తెచ్చుకోగలిగారు.






సత్ గ్రంథం

# అనుభూతుల అక్షర రూపం



**క**లియుగదైవం శ్రీనివాసుడికి మహా భక్తుడు, వేదిక్ లోగో డిజైనర్ విశ్వపతి ఇప్పటివరకు 25 ఆధ్యాత్మిక గ్రంథాలను రచించడమేగాక, వాటిని ఉచితంగా పంచుతున్నారు. భక్తుల ఆదరణతో ఆ పుస్తకాలన్నీ పునర్ముద్రణలు పొందాయి. వీరి రచనలలో కొన్నింటిని హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ గ్రంథాలయాలలో కూడా ఉంచడం విశేషం. ఒకసారి విశ్వపతి ధ్యానంలో ఉన్నప్పుడు తాను 200 ఏళ్లక్రితం హిమాలయాలలో ఒక దివ్యాశ్రమంలో ఉన్నట్లు, అప్పుడు తనను ఎక్కడెక్కడినుంచో 108 మంది యోగులు వచ్చి కలిసినట్లు అనుభూతి చెందారు. అలా తనకు కలిగిన అనుభవాలను, అనుభూతులను 'అమృత దర్శనం' పేరిట అక్షరీకరించారు. ఎంతో ఆశ్చర్యానందాలకు లోను చేసే ఈ పుస్తకం కూడా పూర్తిగా ఉచితం.

**అమృత దర్శనం**, పుటలు: 150; వెల: అమూల్యం, ప్రతులకు: టి.వి.ఆర్.కె. మూర్తి (విశ్వపతి), ఫ్లాట్ నం.903, ఎఫ్– బ్లాక్, వెర్టెక్స్ సద్గురు కృప అపార్ట్‌మెంట్స్, సంఘమిత్ర హైస్కూల్ వద్ద, నిజామ్‌పేట్ రోడ్, హైదరాబాద్– 500 085.

# శ్రావణ మాసం సకల శుభాలకు ఆవాసం...



**శ్రావణమాసం... ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపించే మాసం. నెల రోజులపాటు ఉదయం, సాయంత్రం భగవన్నామస్మరణతో మారు మోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందని పండిత ఉవాచ. అంతేకాదు... ఈ నెలలో ఎన్నో పండుగలు, పర్వదినాలు. త్రిమూర్తుల్లో స్థితి కారుడు దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు మహావిష్ణువుకు, ఆయన దేవేరి మహాలక్ష్మికి; లయకారుడైన పరమేశ్వరుడికి, ఆయన సతీమణి మంగళ గౌరీదేవికి కూడా అత్యంత ప్రీతికరమైన మాసం. వివిధ రకాల పూజలు, వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ప్రసాదించే దివ్యమైన మాసంగా పెద్దలు చెబుతారు. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం పేరుతో ఏర్పడిన మాసం కావడం వల్ల ఈ మాసం లక్ష్మీవిష్ణుల పూజకు ఎంతో ఉత్కృష్టమైనది. ఈ మాసంలో చేసే దైవకార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.**

**శ్రావణ మాసం అంటే శుభమాసం. దీనిని నభో మాసం అని కూడా అంటారు. నభో అంటే ఆకాశం అని అర్థం. ఈ నెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. ఈ మాసంలోని ప్రతి శుక్రవారం మహిళలు మహాలక్ష్మిలా అలంకరించుకుని తమకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని సముద్ర తనయకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం పాల సముద్ర మథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని పరమశివుడు శ్రావణమాసంలోనే సేవించి నీలకంఠుడిగా లోకాన్ని ఉద్ధరించాడు. ఈ మాసంలో ఒక్కోరోజు ఒక్కో దేవతను పూజిస్తారు. సోమవారాల్లో శివుడికి అభిషేకాలు, మంగళవారం గౌరీ వ్రతం, బుధవారం విఠలుడికి పూజలు, గురువారం గురుదేవుని ఆరాధన, శుక్రవారం లక్ష్మీ, తులసి పూజలు, శనివారం హనుమంతుడు, వేంకటేశ్వరుడు, శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. వీటితోపాటు గరుడ పంచమి, పుత్రదైకాదశి, వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి, రుషి పంచమి, గోవత్స బహుళ, సీతల సప్తమి, శ్రీకృష్ణాష్టమి, పోలాల అమావాస్య లాంటి పండుగలు ఈ మాసంలోనే వస్తాయి.**

**శ్రా**వణం చంద్రుడి మాసం కూడా. చంద్రుడు మనఃకారకుడు. అంటే సంపూర్ణంగా మనస్సు మీద ప్రభావం చూపే మాసం. చంద్రుని చార నుంచి జరగబోవు దుష్ఫలితాలను నివారించి, మంచి కలిగించడానికి, మనస్సు మీద మంచి ప్రభావం ప్రసరించి పరమార్థం వైపు మళ్లించి మానసిక ప్రశాంతత పొందడానికి, ప్రకృతి వల్ల కలిగే అస్తవ్యస్త అనారోగ్యాల నుంచి తప్పించుకోవడానికి, మంచి ఆరోగ్యాన్ని పొందడమే శ్రావణ మాసంలో వచ్చే పండుగలలోని ఆచారాల ముఖ్యోద్దేశం.

సకలదేవతలకు ప్రీతికరమైనది శ్రావణ మాసం. ప్రతిరోజూ పండుగలా ఆడపడుచులు సంతోషంగా ఉండే మాసం. ఈ మాసంలో రోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే దీర్ఘసుమంగళీయోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయని విశ్వాసం. తిథులతో సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పండుగలు, పూజలు చేసే అత్యంత శుభప్రదమైన మాసం ఇదే.

### శివారాధనకు ఎంతో శ్రేష్ఠమైనది



ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్ని ఇస్తుందని ప్రతీతి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రివేళలో స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తే పాప ప్రక్షాళన జరుగుతుందని శాస్త్ర వచనం. సోమవారాల్లో శివుడి ప్రీత్యర్థం ఉపవాసం ఉండ గలిగినవారు పూర్తిగా, అలా సాధ్యం కాని పక్షంలో రాత్రి పూజ ముగిసిన అనంతరం ఆహారాన్ని భుజించవచ్చు. ఈ మాసం దీనిని ఒక వ్రతంగా పెట్టుకుని ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనేక శుభఫలితాలు కలుగుతాయి.

### మంగళ కరమైన మంగళ గౌరీ వ్రతం

శ్రావణ మాసంలో అన్ని మంగళవారాల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ, మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లి అయిన వారు ఆచరించాలి. వివాహమైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభించాలి. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం క్రమం తప్పకుండా చేయాలి. ఐదు సంవత్సరాల పాటు మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్యాపన చేయాలి. దీంతో వారు నిండు సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు ఉంటాయని వ్రత కథ చెబుతోంది.

### ఐశ్వర్య ప్రదమైన వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలుకాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరించవచ్చు. పూజ మండపంలో నిండు కలశాన్ని ఏర్పాటు చేసుకుని దానికి వరలక్ష్మీ దేవి ముఖప్రతిమను అలంకరించి పూజ చేయాలి. తర్వాత తొమ్మిది ముడులతో తోరణాన్ని తయారు చేసి పూజ చేసిన అనంతరం **బధ్నామి దక్షిణే హస్తే నవసూత్రం శుభప్రదం పుత్ర పౌత్రాభివృద్ధించ దేహిమే రమే** అని పఠిస్తూ చేతికి తోరం కట్టుకోవాలి. అనంతరం ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవాలి.

ఈ మాసంలో వచ్చే సోమవారం నాడు ఆవు పాలు, పెరుగు, చక్కెర, నెయ్యి, తేనె లాంటి పంచామృతాలతో శివుడికి అభిషేకం చేస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. బిల్వ పత్రాలు, ఉమ్మెత్త, కలువ, తుమ్మి లాంటి ఇష్టమైన పుష్పాలతో ఈశ్వరారాధన చేస్తారు.

శ్రావణమాసం మొదలైన నాలుగో రోజునే వచ్చే పండుగ నాగపంచమి. శివుడి ఆభరణమైన నాగేంద్రుడిని పూజించడం ఆచారం. పాలు, మిరియాలు, పూలతో నాగదేవతను పూజిస్తారు. వెండి, రాగి, రాతి, చెక్కలతో చేసిన నాగపడగలకు భక్తులు అభిషేకం చేస్తారు.

సంతానం లేని వారు భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్ల ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు చేసి, ఉపవాసం ఉంటే మంచి సంతానం కలుగుతుంది. అందుకే దీన్ని పుత్రద ఏకాదశి అన్నారు.

### శుక్ల పక్ష పౌర్ణమి

శ్రావణపౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈ రోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షబంధన పర్వదినం జరుపుకుంటున్నాం. అంతేకాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవీత ధారణ, వేదవిద్యారంభమూ చేస్తారు. కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటి పర్వదినాలు, కృష్ణాష్టమి, పోలాల అమావాస్య, గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న ఈ నెలలో చేయాల్సిన విధులు, పూజలు, వ్రతాలు, నియమాలు తూచ తప్పకుండా ఆచరిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయి.



**- కృష్ణ కార్తీక**

స్త్రీ వైశిష్ట్యం -3

# ఒకరిది అందం.. మరొకరిది ఆకర్షణ



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

**సృ**ష్టి అంత పవిత్రంగా కొనసాగడం కోసం అందాన్నంతటినీ పురుష శరీరంలోనూ, ఆకర్షణను స్త్రీ శరీరంలోనూ పరమేశ్వరుడు నిక్షేపించాడని నేనంటే మీకు అది అనుమానాస్పదంగా తోచవచ్చు. అందుకే నెమళ్ళను పరిశీలించండి. అందమైన ఈకలతో ఉన్న పింఛను విప్పి ఆడేది మగ నెమలి. ఆడ నెమలి పురివిప్పి ఆడదు. రంగురంగుల ఈకలతో ఉన్న తోకతో కోడిపుంజు చాలా అందంగా కనిపిస్తుంది. కోడిపెట్ట అలా ఉండదు. సింహం పెద్ద జూలుతో అందంగా ఉంటుంది. సివంగి అలా ఉండదు. ఇవి చౌకబారుతనంతో చెబుతున్న మాటలు కావు. పరమేశ్వరుడు ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందంటే రాబోయే ప్రాణులు మంచి తేజస్సుతో సష్టించబడాలంటే...సృష్టి కార్యమనే యజ్ఞంలో స్త్రీ పురుషులిద్దరికీ ఒక సంతోషం ఉండాలి. అందుకని స్త్రీ పురుష అనే రెండుగా విభాగం చేసాడు.

ఇందులో పురుషప్రాణికి సహజంగా ఉండే శారీరక సౌలభ్యం రీత్యా కొంచెం పైస్థానంలో ఉంచాడు. కానీ దానిని సంస్కరించకపోతే ప్రమాదమని భావించి కొన్ని కఠిన నియమాలు ఉంచాడు. కానీ స్త్రీకి అలాటి కఠిన నియమాలేవీ ఉంచలేదు. ఆమె సహజంగానే శాంత స్వభావి. ప్రేమమూర్తి. విశాల హృదయంతో చూడగల నేర్పరితనం ఆమె యందుంచాడు.



తెలుగునాట మనం ఆడపిల్ల అంటాం. 'ఆడ' పిల్ల అంటే అక్కడి పిల్ల అని. ఇక్కడ పుట్టింది. కానీ అక్కడికి వెడుతుంది. అది నా స్వస్థానం అంటుంది, అది నా ఇల్లు అంటుంది. ఇది మీ ఇల్లు అంటుంది. అలా ఎందుకు? ఆమె లక్ష్మి. ఆమె నారాయణుడిని వెతుక్కుంటుంది. ఆయన ఎక్కడున్నాడో చూసుకుంటుంది. అందుకే కన్యాదానం చేసేటప్పుడు తమ బిడ్డని లక్ష్మీ స్వరూపంగా భావన చేసి పద్మంలో కూర్చోబెడతారు. బుట్టలో ధాన్యం పోసి కూర్చోబెడతారు. అంటే పద్మంలో లక్ష్మీదేవిని కూర్చోబెట్టినట్లు. వరుడు పీటల మీదికి నడిచి వస్తాడు. వధువు అలా నడిచి రాకూడదు. ఆమె లక్ష్మి. బుట్టలో కూర్చోబెట్టి మేనమామలు తెచ్చి నారాయణుడిదగ్గరకు చేర్చడం కోసం అక్కడ పీటల మీద కూర్చోబెడతారు.

ఆమె కూడా మగపిల్లలు ఎలా పుట్టారో అలానే పుట్టింది. వాళ్ళతో కలిసి పెరిగింది. వివాహం అయి వెళ్ళేటప్పుడు తన పుట్టింటిని విడిచి పెట్టేస్తుంది. తన ఇంటిపేరు, గోత్రం విడిచిపెట్టేస్తుంది. ఇంతకు పూర్వం ఎప్పుడూ చూడలేదు ఆ పిల్లవాడిని. ఆ పిల్లవాడి చిటికెన వేలు పట్టుకుంది. తన జీవితానికి సంబంధించిన కష్టసుఖాలన్నీ అతని తోడనే అని నడుచుకుంటూ ఖండాంతరాలు దాటి కూడా వెళ్ళిపోతుంది.

తాను గర్భిణియై పునర్జన్మ పొందినంత క్లేశాన్ని అనుభవించి బిడ్డను కంటే– మొదట తాతయింది ఎవరు.. తన భర్త తండ్రి. ఆ వంశం తరించింది. ఆ వంశం పెరిగింది. ఆ పిల్ల ఎక్కడి పిల్ల? ఇక్కడ పుట్టినా అక్కడ ఉద్ధరింప చేస్తోంది. అసలు ఆ పిల్లలో ఆ భావన లేదనుకోండి. సృష్టి క్రమం ఇలా సజావుగా సాగుతుందా? కుటుంబాల్లో, జీవితాల్లో మనశ్శాంతి ఉంటుందా? వ్యవస్థలో క్రమశిక్షణ ఉంటుందా? ఒక బాతును నీళ్ళల్లో వదిలితే ఎలా అలవోకగా తిరుగుతుందో అలా అదే తన ఇల్లన్నట్లు, తను అక్కడే పుట్టినట్లు, అక్కడి వారంతా తనవారన్నట్లు అల్లుకు పోతుంది. ఆ భావోద్దీపన పురుషుడికీ ఉంటుందా...

గురు సన్నిధి

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

# శ్రీ విధుశేఖర భారతీం ఆశ్రయే!

**స**నాతన ధర్మ పరిరక్షణ కోసం జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు స్థాపించిన నాలుగు పీఠాలలో శ్రీ శృంగేరీ శారదాపీఠం ఒకటి. ఈ పీఠంలో శంకరాచార్యులు మొదలుకొని ఇప్పటివరకు అవిచ్ఛిన్న గురు పరంపరగా విరాజిల్లుతోంది. ఈ పరంపరలో ప్రస్తుత పీఠాధిపతి శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు కాగా, ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి. నాగలక్ష్మి కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని దంపతులకు జన్మించిన విధుశేఖరులు బాల్యం నుంచి పరమ వైరాగ్య భావన కలిగిన వారు. గర్భాష్టమంలో ఉపనయనం చేసుకుని తండ్రి గారి వద్ద కృష్ణ యజుర్వేదాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేశారు. అనంతరం శృంగేరీ జగద్గురువుల అనుగ్రహానికి పాత్రులై న్యాయ, వేదాంత, వ్యాకరణాది శాస్త్రాలను జగద్గురువుల సాన్నిధ్యంలోనే అతి తక్కువ సమయంలో అధ్యయనం చేసి అపార పాండిత్యాన్ని గడించారు. ఆయా శాస్త్రాలను అధ్యయనం చేసే సమయంలో కూడా అనుష్ఠానం, తపస్సు నందు తప్పించి లౌకికమైన విషయాలలో అణుమాత్రం కూడా ఆసక్తి చూపేవారు కాదు. తామరాకు మీద నీటిబిందువులా ఉండేవారు. వీరు తమ 21 సంవత్సరంలో శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి వద్ద సన్యాస ఆశ్రమం స్వీకరించి లోకాన్ని సనాతన ధర్మ అనుయాయులకు అనుగ్రహించారు. వీరికి శ్రీ విధుశేఖర భారతీ అని యోగ పట్టాను జగద్గురువులు అనుగ్రహించారు. తరువాత క్రమంలో పీఠం సంప్రదాయాలను క్షుణ్ణంగా అవలోకించి అతిచిన్న వయసులోనే స్వతంత్రంగా దక్షిణ భారతదేశాన్ని పూర్తిగా సంచరించి జనులకు స్వధర్మ ఆచరణ వైశిష్ట్యాన్ని వివరిస్తూ ధర్మాచరణ ఆవశ్యకతను బోధిస్తూ వస్తున్నారు.



ఈ పీఠంలో అధిపతులు అందరూ స్వయంగా శంకరాచార్య స్వరూపులే. ఈ విషయాన్ని శంకరులు స్వయంగా వివరించారు. శృంగేరీ పీఠానికి ఉత్తరాధికారి అయిన శ్రీవిధుశేఖర భారతీ స్వామివారి వర్ధంతి (జయంతి) సందర్భంగా ఆ శంకరుల స్వరూపులైన స్వామివారిని స్మరిస్తూ వీరి ద్వారా మానవాళికి ధార్మికమైన ఆలోచనలు కలగాలని, స్వధర్మాచరణ పట్ల శ్రద్ధాభక్తులు పెరుగుతూ లోకమంతా సుభిక్షమయి జనులందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఉభయ జగద్గురువుల పాదపద్మాలకు నమస్సులు అర్పిద్దాం.

**– వ్యాసోజుల గోపీకృష్ణ శర్మ**
వేద పండితులు, శృంగేరీ పీఠం

ఆలయం ఆగమం

# స్తూపిక... జ్ఞాన సూచిక

**ఆ**లయవిమానం పైభాగంలో కనిపించే కలశంలాంటి నిర్మాణాన్నే ఆగమ, శిల్పశాస్త్ర పరిభాషలో స్తూపిక అంటారు. చాలా మంది శిఖర కలశం అని పిలుస్తారు. ఆలయంలో ఇది అంతిమ భాగం, అతి ముఖ్యమైన భాగమని సంప్రదాయం చెప్తోంది. ఆలయంలోనికి అనంత శక్తిని ప్రసరింపజేయడంలో ఈ స్తూపిక కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఆలయానికి బ్రహ్మభాగంలో అంటే నట్టనడిమిన ఇది ప్రతిష్ఠించబడుతుంది. ఇందులో అమృతం నిండి ఉంటుంది. అందుకే ఇది బిందుస్థానం(మధ్యభాగం)లో ఉండి నిరంతరం అమృతాన్ని స్రవిస్తుందని విశ్వకర్మీయ శిల్పశాస్త్రం చెప్పింది.

ఆలయానికి శ్రీయంత్రానికి (శ్రీచక్రం) అవినాభావ సంబంధం ఉంది. ఈ యంత్రం నుండి పైకి లేచి ఆలయం రూపు దాలిస్తే సరిగ్గా బిందుస్థానంలో స్తూపి ఉంటుంది. బిందువు శక్తి అంశ. అందుకే ఈ స్తూపి అత్యంత శక్తివంతమైనది.

సాధారణంగా స్తూపిని అరటిమొగ్గవలె రూపొందిస్తారు. అయితే కొన్ని చోట్ల త్రిశూలం, చక్రం వంటి లాంఛనాలు కూడా కనిపిస్తాయి.

మొగ్గ వికసించని సృష్టికి ప్రతీక. అంటే ఇక్కడే సృష్టి ప్రారంభం అవుతోందని గమనించాలి. బిందువు నుండి ప్రారంభమై క్రమక్రమంగా విస్తరిస్తూ ఆలయం పూర్ణాకృతి పొందుతుంది. ఇది అవరోహణక్రమం. పూర్ణదేవాలయం క్రమక్రమేపి చిన్నదవుతూ ఈ స్తూపి మూలంగానే శూన్యంలో కలిసిపోతుంది.ఇది ఆరోహణ క్రమం. ఉన్నది ఒకటే 'సత్' అని ఋగ్వేదం చెప్పిన మాటకు ప్రతీకగా ఈ స్తూపి కనిపిస్తుంది. త్రిశూల స్తూపి ద్వారా త్రిశూలంలోని మూడు శూలాలతో త్రిమూర్తి తత్త్వం ఆవిష్కృతమౌతుంది. చక్రస్తూపికతో సమస్త విశ్వం ప్రతిబింబిస్తుంది.



ఆలయానికైనా, విమానానికైనా ఒకటి మొదలు ఇరవై ఒక్క స్తూపికల వరకు ప్రతిష్ఠించవచ్చు. అలాగే పారలౌకిక కాములు అంటే మోక్షం కోరువారు సమసంఖ్యా కలశాలను, ఐహిక ఫలాన్ని కోరువారు బేసిసంఖ్యలో కలశాలను ప్రతిష్ఠించుకోవచ్చని ఆగమశాసనం.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

సువార్త

# దేవుడే సర్వం స్వాస్థ్యం

**ఏ**ది కొరతగా ఉంటుందో దానికి ఖరీదెక్కువ అంటుంది అర్థశాస్త్రం. ఆ లెక్కన ప్రపంచంలో 'ఆనందానికి' ఉన్నంత కొరత మరి దేనికీ లేదు. అందుకే జీవితంలో ఆనందాన్ని పొందేందుకు మనిషి దేనికైనా సిద్ధపడుతున్నాడు. ఫిలిష్తీయులతో జరిగిన యుద్ధంలో సౌలు రాజు అతని కుమారులు కూడా గిల్బోవ పర్వతం వద్ద హతం కాగా, ఆ వెంటనే దేవుని అభీష్టం మేరకు ఇశ్రాయేలు పెద్దలంతా కలిసి హెబ్రోను రాజధానిగా దావీదుకు పట్టాభిషేకం చేశారు. పిదప ఇశ్రాయేలీయులలో పన్నెండు గోత్రాల ప్రజలు, వారి పెద్దలు కూడా మనస్ఫూర్తిగా దావీదుకు మద్దతు తెలిపారు. వాళ్ళ మధ్య ఎన్నో తగాదాలున్నా, దావీదుతో కలిసి తమ ఇశ్రాయేలు దేశాన్ని ఒక గొప్ప దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న ప్రగాఢమైన కోరికే వారిని కలిపింది, అందుకు పురికొల్పింది (1 దిన. 11,12,13 అధ్యాయాలు). దావీదు పట్టాభిషేక మహోత్సవం తర్వాత ఇశ్రాయేలు ప్రజలంతా కలిసి హెబ్రోనులో కూడుకొని ఒక గొప్ప పండుగ చేసుకున్నారని, ఎంతో సంతోషాన్ని పొందారని, ఆయా గోత్రాల యుద్ధ వీరులంతా తమ తమ ఆయుధాలు ధరించి మరీ ఆ వేడుకకొచ్చారని బైబిల్ చెబుతోంది (1 దిన 12:37–40). వాళ్ళ సంతోషానికంతటికీ ఒకే ఒక కారణం దావీదు!! ఎందుకంటే ఎన్ని శ్రమలున్నా ఆనందించడమెలాగో దావీదుకు తెలుసు. తన జీవితంలో ఆనందం ఉన్నవాడే ఇతరులను ఆనందింపజేయగలడు. సౌలును రాజుగా తిరస్కరించి దావీదును దేవుడు ముందే అభిషేకించినా, సింహాసనాన్ని కుట్రలతో కాక దేవుని సమయంలో పొందేందుకు ఆయన దైవభయంతో కనిపెట్టాడు. ఆ లోగా సౌలు చేతుల్లో ఎన్నెన్నో కష్టాలు, విపత్తులననుభవించాడు. దైవాభిషిక్తుడైన రాజై ఉండికూడా, నలభై ఏళ్ళు తలవంచుకొని జీవించాడు. తొందరపడితే రాజ్యం ముందే దొరికేది కానీ రాజ్యప్రజల ప్రేమ అతనికి దొరికుండేది కాదు. ప్రజలంతా సౌలు వర్గం, దావీదు వర్గంగా విడిపోయి తమలో తామే పోరాటాలకు దిగితే, రాజ్యమంతా అల్లకల్లోలమై ఉండేది. కాని ఇపుడు జరిగిన దావీదు పట్టాభిషేకంతో ఇశ్రాయేలీయుల రాజ్యమంతా ఆనందం వెల్లివిరుస్తోంది.

జీవితంలో దేవుని సంకల్పాల నెరవేర్పు కోసం, ప్రతిదానికి దేవుని సమయం కోసం ఓపిగ్గా ఎదురు చూడటమే విశ్వాసి సాధించగల నిజమైన విజయం. 'ఎదురుచూడటం' అనే మాట అర్థాన్ని కోల్పోయిన అత్యంత వేగవంతమైన కాలంలో మనం బతుకుతున్నాం. కాలానికి అసలు యజమాని దేవుడే!!. ఆయన తన సంకల్పాలు మనం నెరవేర్చేందుకు తన కాలంలో కొంత మనకు 'ఆయుష్కాలం' రూపంలో కానుకగా ఇచ్చాడు. అదే జీవితమంటే!! అందువల్ల దేవుణ్ణి అర్థం చేసుకొంటూ ఆయన అభీష్టం మేరకు జీవించడంలోని ఆనందాన్ని ఒక్క విశ్వాసి మాత్రమే అనుభవించగలడు. దేవుణ్ణే కాదు, మనచుట్టూ ఉన్న పరిస్థితులను, మారుతున్న సంస్కృతులను, వాటి ఒత్తిడులను కూడా మనం దైవజ్ఞానంతోనే అర్థం చేసుకోవాలి. అలా కాక సొంతజ్ఞానంతో వాటిని అనుసరించేవారు, వాటికి బానిసలవుతారు. నాటి ఇశ్రాయేలీయులకు దేవుని లేఖనాల జ్ఞానం బాగా ఉండేది. అందుకే తమ దేశ రాజకీయాల్లో వచ్చిన మార్పులను లేఖనజ్ఞానంతోనే అర్థం చేసుకొని ఆనందించారు. ఆ దైవజ్ఞానం ఈనాడు విశ్వాసుల్లో, వారి కుటుంబాల్లో, చర్చిల్లో కూడా కొరతగా ఉంది. అందుకే అన్ని హంగులున్నా ఆనందం, శాంతి ఎండమావులయ్యాయి. ప్రాథమికంగా మనం ఈ లోకానికి ఎక్కడినుండి వచ్చాం, ఎందుకొచ్చాం, ఎక్కడికి వెళతాం? అన్నది తెలుసుకోవడానికే దైవజ్ఞానం అవసరం. ఆ స్పష్టతే జీవితంలో ఆనందానికి మూలకారణం అవుతుంది. మరుక్షణంలో బతికుంటామో లేదో తెలియకున్నా, కాలమంతా నాదే, లోకమంతా నాదే అన్న పద్ధతిలో విశృంఖలంగా బతకడమే అన్ని వత్తిళ్లకు, ఆనందం పొందలేకపోవడానికి కారణం. అందుకే 'దేవా, నీవు నాకు తెలిసిన దానికన్నా బాగా నేను నీకు తెలుసు. అందుకే నీ నిర్ణయాలు నాకు శిరోధార్యం, నీవే నా స్వాస్థ్య భాగం' (1 దిన. 17:18–27) అన్న దావీదు విశ్వాసమే అతని ఆనందమయ జీవిత రహస్యం.



**– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**,
prabhukirant@gmail.com

ఇస్లాం వెలుగు

# కారుణ్యం కురిసే కాలం

ఇస్లామ్ ధర్మంలోని ఐదు మౌలిక అంశాల్లో 'హజ్జ్' కూడా ఒకటి. వెసులుబాటున్న ప్రతి ముస్లిం జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా తప్పక ఆచరించాల్సిన విధి. ఇది జిల్‌హజ్జ్ మాసంలో నిర్వహించబడుతుంది. అందుకే ఈ మాసానికి ఎనలేని ప్రాముఖ్యత ఏర్పడింది. ఈ మాసంలోని మొదటి పదిరోజులు చాలా ప్రాముఖ్యం కలవి. వారంలోని ఏడు రోజుల్లో శుక్రవారానికి, సంవత్సరంలోని పన్నెండు మాసాల్లో రమజాన్ మాసానికి, రమజాన్‌లోని 30 రోజుల్లో చివరి పదిరోజులకు ఏవిధంగా ప్రత్యేకత ఉందో, అదేవిధంగా జిల్‌హజ్జ్ మాసంలోని మొదటి పది రోజులకూ అలాంటి ప్రత్యేకతనే ప్రసాదించాడు. ఈ మొదటి దశకంలో అల్లాహ్ కారుణ్యం వర్షిస్తూ ఉంటుంది. ఈ రోజుల్లో చేసే ప్రతి సత్కార్యమూ ఎనలేని ప్రాముఖ్యతను కలిగి అల్లాహ్ కృపకు పాత్రమవుతుంది. మనిషి ఈదశకంలో చేసిన ఆరాధనలు ప్రీతికరమైనంతగా, మరే ఇతర దినాల్లో చేసిన ఆరాధనలు కూడా దైవానికి అంతగా ప్రీతికరమైనవికావు. అంటే, జిల్‌హజ్జ్ మాసం తొలి తొమ్మిది రోజుల్లో చేసే ఆరాధనలు, సత్కార్యాలు అల్లాహ్‌కు మిగతా మొత్తం రోజులూ చేసిన ఆరాధనలు, సత్కార్యాలకంటే అధిక ప్రీతికరం. ఈ రోజుల్లో పాటించే ఒక్కొక్క రోజా సంవత్సరం మొత్తం పాటించే రోజాలకు సమానం. ఇందులోని ప్రతి రాత్రి ఆచరించే నఫిల్‌లు షబేఖద్ర్‌లో ఆచరించే నఫిల్‌లతో సమానం.

నిజానికి ఇవి హజ్జ్ కోసం ప్రత్యేకించబడిన రోజులు. ఆర్థిక స్థోమత కలిగిన వారు తప్ప అందరూ హజ్ చేయలేరు. కాని అల్లాహ్ తన అపారమైన దయతో ఆ మహత్తరమైన పుణ్యఫలం పొందగలిగే అవకాశాన్ని అందరికీ ప్రసాదించాడు. జిల్ హజ్జ్ మాసం ప్రారంభమవుతూనే, తమతమ ప్రాంతాల్లో, తమ తమ ఇళ్ళ వద్దనే ఉంటూ హాజీలతో ఆత్మీయ సంబంధాన్ని ఏర్పరచుకోవాలి. వారి ఆచరణలను అనుకరించే ప్రయత్నం చెయ్యాలి. ఇదే ఈద్ ఖుర్బానీలోని రహస్యం. హజ్జ్ యాత్రకోసం మక్కాకు వెళ్ళిన హాజీలు జిల్ హజ్జ్ మాసం పదవతేదీన మినాలో ఖుర్బానీలు సమర్పిస్తారు. మక్కా వెళ్ళలేక పోయిన యావత్ ప్రపంచంలోని ముస్లిములంతా తమ తమ స్వస్థలాల్లో ఇళ్ళవద్దనే ఖుర్బానీలు సమర్పిస్తారు. ఏ విధంగానైతే హాజీలు 'ఇహ్రామ్'ధరించిన తరువాత క్షవరం చేయించుకోరో, గోళ్ళు కత్తిరించుకోరో అలాగే ఖుర్బానీ ఇవ్వాలని సంకల్పించుకున్న ముస్లింలు కూడా గోళ్ళు కత్తిరించుకోవడం, క్షవరం చేయించుకోవడం చేయకూడదు. అంటే మక్కాకు వెళ్ళిన హాజీలను అనుకరిస్తూ వారితో ఆత్మీయ సంబంధాన్ని పెంపొందించుకొనే ప్రయత్నం చెయ్యాలి. ఈ విధంగా జిల్ హజ్ మాసం మొదటి దశలో సాధ్యమైనంత అధికంగా సత్కార్యాలు ఆచరించి దైవానుగ్రహాన్ని, అపారమైన ఆయన కారుణ్యాన్ని పొందడానికి కృషిచేయాలి. మక్కా వెళ్ళి హజ్జ్ ఆచరించే స్థోమత లేకపోయినా, కనీసం ఈదుల్ అజ్‌హా పండుగ వరకు ఈ పదిరోజులను సద్వినియోగం చేసుకుంటే అల్లాహ్ తన అపార కరుణతో హాజీలతో సమానంగా పుణ్యఫలాన్ని ప్రసాదిస్తానంటున్నాడు. కనుక హజ్జ్ పరమార్థాన్ని అర్థం చేసుకొని, దానికనుగుణంగా కర్మలు ఆచరిస్తూ, 'ఈదుల్ అజ్ హా' పర్వదినాన్ని జరుపుకుంటే ఇహలోకంలోనూ పరలోకంలోనూ సాఫల్యం పొందవచ్చు.




**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

ప్రశ్నోత్తర భారతం



303. శూరుడు ఎవరు? అతని సంతానం ఎవరు?
304. కుంతి ఎవరి చెల్లెలు?
305. శూరుని మేనత్త కొడుకు ఎవరు?
306. కుంతి స్వభావం ఎటువంటిది?
307. కుంతి ఎవరెవరికి సపర్యలు చేసేది?
308. దుర్వాస మహాముని వచ్చినప్పుడు కుంతి ఏం చేసింది?
309. దుర్వాసుని మంత్రం వలన ఏం జరుగుతుంది?
310. కుంతి ఎవరిని స్మరించింది?
311. ప్రత్యక్షమైన సూర్యుడిని చూడగానే కుంతి ఏ విధంగా స్పందించింది?
312. కుంతి చేతులు జోడించి, సూర్యుని ఏమని అర్థించింది?
313. సూర్యుడు ఏ విధంగా స్పందించాడు?

**- నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ**

**జవాబులు:** 303) శూరుడు యాదవ రాజు. అతడిని అనేక మంది కుమార్తెలు ఉన్నారు. వారిలో కుంతి పెద్దది. 304) వసుదేవుని చెల్లెలు. 305) కుంతిబోజుడు. అతడికి సంతానం లేదు. శూరుడు కుంతిని కుంతిభోజుడికి దత్తత ఇచ్చాడు. 306) కుంతి అందమైనది. రూపలావణ్యం కలది. అతిథి సత్కారాలు తెలిసినది. 307) మునులకు, ఋషులకు చక్కగా సేవలు చేసేది. ఆమె ఆదరానికి మునులు సంతోషించేవారు. 308) ఆయనకు అర్ఘ్యము, పాద్యం ఇచ్చి, మృష్టాన్నం పెట్టింది. ఆయన సంతోషంతో సంతృప్తి చెందాడు. కుంతికి ఒక మంత్రం ఉపదేశించి వెళ్లిపోయాడు. 309) మనసులో ఎవరిని స్మరిస్తే వారు ప్రత్యక్షమయ్యేలా దుర్వాసుడు వరమిచ్చాడు? 310) కుంతి దోసిలిలో నీరు తీసుకుని, సూర్యునికి నమస్కరించి, మంత్రం పఠించి, సూర్యుని ఆహ్వానించింది. 311) ఆమె గుండెలో గుబులు చేరింది. తత్తరపాటు వచ్చింది. తల వంచుకుంది. సూర్యుడు కుంతిని సమీపించి, ఆమె చేయి పట్టుకున్నాడు. 312) దేవా! నువ్వు సర్వసాక్షివి, చిలిపితనంతో నేను దుర్వాసుని మంత్రాన్ని పరీక్షించడానికి నిన్ను పిలిచాను. నన్ను క్షమించి, వచ్చినదారిన వెళ్లు అంది. 313) సూర్యుడు కుంతి చేయి పట్టుకుని, ఆమె కన్యాత్వం చెడకుండా వరం ఇచ్చి, తన పని తీర్చుకుని, వెళ్లిపోయినాడు.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం
సినిమా 4-8-2019

# రామ్ ఎనర్జీ సినిమాను నిలబెట్టింది

\- పూరి జగన్నాథ్




పూరి జగన్నాథ్, చార్మీ, రామ్, నిధీ అగర్వాల్

''ఈ మధ్యకాలంలో నేను చేసిన రెండు మంచి పనులు.. రామ్‌ని కలవడం ఒకటి, 'ఇస్మార్ట్ శంకర్' సినిమా చేయడం మరోటి. అందరి ఆదరణతో 'ఇస్మార్ట్ శంకర్' బ్లాక్‌బస్టర్ హిట్ అయింది'' అని పూరి జగన్నాథ్ అన్నారు. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. నభా నటేశ్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు. పూరి, చార్మి నిర్మించిన ఈ చిత్రం జూలై 18న రిలీజైంది. సక్సెస్‌ఫుల్ టాక్‌తో 75 కోట్ల గ్రాస్‌ను వసూళ్లు చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు పూరి మాట్లాడుతూ – ''సినిమా చూసి నా ఫ్రెండ్స్ అందరూ అభినందిస్తున్నారు. రామ్ ఎనర్జీ ఈ సినిమాను నిలబెట్టింది. సినిమాలో రామ్ క్యారెక్టర్ గురించి అందరూ మాట్లాడుకోవడం ఆనందం అనిపించింది'' అన్నారు. ''సినిమా చూశాక ఎలా ఫీల్ అయ్యానో, ఆడియన్స్ రెస్పాన్స్ చూశాక అలాంటి ఫీలింగే కలిగింది. గతంలో నేను చేసిన సినిమాలకు భిన్నంగా ఈ సినిమా, నా పాత్ర ఉన్నాయి. దానికి కారణం పూరీగారు. కొత్త క్యారెక్టరైజేషన్‌తో నన్ను కొత్తగా స్క్రీన్ మీద చూపించారు. నా మంచి కోరుకునే వాళ్లందరికీ ఈ సక్సెస్‌ను అంకితం ఇస్తున్నాను. మణిశర్మ సంగీతం, హీరోయిన్స్ గ్లామర్ ఈ సక్సెస్‌కు యాడ్ అయ్యాయి. సినిమాకు పని చేసిన అందరికీ థ్యాంక్స్'' అన్నారు రామ్. ''మా సినిమాను బ్లాక్‌బస్టర్ చేసిన అందరికీ థ్యాంక్స్. రామ్ కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. పూరీగారు రామ్ పాత్రను కొత్తగా రూపొందించారు. అదే సినిమా సక్సెస్‌కు ముఖ్య కారణం. రామ్ సొంత బ్యానర్ స్రవంతి మూవీస్, సెకండ బ్యానర్ పూరి కనెక్ట్స్'' అన్నారు చార్మి. ''నాకు చాలా ఇంపార్టెంట్ టైమ్‌లో వచ్చిన హిట్ ఇది. ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన పూరీగారికి, సపోర్ట్ చేసిన చార్మీగారికి థ్యాంక్స్'' అన్నారు నిధీ.



విద్యుత్ జమాల్

## యాక్షన్ అవార్డ్స్

బాలీవుడ్‌లో విద్యుత్ జమాల్‌కు యాక్షన్ హీరోగా మంచి పేరుంది. గత ఏడాది జమాల్ నటించిన 'జంగిల్' మూవీ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నారాయన. కొన్ని కళరిపయ్యట్టు స్టంట్స్‌ని అద్భుతంగా చేసి యాక్షన్ మూవీ లవర్స్ మనసు గెల్చుకున్నారు జమాల్. ఈ సినిమాకు రెండు ప్రతిష్టాత్మకమైన జాకీచాన్ అవార్డులు వచ్చాయి. చైనాలో జరిగిన జాకీచాన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ వీక్‌లో భాగంగా ఇండియన్ చిత్రం 'జంగిల్'కు రెండు అవార్డులు లభించాయి. బెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ కొరియోగ్రాఫర్, బెస్ట్ యాక్షన్ ఫ్యామిలీ ఫిల్మ్ విభాగాల్లో ఈ అవార్డులు వచ్చాయి. ''దాదాపు 150 చిత్రాలతో పోటీ పడి మా సినిమా అవార్డ్స్ గెలుచుకోవడం ఆనందంగా ఉంది. ఇండియన్ యాక్షన్ సినిమాకు మరోసారి మంచి గుర్తింపు దక్కినట్లుగా ఉంది. మేం చైనాలో స్టార్స్ అయిపోయామనే భావన కలుగుతోంది. క్రిస్ టుక్కర్ (చైనీస్ యాక్షన్ హీరో) కూడా మా యాక్షన్ సీన్స్‌ను మెచ్చుకున్నారు'' అని పేర్కొన్నారు విద్యుత్.

# ఆమిర్ వర్సెస్ సైఫ్



ఆమిర్ ఖాన్



సైఫ్ అలీ ఖాన్

ఆమిర్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్ స్క్రీన్ మీద తలపడనున్నారు. మరి ఎవరు గెలుస్తారు? ప్రస్తుతానికి సస్పెన్స్. 2017లో తమిళంలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన చిత్రం 'విక్రమ్ వేదా'. మాధవన్, విజయ్ సేతుపతి హీరోలుగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని దర్శకద్వయం పుష్కర్ గాయత్రి రూపొందించారు. ఈ సినిమా బాలీవుడ్ రీమేక్‌లో పలువురు హీరోలు నటిస్తారని వార్తలు వినిపించాయి. ఫైనల్‌గా ఆమిర్ ఖాన్, సైఫ్ అలీఖాన్ ఈ రీమేక్‌లో నటించనున్నారు. మాధవన్ పాత్రలో సైఫ్, సేతుపతి పోషించిన పాత్రను ఆమిర్ ఖాన్ చేస్తారట. 2020 మార్చి నుంచి ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. వై నాట్ స్టూడియోస్, నీరజ్‌పాండే, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించనున్నాయి.

# మార్చుకుంటూ.. నేర్చుకుంటూ.. ముందుకెళ్తా!



శ్రుతీ హాసన్

**శ్రుతీహాసన్‌ను తన అభిమానులు స్క్రీన్ మీద మిస్ అవుతున్నారు. 'మీ అందర్నీ స్క్రీన్ మీద త్వరలోనే పలకరిస్తాను. ఈ బ్రేక్‌లో చిన్న చాట్ చేద్దామా?' అని అడిగారు. వెంటనే ఆమె అభిమానులంతా ప్రశ్నల వర్షం కురిపించారు. శ్రుతీ అభిమానులతో చేసిన చాట్‌లో కొన్ని ప్రశ్నలు..**

- **లైఫ్‌లో ఎప్పుడైనా ఇన్‌సెక్యూర్‌గా ఫీల్ అయ్యారా?**

అఫ్‌కోర్స్! చాలాసార్లు. కానీ దాన్ని ఎదుర్కొనే మార్గం కూడా కనుగొన్నాను.

- **పిజ్జా ఇష్టమా లేక బర్గర్ ఇష్టమా?**

పిజ్జా అంటే ప్రాణం.

- **మీ నాన్నగారి సినిమాల్లో మీకు బాగా ఇష్టమైనది?**

మహానది.

- **మీ యాక్టింగ్ స్టైల్‌ని వర్ణించండి?**

ముందుగా ప్లాన్ ఏదీ చేసుకోకుండా లొకేషన్‌లో అక్కడికక్కడ నటించడం నా స్టైల్.

- **కమల్‌హాసన్ గారి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ఎప్పుడైనా భారంగా అనిపించిందా?**

మా ఫ్యామిలీ అంటే నాకు చాలా గర్వం. దాన్ని నిలబెట్టడానికి ప్రతిరోజూ కష్టపడుతూనే ఉంటాను. అది భారం కాదు.

- **మీ జీవితంలో గొప్ప అచీవ్‌మెంట్ ఏంటి?**

ఎప్పటికప్పుడు నన్ను మార్చుకుంటూ కొత్త విషయాలను నేర్చుకోవడం.

- **స్క్రీన్ మీద మిమ్మల్ని బాగా మిస్ అవుతున్నాం. మీ ఫ్యాన్స్ కోసం ఓ తెలుగు సినిమా చేయండి.**

త్వరలోనే చేస్తాను.

- **జీవితం ఎలా ఉంది శ్రుతీ?**

వండర్‌ఫుల్. అడిగినందుకు ధన్యవాదాలు.

- **మీరు చేస్తున్న అమెరికన్ టీవీ సిరీస్ 'ట్రెడ్‌స్టోన్' గురించి ఏదైనా చెప్పండి?**

ప్రస్తుతానికైతే యాక్షన్ ట్రైనింగ్ చాలా బాగా నడుస్తోంది.

- **మీరు దేనికి ఎక్కువగా భయపడతారు?**

పాములకు, అజ్ఞానానికి.

- **'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సీజన్ 8 గురించి మీ అభిప్రాయం?**

చాలా బాధగా ఉంది. దాని గురించి మాట్లాడదలచుకోలేదు కూడా.

- **మీ ఫేవరెట్ చాక్లెట్?**

రోయ్స్.

- **మీరు స్ట్రిక్ట్‌గా ఉండే సిస్టరా? ఫ్రెండ్లీ సిస్టరా?**

ఆ విషయం మీరు నా చెల్లెలు అక్షరాహాసన్‌ని అడగాలి.

- **మీ నుండి ఇండిపెండెంట్ మ్యూజిక్ వీడియోలు ఎక్స్‌పెక్ట్ చేయెుచ్చా?**

అతి త్వరలోనే..

- **ఏలియన్స్ (గ్రహాంతర వాసులు) ఉన్నాయని నమ్ముతారా?**

నమ్ముతాను.

- **ఏ విషయం మీకు చిరాకు తెప్పిస్తుంది?**

కామన్‌సెన్స్ లేకుండా ఉంటే చిరాకొస్తుంది.

- **మీకు పిల్లలు కావాలా? కావల్సిస్తే ఎంత మంది?**

కచ్చితంగా కావాలి, ఇద్దరు పిల్లలు కావాలి.

- **విమర్శలను ఎలా స్వీకరిస్తారు?**

విలువైన విమర్శలను ఎప్పుడూ స్వీకరిస్తాను.

- **మీరు రైటర్ అని మాకు తెలుసు. నాకో సలహా కావాలి. మనమెప్పుడూ అనుభవించని విషయాన్ని ఎలా రాయాలి?**

మనుషులందరం ఒకలాంటి ఎమోషన్స్‌కే కనెక్ట్ అయ్యుంటాం అని అనుకుంటాను. అందుకే ఆర్టిస్టిక్‌గా ప్రేక్షకులు కూడా అనుభవించగలిగేది రాయడం చాలా ముఖ్యం. ఆ సంఘటన జరిగితే ఎలా ఉంటుంది? అనే ఊహతో ఆలోచిస్తూ నీకు ఏదనిపిస్తే అది రాస్తూ ఉండు.

- **మీ అభిమానుల గురించి ఒక్క మాట?**

మీ అందర్నీ నేను ఎంతో ప్రేమిస్తాను. మీరంతా నా డిజిటల్ ఫ్యామిలీ. మీరందరూ నా జీవితంలో ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

- **శ్రుతీహాసన్‌లా ఉండటం ఎలా ఉంటుంది?**

చాలా చాలా సరదాగా ఉంటుంది.

- **మీ జీవితాన్ని మార్చేసిన పుస్తకాల గురించి చెబుతారా?**

రిచార్డ్ బ్యాచ్ రాసిన ఇల్యూషన్ పుస్తకం చదవమని నాన్నగారు చెప్పారు. అది నా జీవితాన్నే మార్చేసింది. అలానే మార్లిన్ బ్రాండో ఆటోబయోగ్రఫీలోని పాటలు చాలా ఇష్టం. మా అమ్మ నేర్పించారు.

- **స్టార్ కిడ్‌గా ఉండటం కష్టమైన విషయమా? యాక్టర్‌గా గుర్తింపు పొందాలనుకుంటున్నారా? సింగర్‌గానా?**

స్టార్ కిడ్‌గా ఉండటం అంత కష్టమేం కాదు. ఆర్టిస్ట్‌గా గుర్తింపబడాలి అనుకుంటాను.

- **మీకేదైనా సూపర్‌పవర్ ఉంటే ఏం చేస్తారు?**

పేదవాళ్లకు సహాయం చేస్తాను.

- **మీ జీవితంలో అంతిమ లక్ష్యం ఏంటి?**

సంతోషంగా ఉండటం.

- **మీ చిన్నప్పటి క్రష్ పేరు ఏంటి?**

హృతిక్ రోషన్.

- **మీ అమ్మానాన్న ఉన్న ఫీల్డ్‌లోనే ఉండటం ప్లస్ అనుకుంటున్నారా? మైనస్ అనుకుంటున్నారా?**

ప్లస్.

- **మిమ్మల్ని ద్వేషించేవాళ్లను ఎలా డీల్ చేస్తారు?**

నేను వాళ్లను అసలు డీల్ చేయను.



డ్వేన్ బ్రావో

## ఆర్టిస్ట్ బ్రావో!

క్రికెట్ ప్రేమికులకు వెస్టిండీస్ క్రికెట్ ప్లేయర్ డ్వేన్ బ్రావో గురించి ప్రత్యేకమైన పరిచయం అక్కర్లేదు. ఆల్‌రౌండర్‌గా క్రికెట్ గ్రౌండ్‌లో బ్రావో సాధించిన ఘనతలు ఆయన్ను గుర్తుపెట్టుకునేలా చేస్తున్నాయి. ఇప్పుడు బ్రావో క్రికెటర్‌గా మాత్రమే కాదు ఆర్టిస్టుగా కనిపించనున్నారు. 'మెన్ టేక్ లీడ్' అనే సినిమాలో నటిస్తున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఎ.ఎన్.టి ప్రొడక్షన్స్‌తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. 'ల్యాండ్ ఆఫ్ విడోస్, వైట్ నైట్' వంటి డాక్యుమెంటరీలను తెరకెక్కించిన ఆర్తి శ్రీవాత్సవ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కలిగించే అంశాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ''ఇటీవల తమిళనాడులో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. దీంతో ఇండియాలో ప్లాన్ చేసిన షూటింగ్ పూర్తయింది. ఈ నెలలో వెస్టిండీస్‌లోని ట్రినిడాడ్, టోబాగో లొకేషన్స్‌లో చిత్రీకరణ జరపబోతున్నాం. డ్వేన్ బ్రావోతో కలిసి ఈ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు దర్శకురాలు ఆర్తి.



తేజస్, పాయల్

## ప్రేమతో...!



విశాల్

జైపూర్‌లో ప్రేమాయణం సాగిస్తున్నారు విశాల్. సుందర్. సి దర్శకత్వంలో విశాల్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో తమన్నా కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రాజస్థాన్‌లోని జైపూర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. విశాల్, తమన్నాలపై లవ్ సీన్స్‌ను తీస్తున్నారట. ఈ షెడ్యూల్‌లోనే నటి ఖుష్బూ కూడా పాల్గొంటున్నారు. దాదాపు నెలరోజుల పాటు ఈ జైపూర్ షెడ్యూల్ సాగుతుందని కోలీవుడ్ టాక్.

# ఆర్‌డీఎక్స్ బాంబ్ కాదు!




తేజస్, పాయల్, వెంకటేశ్, భాను శంకర్, బాబీ, సి. కల్యాణ్, సీవీ రావు

ఆర్‌డీఎక్స్ బాంబ్ గురించి విన్నాం. మరి.. ఆర్‌డీఎక్స్ ప్రేమ అంటే.. చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని అర్థమవుతోంది. ఈ ఘాటు ప్రేమకథలో 'హుషారు' ఫేమ్ తేజస్ కంచెర్ల, 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్ జంటగా నటించిన చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. రామ్ మునీష్ సమర్పణలో సి. కల్యాణ్ నిర్మించారు. సి.వి రావు సహనిర్మాత. శంకర్ భాను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. శనివారం ఫస్ట్ లుక్‌ను హీరో వెంకటేశ్ విడుదల చేసి, ఈ సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు. దర్శకుడు కేఎస్ రవీంద్ర కూడా పోస్టర్ రిలీజ్ కార్యక్రమంలో పాల్గొని, యూనిట్‌కి శుభాకాంక్షలు అందజేశారు. వీకే నరేశ్, ఆదిత్యామీనన్, నాగినీడు, తులసి, ఆమని, ముమైత్‌ఖాన్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు రధన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చిన్నా.

# శత్రువు లేని యుద్ధం



అనురాగ్ కొణిదెన

'స్వేచ్ఛలేని జీవితమంటే శత్రువు లేని యుద్ధం లాంటిది. ఈ సమాజంలోని ప్రతి ప్రేమికుడు సైనికుడితో సమానం. స్వచ్ఛమైన ప్రేమను ఆ ప్రేమే గెలిపించుకుంటుంది. శత్రువులు లేని యుద్ధంలో స్వేచ్ఛగా ప్రేమను గెలిచిన సైనికుడు లాంటి ఓ సామాన్యుడి ప్రేమకథ మా 'మళ్ళీ మళ్ళీ చూశా'' అని దర్శకుడు హేమంత్ కార్తీక్ అన్నారు. అనురాగ్ కొణిదెన హీరోగా శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్లుగా హేమంత్ కార్తీక్ దర్శకత్వంలో కె.కోటేశ్వరరావు నిర్మించిన 'మళ్ళీ మళ్ళీ చూశా' పోస్ట్ ప్రొడక్షన్‌తో సహా అన్ని పనులు పూర్తి అయిన సందర్భంగా చిత్ర యూనిట్ గుమ్మడికాయ కొట్టారు. సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ నెలలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ– ''ఒక మంచి పుస్తకం, ఒక మంచి స్నేహితుడితో సమానం. మా సినిమా కూడా చూసిన వారికి ఒక మంచి ఫ్రెండ్ అవుతుంది. జీవితం సంతోషంగా ఉండాలంటే ఆలోచనలు అందంగా ఉండాలి. అలాంటి అందమైన ఆలోచనల సమాహారమే మా సినిమా. ఇటీవల మా సినిమాను చూసిన కొంతమంది ఇండస్ట్రీ పెద్దలు అభినందించడంతో విజయం పట్ల నమ్మకం పెరిగింది'' అన్నారు. అన్నపూర్ణమ్మ, అజయ్, మధుమణి, ప్రభాకర్, పావని, జయలక్ష్మి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం : శ్రవణ్ భరద్వాజ్, కెమెరా: సతీష్ ముత్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయిసతీష్ పాలకుర్తి.






సాక్షి స్పోర్ట్స్
ఆదివారం,
4-8-2019



## నీరజ్, లవ్లీనాలకు స్వర్ణాలు

మగోమెడ్ సాలమ్ ఉమఖనోవ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత మహిళా బాక్సర్లు నీరజ్ (56 కేజీలు), లవ్లీనా (69 కేజీలు) స్వర్ణ పతకాలతో మెరిశారు. ఫైనల్లో నీరజ్ 3-0తో మలిక (రష్యా)పై...లవ్లీనా 3-2తో అసుంటా (ఇటలీ)పై గెలుపొందారు. పూజా రాణి, జానీ కాంస్యాలు సాధించారు. పురుషుల విభాగంలో గౌరవ్ సోలంకి (56 కేజీలు) రజత పతకం గెలుచుకోగా, గోవింద్ సహాని (49 కేజీలు)కి కాంస్యం దక్కింది.





నవదీప్ సైనీ
(3/17)

# చెమటోడ్చి ఛేదన..!

**పరుగుల ప్రవాహమే అనుకుంటే... వికెట్లు టపటపా పడ్డాయి. ఇరు జట్ల నుంచి ఒకటైనా సెంచరీ నమోదవుతుందని ఊహిస్తే... వంద పరుగులు చేయడం, ఛేదించడమే కష్టమైపోయింది. పట్టుమని పది ధనాధన్ షాట్లైనా లేవు... మెరుపు ఇన్నింగ్స్ అనే మాటే లేదు... అసలు ఆడుతున్నది టి20నేనా అనేంత అనుమానంతో సాగింది భారత్–వెస్టిండీస్ మ్యాచ్. మొదట్నుంచి నిస్సారంగానే కనిపించినా చివరకు టీమిండియానే విజయం సాధించడంతో ఊరట దక్కింది.**

### తొలి టి20లో 4 వికెట్లతో భారత్ విజయం

### విండీస్‌ను కుప్పకూల్చిన బౌలర్లు

### అరంగేట్రంలోనే ఆకట్టుకున్న నవదీప్ సైనీ • నేడు రెండో టి20



**లాడర్‌హిల్ (అమెరికా)** ప్రపంచ కప్ అనంతర ప్రయాణాన్ని భారత్ విజయంతో ప్రారంభించింది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం లాడర్‌హిల్‌లో శనివారం వెస్టిండీస్‌తో జరిగిన తొలి టి20లో 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. అరంగేట్ర పేసర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నవదీప్ సైనీ (3/17) అదరగొట్టడంతో పాటు మిగతా బౌలర్లు తలో చేయి వేయడంతో ప్రత్యర్థిని కట్టిపడేసిన కోహ్లి సేన... బ్యాట్స్‌మెన్ తలా కొన్ని పరుగులు చేయడంతో లక్ష్యాన్ని అందుకోగలిగింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ (49 బంతుల్లో 49; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్. పొలార్డ్ మినహా నికోలస్ పూరన్ (16 బంతుల్లో 20; ఫోర్, 2 సిక్స్‌లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. లక్ష్యం స్వల్పమే అయినా ఛేదనలో భారత్ చెమటోడ్చింది. ఓపెనర్ రోహిత్ శర్మ (25 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫటాఫట్ షాట్లకు తోడు కెప్టెన్ విరాట్ కోహ్లి (29 బంతుల్లో 19; ఫోర్), మనీశ్ పాండే (14 బంతుల్లో 19; 2 ఫోర్లు) అవసరమైన పరుగులు చేశారు. దీంతో 17.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసి గెలుపొందింది. ఆదివారం ఇక్కడే రెండో టి20 జరగనుంది.

#### సై.. సై.. సైనీ

తొలి టి20లో భారత్‌కు పెద్ద సానుకూలాంశం నవదీప్ సైనీ. ఆసాంతం 140 కి.మీ. పైగా వేగంతో సాగిన అతడి బౌలింగ్ ఆకట్టుకుంది. తన తొలి ఓవర్లో వరుస బంతుల్లో రెండు వికెట్లు తీసిన సైనీ... తర్వాత సైతం కట్టుదిట్టంగా బంతులేశాడు. అతడి నాలుగు ఓవర్ల స్పెల్‌లో ఏకంగా 19 డాట్ బాల్స్ ఉండటమే దీనికి నిదర్శనం. జట్టులో అత్యధిక డాట్ బాల్స్ వేసింది కూడా సైనీనే. అన్నింటికి మించి చివరి ఓవర్‌ను సైనీ వేసిన తీరు ముచ్చటగొలిపింది. పొలార్డ్ వంటి హిట్టర్‌కు వరుసగా రెండు డాట్స్ వేయడంతో పాటు మూడో బంతికి ఔట్ చేసి అతడి అర్ధసెంచరీని అడ్డుకున్నాడు. మిగతా మూడు బంతులకూ పరుగివ్వకుండా విండీస్‌ను 100లోపే పరిమితం చేశాడు. టి20ల్లో సాధారణంగా మెయిడిన్ వేయడమే అరుదంటే... ఏకంగా ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌ను వికెట్ మెయిడిన్‌గా ముగించి భళా అనిపించాడు.

#### ఆడింది విండీసేనా...?

టి20ల్లో భీకర హిట్టింగ్‌కు వెస్టిండీస్ మారుపేరు. కానీ, ఈ మ్యాచ్‌లో అలాంటిదేమీ కనిపించలేదు. టీమిండియా బౌలింగ్ దాడిని ప్రారంభించిన యువ ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ జాన్ కాంప్‌బెల్ (0)ను ఔట్ చేశాడు. ఇదే మైదానంలో మూడేళ్ల క్రితం భారత్‌పై చెలరేగి శతకం బాదిన ఓపెనర్ ఎవిన్ లూయిస్ (0)ను భువనేశ్వర్ పెవిలియన్ చేర్చాడు. సిక్స్‌తో తనకు స్వాగతం పలికిన పూరన్‌పై ఆ వెంటనే సైనీ ప్రతీకారం తీర్చుకున్నాడు. దూకుడైన హెట్‌మైర్ (0)ను తదుపరి బంతికే బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. అయితే, రావ్‌మన్ పావెల్ (4) అడ్డుకున్నాడు. సరిగ్గా ఆరు బంతుల తర్వాత పావెల్‌ను ఖలీల్ ఔట్ చేశాడు. పవర్ ప్లే ముగిసిన ఈ దశలో విండీస్ స్కోరు 33/5. స్పిన్నర్లు జడేజా, కృనాల్ రంగంలోకి దిగాక సిక్స్‌లు బాది పొలార్డ్ స్కోరు పెంచేందుకు ప్రయత్నించాడు. కానీ, కెప్టెన్ కార్లోస్ బ్రాత్‌వైట్ (24 బంతుల్లో 9) మరీ పేలవంగా ఆడాడు. బ్రాత్‌వైట్‌ను కృనాల్, నరైన్ (2)ను జడేజా వెనక్కుపంపాక కరీబియన్లు తేరుకోలేకపోయారు. అప్పటికీ సైనీ, భువీ ఓవర్లలో సిక్స్‌లు కొట్టిన పొలార్డ్ కాసిన్ని పరుగులు జోడించాడు. 120 బంతుల విండీస్ ఇన్నింగ్స్‌లో 79 బంతులకు పరుగే రాకపోవడం గమనార్హం.

#### అమెరికాలో మ్యాచ్... అయినా

అగ్ర రాజ్యం అమెరికాలో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించేందుకు... అటు కరీబియన్ దీవులకు దగ్గరగానూ ఉండే ఫ్లోరిడాలో నిర్వహిస్తున్న ఈ సిరీస్‌కు తొలి మ్యాచ్‌లో స్పందన అంతంతే కనిపించింది. ఈ మైదానంలో మూడేళ్ల క్రితం భారత్–విండీస్ మ్యాచ్‌కు అభిమానులు భారీగా హాజరయ్యారు. ఈసారి మాత్రం కనిష్ట టికెట్ ధర 50 డాలర్లే అయినా స్టాండ్స్ నిండలేదు. లాడర్‌హిల్‌లో మొత్తమ్మీద ఇది తొమ్మిదో మ్యాచ్ కావడం గమనార్హం.

#### ఇబ్బందిపడ్డా... గెలుపు గట్టెక్కారు

గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన ఓపెనర్ ధావన్ (1) నిరుత్సాహపర్చినా రోహిత్ తనదైన శైలిలో ఆడుతూ భారత్ ఛేదనను నడిపించాడు. కోహ్లి అతడికి సహకరించాడు. అయితే, నరైన్ (2/14) వరుస బంతుల్లో రోహిత్, రిషభ్ పంత్ (0)ను ఔట్ చేసి కలవరపెట్టాడు. నరైన్ యార్కర్ లెంగ్త్ బంతిని భారీ షాట్ కొట్టబోయి రోహిత్ లాంగాన్‌లో పొలార్డ్‌కు చిక్కాడు. పంత్ బంతి గమనాన్ని ఊహించకుండా బల ప్రయోగం చేసి వికెట్ పారేసుకున్నాడు. దాదాపు విండీస్ తరహాలోనే 32/3తో నిలిచిన భారత్‌ను కోహ్లి, పాండే ఆదుకున్నారు. నాలుగో వికెట్‌కు 30 బంతుల్లో 32 పరుగులు జోడించి విజయానికి బాట వేశారు. వీరిద్దరూ ఒకరివెంట ఒకరు వెనుదిరిగినా... కృనాల్ (12), జడేజా (10 నాటౌట్) లక్ష్యానికి దగ్గరగా తీసుకొచ్చారు. కీమో పాల్ ఓవర్లో సిక్స్ కొట్టిన సుందర్ (8 నాటౌట్) లాంఛనాన్ని ముగించాడు.



హెట్‌మైర్

#### స్కోరు వివరాలు

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** కాంప్‌బెల్ (సి) కృనాల్ (బి) సుందర్ 0; లూయిస్ (బి) భువనేశ్వర్ 0; పూరన్ (సి) పంత్ (బి) సైనీ 20; పొలార్డ్ ఎల్బీ (బి) సైనీ 49; హెట్‌మైర్ (బి) సైనీ 0; పావెల్ (సి) పంత్ (బి) ఖలీల్ 4; బ్రాత్‌వైట్ (సి అండ్ బి) కృనాల్ 9; నరైన్ (సి) ఖలీల్ (బి) జడేజా 2; పాల్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 3; కాట్రెల్ నాటౌట్ 0; థామస్ నాటౌట్ 0; **ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 95.**

**వికెట్ల పతనం:** 1–0, 2–8, 3–28, 4–28, 5–33, 6–67, 7–70, 8–88, 9–95. **బౌలింగ్:** సుందర్ 2–0–18–1, భువనేశ్వర్ 4–0–19–2, సైనీ 4–1–17–3, ఖలీల్ 2–0–8–1, కృనాల్ 4–1–20–1, జడేజా 4–1–13–1.

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (సి) పొలార్డ్ (బి) నరైన్ 24; ధావన్ ఎల్బీ (బి) కాట్రెల్ 1; కోహ్లి (సి) పొలార్డ్ (బి) కాట్రెల్ 19; పంత్ (సి) కాట్రెల్ (బి) నరైన్ 0; పాండే (బి) పాల్ 19; కృనాల్ (బి) పాల్ 12; జడేజా నాటౌట్ 10; సుందర్ నాటౌట్ 8; **ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (17.2 ఓవర్లలో 6 వికెట్లకు) 98.**

**వికెట్ల పతనం:** 1–4, 2–32, 3–32, 4–64, 5–69, 6–88. **బౌలింగ్:** థామస్ 4–0–29–0, కాట్రెల్ 4–0–20–2, నరైన్ 4–0–14–2, పాల్ 3.2–0–23–2, బ్రాత్‌వైట్ 2–0–12–0.

# ఆసక్తికరంగా యాషెస్ టెస్టు

### రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 124/3 • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 374 ఆలౌట్

**బర్మింగ్‌హామ్:** యాషెస్ సిరీస్ తొలి టెస్టులో మూడో రోజు అనేక మలుపులతో రసవత్తరంగా సాగింది. శనివారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. వార్నర్ (8), బాన్‌క్రాఫ్ట్ (7), ఉస్మాన్ ఖాజా (40) పెవిలియన్‌కు చేరగా... స్టీవ్ స్మిత్ (46 బ్యాటింగ్), ట్రవిస్ హెడ్ (21 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. వెలుతురు లేని కారణంగా ఆటను చాలా ముందుగా నిలిపివేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగుల ఆధిక్యం కోల్పోయిన ఆస్ట్రేలియా ప్రస్తుతం 34 పరుగులు మాత్రమే ముందంజలో ఉంది. చేతిలో మరో 7 వికెట్లు ఉన్నాయి. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చాలా కష్టమని అంచనాలు ఉన్న నేపథ్యంలో నాలుగో రోజు కంగారూలు ఎన్ని పరుగులు జోడించి ఇంగ్లండ్‌కు లక్ష్యాన్ని నిర్దేశిస్తారనేది ఆసక్తికరం.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 267/4తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 374 పరుగులకు ఆలౌటైంది. బర్న్స్ (133) ఆరంభంలోనే వెనుదిరగ్గా, బెన్ స్టోక్స్ (50) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఒక దశలో ఆసీస్ 18 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బ తీసింది. అయితే క్రిస్ వోక్స్ (37 నాటౌట్), స్టువర్ట్ బ్రాడ్ (29) తొమ్మిదో వికెట్‌కు 65 పరుగులు జత చేసి జట్టును మెరుగైన స్థితికి చేర్చారు. చివరకు ఇంగ్లండ్‌కు 90 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కమిన్స్, లయన్ చెరో 3 వికెట్లు తీశారు. బ్రాడ్ తన 128వ టెస్టులో 450 వికెట్ల మైలురాయిని చేరుకోవడం విశేషం.

బాల్ ట్యాంపరింగ్ నిషేధం ముగిసిన తర్వాత తొలి టెస్టు ఆడుతున్న స్మిత్, వార్నర్‌లను ఇంగ్లండ్ అభిమానులు తొలి రోజునుంచే గేలి చేస్తున్నారు. అయితే వీరిద్దరు మాత్రం దానిని పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి పెట్టారు. శనివారం మాత్రం వార్నర్ ప్రేక్షకులకు సమాధానమిచ్చాడు. అయితే అది సరదాగానే సుమా... జేబులో స్యాండ్‌పేపర్ పెట్టుకొని ట్యాంపరింగ్ వివాదానికి కారణమైన వార్నర్ ఇప్పుడు మాత్రం తాను అలాంటి పనేమీ చేయడం లేదని, కావాలంటే మీరే చూసుకోండి అంటూ పోజివ్వడం విశేషం!



చూశారా... జేబులో ఏమీ లేదు !

# ఫైనల్లో సాత్విక్ - చిరాగ్ జోడి

- సూపర్ – 500 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్ చేరిన తొలి భారత ద్వయంగా గుర్తింపు
- నేడు చైనా జంటతో తుదిపోరు

**బ్యాంకాక్:** అంచనాలకు మించి రాణిస్తూ వస్తోన్న భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడి థాయ్‌లాండ్ ఓపెన్‌లో డబుల్స్ ఫైనల్స్‌కు చేరి ఔరా అనిపించింది. సూపర్ – 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో ఫైనల్ చేరిన తొలి భారత జోడీగా చరిత్ర సృష్టించింది. హేమాహేమీలైన భారత షట్లర్లు ఒక్కొక్కరు వెనుదిరుగుతున్నా భారత టైటిల్ ఆశలను తమ భుజాలపై మోస్తూ వచ్చిన సాయిరాజ్ జోడి మరో అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ – 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీస్ మ్యాచ్‌లో ప్రపంచ 16వ ర్యాంక్ సాయిరాజ్ జోడి 22–20, 22–24, 21–9తో 19వ ర్యాంక్ కో సుంగ్ హ్యూన్ – షిన్ బేక్ చియోల్ (కొరియా) జంటను చిత్తుచేసింది. 63 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సాయిరాజ్ జంట టైటిల్ కోసం జరిగే తుది పోరుకు అర్హత సాధించింది.



## వారియర్స్‌కు బుల్స్ దెబ్బ

**పట్నా :** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో బెంగాల్ వారియర్స్‌ను బెంగళూరు బుల్స్ దెబ్బ కొట్టింది. శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో బుల్స్ 43–42తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. బెంగళూరు తరఫున పవన్ కుమార్ ఏకంగా 29 పాయింట్లు సాధించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 21–34తో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. పాంథర్స్ రైడర్ దీపక్ నర్వాల్ 9 పాయింట్లతో మెరిశాడు. ఈ సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన జైపూర్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. **నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో తమిళ్ తలైవాస్, పట్నా పైరేట్స్‌తో పుణేరి పల్టన్ తలపడతాయి.**

## మెస్సీపై 3 నెలల నిషేధం

**అసన్సియన్ (పరాగ్వే):** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ 3 నెలల పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకుండా దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్య నిషేధం విధించింది. గత నెల బ్రెజిల్‌లో కోపా కప్ ముగిసిన అనంతరం దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్యలో అవినీతి రాజ్యమేలుతోందని మెస్సీ ధ్వజమెత్తాడు, అతిథ్య దేశాన్ని ఎలాగైనా గెలిపించడానికి రిఫరీలు కంకణం కట్టుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. దీనిపై ఆగ్రహించిన సమాఖ్య... మెస్సీపై 50 వేల యూఎస్ డాలర్ల జరిమానాతో పాటు 3 నెలల నిషేధాన్ని విధించింది.

## భారత్ 'ఎ' ఘనవిజయం

- 7 వికెట్లతో విండీస్ 'ఎ' ఓటమి
- 2–0తో సిరీస్ టీమిండియా వశం

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** వెస్టిండీస్ 'ఎ'తో జరుగుతోన్న మూడు అనధికార టెస్టుల సిరీస్‌ను భారత్ 'ఎ' 2–0తో కైవసం చేసుకుంది. శనివారం ముగిసిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్లతో విండీస్‌పై గెలుపొందింది. విండీస్ విధించిన 278 పరుగుల లక్ష్యఛేదనలో... ఓవర్‌నైట్ స్కోరు 185/3తో నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 79.1 ఓవర్లలో 281 పరుగులు చేసి గెలుపొందింది. ప్రియాంక్ పాంచల్ (68), మయాంక్ అగర్వాల్ (81), అభిమన్యు ఈశ్వరన్ (62 నాటౌట్), అన్మోల్ ప్రీత్ సింగ్ (51 నాటౌట్) జట్టును గెలిపించారు. మూడో టెస్టు ఈనెల 6 నుంచి జరుగుతుంది.





# హలో.. బ్రెయిలీ..

ఇద్దరూ ఇద్దరే... చరిత్ర సృష్టించారు. ఒకరు టెలిఫోన్‌ను కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహంబెల్.. మరొకరు రెండేళ్ల వయసులోనే చూపు పోగొట్టుకున్నా, చెవులు వినిపించకపోయినా తనకున్న కలం బలంతో పేరు తెచ్చుకున్న అమెరికా రచయిత్రి హెలెన్ కెల్లర్. వారిద్దరి మధ్య 33 ఏళ్ల వయసు తేడా ఉంది. కానీ వారి స్నేహబంధానికి వయసు ఎప్పుడూ అడ్డు కాలేదు. మీకో విషయం తెలుసా? టెలిఫోన్ కనిపెట్టడానికి ముందే గ్రాహంబెల్ చెవుడు, మూగ విద్యార్థులకు చదువు చెప్పేవారు. అప్పుడు పాఠాలు నేర్చుకోవడానికి ఆయన దగ్గరకు వచ్చింది కెల్లర్. పుట్టినప్పుడు చాలా ఆరోగ్యంగా ఉంది కెల్లర్. రెండేళ్ల వయసున్నప్పుడు విషజ్వరం సోకడంతో ఈ లోకం చీకటిగా మారింది. ఆరేళ్ల వయసులోనే గ్రాహంబెల్ దగ్గర పాఠాలు నేర్చుకుంది. ఆ చిన్నారి విషాదాన్ని చూసిన గ్రాహంబెల్ చలించిపోయాడు. ఆమెకు చేతనైన సాయం చేశారు. బోస్టన్‌లో పెర్కిన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆమెకు బ్రెయిలీ లిపి నేర్పించాడు. వాళ్లిద్దరి మధ్య తరచూ ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి. ఏడాదికి ఒక్కసారైనా కలుసుకునేవారు. గ్రాహంబెల్ ఆర్థికంగా కూడా కెల్లర్‌కు అండగా ఉండేవాడు. కెల్లర్‌కు ఒక శ్రేయోభిలాషిగా గ్రాహంబెల్ మిగిలిపోయారు. అందుకే కెల్లర్ తన ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్'పుస్తకాన్ని గ్రాహంబెల్‌కు అంకితం చేశారు. స్నేహబంధం ఎంత మధురమైనదో ప్రపంచానికి చాటి చెప్పారు.



## స్నేహమేరా జీవితం..



మీ స్నేహితులను బట్టి మీ బరువు కూడా ఆధారపడి ఉందట. ఎందుకంటే మీ క్లోజ్ ఫ్రెండ్ ఎలాంటి ఆహారం తీసుకుంటారో.. ఎలాంటి జీవన విధానాన్ని పాటిస్తారో మీరు కూడా దాన్నే ఫాలో అయ్యే అవకాశం ఎక్కువగా ఉందట. అలాగే మీ జీవన విధానంలో కూడా మార్పు వస్తుందట. అదొక్కటే కాదు.. ఎక్కువ మంది స్నేహితులు ఉన్న వారు ఎక్కువ కాలం జీవించి ఉండేందుకు అవకాశం ఉంటుందని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో తేలింది. 70 ఏళ్ల వయసు దాటి.. ఎక్కువ మంది స్నేహితులను కలిగి ఉంటే.. వారు 22 శాతం ఎక్కువ కాలం బతికి ఉంటారట. ఇక పెళ్లి పదికాలాల పాటు నిలవాలంటే దానికి పునాది దంపతుల మధ్య స్నేహమే.. గొడవలు వచ్చినప్పుడు స్నేహితులైన జంట వెంటనే అర్థం చేసుకుని సర్దుకుపోతారు.

## ముచ్చట తీరిందిలా..!



ములుగు జిల్లా రంగాపురం శివారులో కలెక్టర్ సి.నారాయణరెడ్డి వరి నాట్లు వేశారు. గోవిందరావుపేట మండలం రంగాపురంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన ఆయన.. తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులో వరి నాట్లు వేస్తున్న కూలీలను చూసి ఆగారు. కాసేపు వారితో కలసి నాట్లు వేసి ముచ్చట తీర్చుకున్నారు. తాను వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చానని, రైతు కష్టాలేమిటో తనకు తెలుసని ఈ సందర్భంగా పేర్కొన్నారు. – గోవిందరావుపేట



జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడవిసోమన్‌పల్లి వద్ద మానేరు వాగు ఉధృతి



అన్నారం బ్యారేజీలో గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న వరద

# ఒడిసి పట్టారు.. వదిలిపెట్టారు

కాళేశ్వరం: ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు సాగు నీరందించాలనే సంకల్పంతో ఒడిసిపట్టిన నీరంతా మానేరు వాగుకు వరద పోటెత్తడంతో శుక్రవారం సాయంత్రం నుంచి వదిలి పెడుతున్నారు. దీంతో 28 రోజులుగా ఇంజనీరింగ్ అధికారులు పడిన శ్రమంతా వృథా అయింది. నీటిని వదలకపోతే పెద్దపల్లి, జయశంకర్, మంచిర్యాల జిల్లాల్లో సుమారు 7 గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, తప్పని పరిస్థితుల్లో అన్నారం బ్యారేజీలో నిల్వ చేసిన నీటిని దిగువకు కాళేశ్వరం వైపు వదులుతున్నామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఒడిసిపట్టిన ప్రాణహిత నీరంతా యథాస్థానానికి యూటర్న్ తీసుకుందని చెబుతున్నారు. తెలంగాణలో పూర్తి స్థాయిలో వర్షాలు లేనప్పటికీ మహారాష్ట్రలో కురుస్తున్న వానలతో ప్రాణహిత నది ఉప్పొంగింది. దీంతో దిగువన

### ఉప్పొంగిన మానేరువాగు

- అన్నారం బ్యారేజీలో 14 గేట్లు ఎత్తివేత
- ఇంజనీర్ల శ్రమ వృథా
- యూటర్న్ తీసుకున్న ప్రాణహిత వరద
- రాత్రి గేట్లు మూసివేత

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద వరద ఉధృతి పెరిగి కన్నెపల్లి, మేడిగడ్డ బ్యారేజీలకు తరలిపోతోంది. కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటార్లకు వెట్ రన్ నిర్వహించి గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బ్యారేజీని నింపారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఆరు మోటార్లతో సుమారు 1,560 గంటలు డెలివరీ సిస్టంలో ఎత్తిపోశారు. గ్రావిటీ కాల్వ గుండా తరలిన నీరు అన్నారం బ్యారేజీకి చేరి అక్కడి నుంచి అన్నారం పంపుహౌస్, తరువాత సుందిళ్ల బ్యారేజీ, ఎల్లంపల్లికి చేరింది. అంతా బాగానే ఉందని ఇంజనీరింగ్ అధికారులు సంబరపడ్డారు. అయితే వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల గుండా వాగులు, వంకలు సుమారు 28 వరకు కలసి మానేరు వాగులో వరద పోటెత్తింది. దీంతో మల్హార్ మండలం అడవిసోమన్‌పల్లి వద్ద మానేరు ప్రవాహం దామెరకుంట మీదుగా అన్నారం బ్యారేజీలోకి చేరింది. సెకనుకు 20 వేల క్యూసెక్కులకు పైగా వరద తాకిడి ఉండటంతో అప్రమత్తమైన ఇంజనీరింగ్ అధికారులు 14 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు.

### రాత్రి అన్నారం గేట్ల మూసివేత

శనివారం రాత్రి వరకు మానేరువాగు తగ్గుముఖం పట్టింది. అన్నారం బ్యారేజీలో ఎత్తిన 14 గేట్లను మూసేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం 9వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 19వేల క్యూసెక్కుల వరకు ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం అన్నారం బ్యారేజీలో 8.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

**కరకట్టల సామర్థ్యంతోనే..**

మూడు జిల్లాల్లో వ్యాపించిన అన్నారం బ్యారేజీకి వరదలు తట్టుకునేలా కరకట్టల నిర్మాణం తోడ్పడుతుంది. జయశంకర్ జిల్లాలో 9 కిలోమీటర్లు, మంచిర్యాల జిల్లాలో 11 కిలోమీటర్లు, పెద్దపల్లి జిల్లాలో 5 కిలోమీటర్ల వరకు కరకట్టలు దృఢంగా ఉన్నట్లు ఇంజనీర్లు తెలిపారు. కాటారం మండలం దామెరకుంటలో 2.5 కిలోమీటర్ల మేర భూమిలోకి వరద నీరు ఉబికి వస్తుంది. కరకట్టల వద్ద సుమారు 55 మంది కూలీలతో ఇద్దరు జేఈఈలు ఇసుక బస్తాలు నింపే పని చేస్తున్నారు. పెద్దవాగులో కూడా 2,400 క్యూసెక్కుల వరద తరలిపోయి దిగువన గోదావరిలో కలిసింది. కాగా, అప్రమత్తంగా ఉండాలని సీఎం కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించింది.



## కలెక్టర్.. హోళి'కేరింత'

మంచిర్యాల జిల్లా కలెక్టర్ భారతీహోళికేరి కుటుంబ సమేతంగా జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో శనివారం పంట పొలాలను సందర్శించారు. రైతులు పంట పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను కలియదున్నుతుండగా.. కలెక్టర్ ట్రాక్టర్‌పైకి ఎక్కి పొలాన్ని దమ్ము చేయడాన్ని చూశారు. మహిళా రైతులు పొలంలో నాట్లు వేస్తుండగా.. కూతురు ఆద్యతో కలసి వరి నాట్లు వేశారు. - జైపూర్



## నాట్లు వేస్తూ.. పాట పాడుతూ..

జన్నారం(ఖానాపూర్): ఆమె ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శనివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల పర్యటనకు వచ్చారు. జన్నారం నుంచి కవ్వాల్ వైపు వెళ్తుండగా దేవునిగూడ వద్ద మహిళలు నాట్లు వేస్తూ కనిపించారు. దీంతో ఆమె కారు దిగి మహిళలతో కలసి కాసేపు వరినాట్లు వేశారు. వారితోపాటు పాటలు పాడారు.

## చిగురించిన 'చింత'



మంచిర్యాల జిల్లా కేంద్రం శివారు గుడిపేట గ్రామ పరిధిలో మిషన్ భగీరథ పనులు నడుస్తున్న సమయంలో కాంట్రాక్టర్ చింత చెట్టు చుట్టూ మట్టి తీయించాడు. దీంతో చెట్టు వేర్లు పూర్తిగా తేలి కొమ్మలన్నీ విరిగిపోయి ఎండిపోయింది. ఇటీవల వర్షాలు పడుతుండటంతో 'నేను బతికే ఉన్నా..'అన్నట్టు ఎండిపోయిన కొమ్మలు మళ్లీ చిగురించాయి.

– గెల్లు నర్సయ్య, సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

# ఉగ్ర గోదావరి

### గంట గంటకూ పెరుగుతున్న వరద

- రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- భద్రాచలం వద్ద 46 అడుగులకు చేరిన నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- జలదిగ్బంధంలో అనేక గ్రామాలు.. స్తంభించిన రాకపోకలు

సాక్షి నెట్‌వర్క్: గోదారమ్మ ఉగ్రరూపం దాల్చింది. శనివారం ఉదయం నుంచి ప్రవాహం ఉధృతమవడంతో ప్రమాద స్థాయిలో వరద పోటెత్తుతోంది. అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. పంట పొలాలు నీట మునిగిపోయాయి. గంట గంటకూ వరద ప్రవాహం పెరుగుతుండటంతో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అలాగే.. భద్రాచలం వద్ద సాయంత్రం ఐదు గంటలకు వరద ప్రవాహం 46 అడుగులకు చేరుకుంది. 48 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద 8.92 మీటర్లు, రామన్నగూడెం వద్ద 8.50 మీటర్లకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగపేట మండలం కమలాపురం ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటి మట్టం 82.5 అడుగులకు, వాజేడు మండలం పేరూరు వద్ద 14.20 మీటర్లు, కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 85.10 మీటర్లు, తుపాకులగూడెం బ్యారేజ్ వద్ద 82 మీటర్ల నీటి మట్టంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటి వరకు గోదావరి వరద నీరు దిగువకు 9 లక్షల క్యూసెక్కులు వదిలినట్లు అధికారులు తెలిపారు.

**జలదిగ్బంధంలోనే గ్రామాలు**

వర్షం కారణంగా ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి, కొత్తూరు, మామిడిగూడెం గ్రామాలకు శనివారం రాకపోకలు స్తంభించాయి. ఒకవైపు జంపన్నవాగు, మరోవైపు మామిడివాగు ఉండటంతో వాగులు దాట లేక పల్లెల్లోనే ఉంటున్నారు. కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురం, సర్వాయి గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. సర్వాయి వద్ద సుద్దవాగు, హన్మంతువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఐలాపురం వద్ద బొగ్గులవాగు, కొత్రలవాగు ఉప్పొంగడంతో వాగు దాటలేని పరిస్థితి నెలకొంది.

**నీటమునిగిన పంట పొలాలు**

ఎగువ ప్రాంతం నుంచి గోదావరికి వరద వస్తుండటంతో వాడేజు మండల పరిధి గుమ్మడి దొడ్డి–వాజేడు, పూసూరు–ఎడ్జర్లపల్లి, జాతీయ రహదారి–వీరాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద క్రమేపి పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉంది. పూసూరు, దూలాపురం, కాచారం, బాడువా, గుమ్మడి దొడ్డి తదితర గ్రామాల్లో వరి పంట ఇప్పటికే నీట మునిగింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉండటంతో కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ గోదావరి వరద ఉధృతిపై సమీక్షించారు. కలెక్టరేట్‌లో కాల్ సెంటర్లను అందుబాటులో ఉంచారు. కాగా, చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టగా.. శనివారం 24 గేట్లను పూర్తి స్థాయిలో ఎత్తి 1,18,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌కు కూడా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం సాయంత్రానికి కిన్నెరసానిలో 397.40 అడుగులకు నీటి మట్టం చేరుకోగా, 2,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

### ఎల్లంపల్లికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ఎల్లంపల్లి రిజర్వాయర్ వేగంగా నిండుతోంది. మూడు రోజుల క్రితం వరకు డెడ్ స్టోరేజీలో ప్రాజెక్టులోకి భారీ వర్షాలకు 13 టీఎంసీలకు చేరింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ఎస్సారెస్పీలోకి భారీ వరద**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల శనివారం గరిష్టంగా 30,320 క్యూసెక్కుల వరద నీరు వచ్చి, సాయంత్రానికి 26,450 క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి ప్రస్తుత సీజన్‌లో ఇంత స్థాయిలో వరద నీరు రావడం ఇదే తొలిసారి. ఒక్కరోజు వ్యవధిలో ప్రాజెక్టులో 2.5 అడుగుల నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (90 టీఎంసీలు) అడుగులు కాగా, 1051.50 (7.12 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని తెలిపారు. కాగా, నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర గ్రామ శివారులో గల మంజీరా నది జలకళ సంతరించుకుంది.

**పశువుల కాపరిని కాపాడిన రైతులు**

నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంక్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి గణపతిని రైతులు కాపాడారు. సుంక్లి నుంచి పెంచికల్‌పాడ్ వెళ్లే మార్గంలో ఉన్న వాగు ఉప్పొంగుతోంది. ఇంటికి వచ్చేందుకు గణపతి వాగు దాటే ప్రయత్నంలో అందులో చిక్కుకున్నాడు. ఒకేసారి ప్రవాహం పెరగడంతో పెద్దగా కేకలు పెట్టాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన గంగాధర్‌పటేల్, పలువురు రైతులు ఒకరిచేయి మరొకరు పట్టుకుని గణపతిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కాగా, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చర, నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతాల అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.



భద్రాచలం వద్ద నిండుకుండలా గోదావరి

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..** (నిల్వ-టీఎంసీల్లో) (ఫ్లో క్యూసెక్కుల్లో)

| ప్రాజెక్టు | పూర్తి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 106.05 | 2,39,000 | 2,39,520 |
| నారాయణపూర్ | 37.646 | 30.69 | 2,30,000 | 2,36,400 |
| జూరాల | 9.657 | 9.26 | 2,20,000 | 2,23,190 |
| శ్రీశైలం | 215.807 | 80 | 2,17,893 | 2,400 |
| నాగార్జునసాగర్ | 312.045 | 126.30 | 897 | 897 |
| కడెం | 7.60 | 6.23 | 51,864 | 39,809 |
| ఎల్లంపల్లి | 20.18 | 13 | 48,861 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 7.3 | 20,000 | 0 |

# కోదండరాం అరెస్టు

### నల్లమలలోకి వెళ్లేందుకు నిరాకరించిన పోలీసులు

అచ్చంపేట: యురేనియం తవ్వకాలు జరపవద్దంటూ నల్లమల ప్రజలు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా వెళుతున్న టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, ఇతర ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అభయారణ్యంలో యురేనియం తవ్వకాలు చేపట్టవద్దంటూ కొంతకాలంగా ఇక్కడి ప్రజలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. వీరికి మద్దతు వచ్చిన కోదండరాం తదితరులను అచ్చంపేట పోలీసులు హాజీపూర్ వద్ద అడ్డుకున్నారు. తమను అరణ్య ప్రాంతంలోకి ఎందుకు అనుమతించడం లేదని కోదండరాం, ప్రజా సంఘాల నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు ఉండటం వల్ల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎవరినీ లోపలికి వెళ్లనివ్వడంలేదని సీఐ రామకృష్ణ వారికి సమాధానమిచ్చారు. దాంతో 'మావోయిస్టులతో ఇబ్బంది ఉంటే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బక్కలింగాయిపల్లి, శ్రీశైలం వైపు ఎలా వెళ్లారు.. వారికి లేని ప్రమాదం మాకెలా ఉంటుంది..'అని కోదండరాం ప్రశ్నించారు. అనంతరం వారిని పోలీసులు బలవంతంగా కిందికి దింపి అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో వెల్దండ స్టేషన్‌కు తరలించారు.



కోదండరాంను తీసుకెళుతున్న పోలీసులు

# ఆ బాలిక ఎవరి వద్ద ఉండాలి?

### కన్నోళ్ల దగ్గరనా.. పెంచుకున్న వారి ఇంట్లోనా?

**నిర్ణయం బాలికకే వదిలేసిన పెద్ద మనుషులు**

చౌటుప్పల్ : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆ తల్లిదండ్రులు తమ బిడ్డను వేరే వారికి ఇచ్చేశారు. పిల్లలు లేకపోవడంతో ఆ పాపను తీసుకెళ్లిన దంపతులు పెంచి పెద్ద చేశారు. అన్ని విధాలుగా బాగా చూసుకున్నారు. పెరిగి పెద్దదయిన ఆ బాలికకు ఇటీవలే తనకు సొంత తల్లిదండ్రులు వేరేగా ఉన్నారన్న విషయం తెలిసింది. వారిపై ప్రేమ కలగడంతో అక్కడికే వెళ్లాలని నిర్ణయించుకుంది. కానీ పెంచుకున్న తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. ఈ విషయం పెద్ద మనుషుల వద్దకు వెళ్లింది. తీర్పు ఎటు వైపు చెప్పాలో వారికి సైతం అర్థం కాకపోవడంతో నిర్ణయాన్ని ఆ బాలికకే వదిలేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎనగండి తండాలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ దంపతులకు 14 ఏళ్ల క్రితం ఆడబిడ్డ పుట్టింది. అప్పటి పరిస్థితుల కారణంగా ఆ బిడ్డ వారికి భారమైంది. అదే సమయంలో సమీపంలోని పీపల్‌పహాడ్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు పాపను అప్పగించారు. దీంతో ఆ అమ్మాయి పీపల్‌పహాడ్‌లోనే పెరిగింది.

**స్నేహితులు చెప్పడంతో..**

ఆ బాలిక ప్రస్తుతం పీపల్‌పహాడ్‌లో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల ఆమె స్నేహితులు అసలు తల్లిదండ్రుల గురించి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వారి మాటలతో అసలు విషయం తెలుసుకోవాలని బాలిక నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఎనగండి తండాలో ఉన్న కన్న తండ్రి ఫోన్ నంబర్‌ను సంపాదించింది. ఫోన్ చేసి తన విషయాన్ని అడిగింది. కానీ అతను మాత్రం ఆమె తండ్రిని కాదని బదులిచ్చాడు. 20 రోజుల క్రితం తండాలో తనకు జన్మనిచ్చిన తల్లి మృతిచెందగా ఆమె అంత్యక్రియలకు వెళ్లింది. తాను ఇక్కడే ఉంటానని బంధువులు, గ్రామస్తులను కలిసి వేడుకుంది. వారంతా బాలిక నిర్ణయంతో అంగీకరించలేదు. రోజులు గడుస్తున్నా బాలికలో మాత్రం మార్పు రాలేదు. తనను పెంచుకున్న తల్లిదండ్రుల వద్ద ఉండనని, కన్నవాళ్ల ఇంటికే వెళ్తానని భీష్మించింది. దీంతో శనివారం ఎనగండి తండాలో ఇరువైపులకు చెందిన పెద్ద మనుషులు సమావేశమయ్యారు. తీర్పు ఎటువైపు చెప్పాలో తెలియక తటస్థంగా ఉండిపోయారు. ఏదేమైనా తాను మాత్రం కన్నవాళ్ల ఇంట్లోనే ఉంటానని బాలిక తేగేసి చెప్పింది. దీంతో పెద్ద మనుషులంతా కల్పించుకొని 'నీకు ఎక్కడ ఉండాలనిపిస్తే అక్కడే ఉండు, ఈ విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు'అని చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్
ప్రకటన
సినిమా ఆపరేటర్స్ ఎగ్జామినేషన్ 6వ సెషన్ కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. పరీక్ష నెల: డిసెంబర్ 2019, సెంటర్స్: హైదరాబాద్, అర్హత: A) 7వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత, B) SC మరియు ST అభ్యర్థుల కొరకు (7వ తరగతి లేదా దానికి తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత/ఫెయిల్), C) 30.06.2019 నాటికి తెలంగాణలో ఏదేని లైసెన్స్ గల సినిమా థియేటర్‌లో ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తి అయి ఉండాలి, D) 01.07.2019 నాటికి వయస్సు 18 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. రుసుము: రూ.500/-, దరఖాస్తు ఫారాల అమ్మకం: ప్రకటన ప్రచురణ తేది నుండి 15.10.2019 వరకు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారం స్వీకరణకు చివరి తేది:31.10.2019న సా.5.00 గం.వరకు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.
సం/- ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్
DIPR RO. No.810-DP/CL/Advt/1/2019-20, Dt: 03.08.2019

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, గిరిజన సంక్షేమ సర్కిల్ వరంగల్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
No.DB4/56/E.P.N.I.T./150 to 153/2019-2020, తేది:31-07-2019
NIT No.150 to 160/SE/TW/WGL, తేది:31-07-2019
పని పేరు: మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ (V&M)లో మోడల్ స్పోర్ట్స్ స్కూల్ బాయ్స్ నిర్మాణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సబ్ సెంటర్ కమ్ అంగన్‌వాడి సెంటర్ నిర్మాణం, వరంగల్ రూరల్ జిల్లాలో TTWRJC (సైనిక్ స్కూల్) ప్రహరీగోడ నిర్మాణం, ఖమ్మం జిల్లాలో వివిధ పనుల నిర్మాణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ పనుల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం అంచనా వ్యయం: రూ.283.00 లక్షలు. టెండరు పిలుపు: 1వ పిలుపు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం(ఆన్‌లైన్):05-08-2019న సా.5:00 గం. తరువాత. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం(ఆన్‌లైన్): 20-08-2019న మ.3:00 గం.వరకు, సాంకేతిక బిడ్ తెరుచు తేది & సమయం: 20-08-2019న సా.5:00 గం. ఫోన్ నం.0870-2567645, setwwgl7@gmail.com. తదుపరి వివరాల కోసం TWED డిపార్ట్‌మెంట్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.in ను చూడవలెను.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR Ro.No.793-DP/CL/Advt/1/2019-20, Dt:02-08-2019

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, పిల్లల, వికలాంగుల & వయోవృద్ధుల శాఖ, నిజామాబాద్
ప్రకటన
ఇచ్చట ప్రచురించబడిన ఫోటోలోని బాబు జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, పిల్లల, వికలాంగుల & వయోవృద్ధుల శాఖ, నిజామాబాద్ పరిధి నందలి గల శిశు గృహ, సుభాష్‌నగర్ వారి సంరక్షణలో ఉంచబడినారు. ఈ బాబుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ప్రచురణ తేది నుండి 30 రోజులలోగా తగిన సాక్ష్యాధారాలతో సహా దిగువ సంతకందారు గారిని సంప్రదించవచ్చును. లేనిపక్షంలో ఈ బాబును అనాథగా ప్రకటించబడును మరియు ప్రభుత్వముచే నిర్దేశించబడిన నియమనిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వబడును.

పేరు: విశాల్
పుట్టినతేది:08.07.2019
సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళల, పిల్లల, వికలాంగుల & వయోవృద్ధుల శాఖ,నిజామాబాద్
DIPR Ro. No.809-DP/CL/ADVT/1/2019-20, Dt: 03-08-2019



# ప్రియమైన శత్రువు!

ఆటతో పాటు అందానికి కేరాఫ్ అడ్రస్ టెన్నిస్ క్రీడ. గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో హోరాహోరీ పోరాటాలు, కోర్టులో కవ్వింపులు, భీకరమైన అరుపులకు కొదవుండదు. పవర్‌గేమ్‌కు పర్యాయపదమైన ఈ ఆటలో శత్రుత్వమూ అదే స్థాయిలో ఉండటం సహజం. కానీ 1970, 80 దశకంలో మహిళా టెన్నిస్‌ను శాసించిన దిగ్గజాలు మార్టినా నవ్రతిలోవా (చెక్ రిపబ్లిక్), క్రిస్ ఎవర్ట్ (అమెరికా) ఈ ఆనవాయితీకి విరుద్ధం. ఈ ఇద్దరూ పలు టోర్నీల్లో 80 సార్లు ప్రత్యర్థులుగా ఎదురుపడ్డారు. అందులో ఏకంగా 60 ఫైనల్ మ్యాచ్‌ల్లో ప్రాణం పెట్టి పోరాడారు. అంటే ఈ ఇద్దరి మధ్య పోటీ ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ పోటీ వీరిద్దరి మధ్య వైరం కన్నా స్నేహ బంధాన్ని పెంచింది. ఎంతలా అంటే ఫైనల్ అనంతరం ఈ ఇద్దరూ ఎవరికి తెలియకుండా లాకర్‌రూమ్‌లో వెళ్లి కూర్చునేవారట. ఓడిన వారు ఏడుస్తుంటే గెలిచిన వారు సముదాయించే వారట. ఇలా 16 ఏళ్ల పాటు జరిగిందని ఎవర్ట్ పేర్కొంది. పదహారేళ్ల ప్రాయంలో మొదలైన తమ స్నేహంలో ఎన్నో మధురస్మృతులతో పాటు కష్టనష్టాలు ఉన్నాయంటారు వీరిద్దరూ. తన జీవిత భాగస్వామితో విడిపోయినప్పుడు మార్టినా అండగా నిలిచిందంటూ ఇప్పటికీ ఎప్పటికీ తామిద్దరం ప్రియమైన శత్రువులమే అంటోంది ఎవర్ట్.



## పాదమెటుపోతున్నా.. పయనమెందాకైనా..

కనీసం మాటలు రాని, నడవడం కూడా రాని చిన్న పిల్లలు స్నేహం గురించి అర్థం చేసుకుంటారట. ఎవరైనా ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటుంటే.. వారి మధ్య స్నేహం ఉందా లేదా అనే విషయాన్ని కూడా అంచనా వేయగలరట. ఇది కూడా ఓ అధ్యయనమే చెప్పిందండోయ్..



అయితే, అమెరికాలో జరిపిన ఓ అధ్యయనంలో తేలిన విషయం ఏంటంటే గత 25 ఏళ్లు లెక్క తీసుకుంటే.. నమ్మకమైన స్నేహితుల సంఖ్య మూడో వంతుకు పడిపోయిందట. విశ్వాసపాత్రమైన స్నేహితుల్లేని వారి సంఖ్య కూడా పెరిగిందట.



## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసుల విచారణ

### హైకోర్టు కీలక తీర్పు

సాక్షి, హైదరాబాద్: వివాహమయ్యాక విదేశాలకు వెళ్లిన దంపతుల మధ్య తలెత్తే వివాదాలు సత్వరం పరిష్కారమయ్యే విధంగా హైకోర్టు తీర్పు వెలువరించింది. దంపతుల మధ్య తలెత్తే ఈ తరహా కేసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించవచ్చని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు ఇటీవల కీలక తీర్పు చెప్పారు. 'ఇప్పటి వరకూ క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ అయిన నిందితుల్ని జైలు నుంచే కోర్టులు విచారిస్తున్నాయి. దంపతుల మధ్య తలెత్తే కుటుంబ కలహాల కేసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించడానికి వీల్లేదనడానికి న్యాయపరమైన కారణాలు ఏమీ కనబడటం లేదు' అని స్పష్టం చేసింది.

**సిటీకోర్టు తిరస్కరణపై సవాల్**

ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మహిళ తన వివాహాన్ని రద్దు చేసి విడాకులు ఇప్పించాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో 2012లో కేసు వేసింది. అయితే, వివాహ బంధం కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఆమె భర్త 2013లో పిటిషన్ వేశాడు. ఈ రెండు కేసుల్ని కలిపి సిటీ సివిల్ కోర్టు విచారిస్తోంది. ఆమె తన కుమారుడితో కలిసి అమెరికాలో ఉండగా, ఈ కేసులో ఆమె తండ్రి కోర్టుకు హాజరవుతున్నారు.

TS SPDCL GENCO JLM Sub-Engg. AE
AP గ్రామ AP పట్టణ సచివాలయంలో ఉద్యోగాలు
New Batch Starts : 5-8-19
SAIMEDHA HYD-DSNR 9492641234

వాంగ్మూలం నమోదు చేసే విషయంలో ఆమె కింది కోర్టుకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. దాంతో హైదరాబాద్ వచ్చిన ఆమె గత ఏడాది మార్చి 25 ఏప్రిల్ 14 వరకూ 21 రోజులపాటు ఇక్కడే ఉన్నది. ఏప్రిల్‌లో తిరిగి అమెరికా వెళ్లకపోతే తన పాస్‌పోర్టు సీజ్ చేస్తారని ఆమె కోర్టు దృష్టికి తెచ్చింది. కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని మాత్రమే కోర్టు ఆదేశించడంతో విచారణ జరగడం లేదని ఆమె అమెరికా వెళ్లిపోయింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసు విచారణ చేయాలని అమెరికా నుంచి ఆమె కోరగా సిటీ సివిల్ కోర్టు అనుమతించలేదు. దీంతో ఆమె హైకోర్టులో సవాల్ చేశారు. 'భార్యాభర్తలకు అనుకూలమైన తేదీని నిర్ణయించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసుల విచారణ జరపాలి. అమెరికాలో ఉంటూ ఉద్యోగం చేసుకునేవారు ఇక్కడి కేసుల విచారణకు రావాలంటే వారికి సమస్యలు వస్తాయి. ఒక్కోసారి ఉద్యోగం పోయే ప్రమాదం కూడా రావచ్చు. ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదురౌతాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దంపతుల మధ్య వివాదాల్ని కూడా విచారించవచ్చు' అని న్యాయమూర్తి పేర్కొన్నారు.

# స్మార్ట్‌ఫోన్ జాడ్యం ఎత్తేద్దాం!

- చదరంగం.. పులిజూదం.. పచ్చీసు!
- చెస్ సహా బోర్డు గేమ్స్‌కు పుట్టినిల్లు భారతే
- పునరుద్ధరిస్తే పదునెక్కనున్న మేధస్సు
- ముంబై వేదికగా భారీ కసరత్తు



రాచకొండ కోట, గుడిమల్లం ఆలయ రాళ్లపై చిత్రించిన పచ్చీసు

సాక్షి, హైదరాబాద్:

**చదరంగం ఎవరు కనుగొన్నారు..? యూరప్‌లో పుట్టినట్టుంది..! కానీ అచ్చంగా అది మన భారతీయ సంప్రదాయ క్రీడ అని.. దాన్ని సృష్టించింది మన పూర్వీకులే అన్న నిజం ఎంతమందికి తెలుసు? ఈ చదరంగం ఆట వాయువ్య భారతంలో పుట్టింది. నేపాల్ దేశం జాతీయ క్రీడతో సమానంగా భావించే పులిజూదం కూడా మన సొంతమే!**

ఇలా చెబుతూ పోతే పచ్చీసు, అష్టాచెమ్మా, పాము–నిచ్చెన.. ఇలాంటి సంప్రదాయ 'బోర్డ్ గేమ్స్'అన్నీ మన సృష్టే. ఈ ఆటలన్నీ దాదాపు అన్ని దేశాల్లో ఆడుతున్నవే. మరి మనలో ఎంతమంది వీటిని ఆడుతున్నారు? ఇప్పుడు కేంద్రానికి కూడా ఇదే సందేహమొచ్చింది. వెంటనే చిన్న అధ్యయనం చేయగా.. చదరంగం మినహా మిగతావన్నీ దాదాపు అంతరించే స్థితిలో ఉన్నాయి. కేంద్రం అధీనంలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్, ముంబై విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లు సంయుక్తంగా భారీ కార్యాచరణకు నడుం బిగించాయి.

హ్యూమన్ కంప్యూటర్ అనగానే ఠక్కున గుర్తుకు వచ్చే పేరు రచయిత్రి శకుంతలాదేవి. లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ కంప్యూటర్ విభాగం ఇచ్చిన గణిత పజిల్‌ను ఆమె కేవలం 28 క్షణాల్లో పరిష్కరించి ఆ బిరుదు సంపాదించారు. అది అప్పట్లో గిన్నిస్ బుక్ పుటల్లో నమోదైంది. 7686369774870 ను 2465099745779 గుణిస్తే వచ్చే మొత్తాన్ని ఆమె అరనిమిషం సమయం కూడా తీసుకోకుండా ఠక్కున చెప్పేశారు. మరి ఇప్పటి పిల్లలు కాలిక్యులేటర్ లేకుండా లెక్కలు చేయగలుగుతున్నారా.. తపేతపేమంటూ ఎక్కాలు వల్లించగలుగుతున్నారా? చిన్నచిన్న లెక్కలకు కూడా కాలిక్యులేటర్ చూడనిదే చేయలేని పరిస్థితికి వచ్చారు ఇప్పటి పిల్లలు. ఇతర దేశాలతో పోలిస్తే ఇప్పటి తరం క్రమంగా తీసికట్టుగా మారుతోందన్న సంగతి వెక్కిరిస్తోంది.

YVRAO-HYD NEET
Long Term Batch Started
20 Students Batch - Ac
Super tips in PHY & CHEM
9100060601, 602

**కారణమేంటి..?**

సంప్రదాయ బోర్డ్ గేమ్స్ అంతరించటం.. పిల్లల్లో ఆలోచనా శక్తి, జ్ఞాపక శక్తి మందగించటం... ఈ రెండింటికి లింక్ ఉందనేది నిపుణుల మాట. అందుకే అలనాటి బోర్డు గేమ్స్ పునరుద్ధరించి మళ్లీ విస్తరించేలా చేస్తే పిల్లల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని, దీంతో జ్ఞాపకశక్తి, మేధోసంపత్తి చురుగ్గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్, ముంబై విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లు సంయుక్తంగా ఓ బృహత్తర కార్యాచరణ ప్రారంభించాయి. ఈ సంప్రదాయ బోర్డ్ గేమ్స్ అన్నీ సరదాగా ఆడినట్టే అనిపించినా వాటన్నింటిలో నిగూఢంగా ఆలోచనా శక్తిని పురిగొల్పే మహత్తు ఉంది. ఎత్తు వేసే ముందు ఎంతో ఆలోచించాలి. ఎదుటి వారిని చిత్తు చేయాలంటే గొప్ప ఎత్తుగడ అవసరం. అందుకు తీక్షణంగా ఆలోచించాలి. అది ఆ ఆటలో గెలుపే కాదు, జీవితంలో విజయం సాధించేందుకూ ఉపయోగపడుతుందని ఈ గేమ్స్‌పై అధ్యయనం చేసిన నిపుణులు తేల్చారు. వీటిని పునరుద్ధరించేందుకు వీటిపై విద్యార్థుల్లో తొలుత ఆసక్తి కలిగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ మూడు సంస్థలు ఇటీవల ముంబైలో నిపుణులతో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించాయి. ఇందులో ఈ బోర్డ్ గేమ్స్‌పై అవగాహన, అధ్యయనం చేసిన నిపుణులను ఆహ్వానించారు. అలా 40 మంది పాల్గొనగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజారెడ్డి కూడా ఉన్నారు.

**ఏం చేస్తారు..?**

భారతీయ సంప్రదాయ బోర్డ్ గేమ్స్ ఏంటో గుర్తించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే చదరంగం పుట్టింది ఇండియాలోనే అన్నదానికి గట్టి ఆధారాలను సహేతుకంగా గుర్తించారు. చాలా దేశాల్లో ఇప్పుడు ప్రాచుర్యంలో ఉన్న ఈ గేమ్స్‌కు పుట్టినిల్లు మన దేశమే అన్న విషయం తెలిస్తే... వీటిపై విద్యార్థుల్లో ఆసక్తి రగులుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సదస్సులో పేపర్స్ ప్రజెంట్ చేసినవారు ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. ఇందుకోసం చారిత్రక ఆధారాలను సేకరిస్తున్నారు. హైదరాబాద్ వైద్యులు డాక్టర్ రాజారెడ్డి.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని పురాతన చారిత్రక దేవాలయాలు, కోటలలో ఈ ఆటలకు సంబంధించి ఆధారాలను సచిత్రంగా సదస్సు ముందుంచారు. హైదరాబాద్ శివారులోని రాచకొండ కోటలో 12వ శతాబ్దిలో ఈ ఆటలు ఆడినట్టు అక్కడి రాళ్లపై చిత్రించి ఉన్న చదరంగం, పులిజూదం, దడి తదితర చిత్రాలను సేకరించారు. తిరుపతికి చేరువలో ఉన్న ఈ ఆలయం క్రీ.పూ.2వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. అంటే 2021 సంవత్సరాల క్రితమే ఇక్కడ ఈ ఆటలు ప్రాచుర్యంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ నిపుణులు సమర్పించిన పేపర్లతో ఓ పుస్తకాన్ని రూపొందిస్తున్నారు. దీన్ని దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, పాఠశాలలకు పంపాలనేది ప్రణాళిక. ఈ ఆటలు ఎలా ఆడాలి, ఆడటం వల్ల కలిగే లాభాలు, ఈ ఆటలకు దూరం కావటం వల్ల మనకు జరిగిన నష్టం...తదితర వివరాలను సహేతుకంగా సిద్ధం చేసి విద్యార్థులకు చేరేలా చేయాలనేది ఆలోచన. ఈ ఆటల్లో ఆసక్తి రగిలే కార్యక్రమాలు నిర్వహించి మళ్లీ నేటితరం ఆ సంప్రదాయ ఆటలవైపు చూసేలా చేయాలని నిర్ణయించారు.

### నా మనవరాలు సందేహంతో: రాజారెడ్డి

'అమెరికాలోని నాసాలో అధ్యయనం చేస్తున్న నా మనవరాలు సమీక్ష మా ఇంటికి వచ్చినప్పుడు చదరంగం ఎక్కడ పుట్టిందన్న ప్రశ్న వేసింది. చిన్న అధ్యయనంతో అది మన దేశంలోనే పుట్టిందన్న మాట చెప్పినప్పుడు అబ్బురపడి చారిత్రక ఆధారాలు సేకరించి పుస్తకం రాయాలని కోరింది. అలా మేం ఇద్దరం కలసి ఆధారాలతో ఓ పుస్తకాన్ని రూపొందించాం. ఇప్పుడు ఇదే ఆలోచనతో ఉన్న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్, ముంబై విశ్వవిద్యాలయం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లు ఆ పుస్తకం గురించి తెలుసుకుని సదస్సుకు ఆహ్వానించాయి. అక్కడ నేను మా అధ్యయనంలోని వివరాలు అందించా. 40 మంది నిపుణులు అద్భుతమైన వివరాలు సమర్పించారు. త్వరలో అవన్నీ దేశవ్యాప్తంగా విద్యార్థులకు చేరతాయి. మన సంప్రదాయ బోర్డు గేమ్స్‌కు పాత రోజులొస్తే కచ్చితంగా విద్యార్థులకు మేలు కలుగుతుంది'

### ఇండియా టూ పర్షియా..

చదరంగం మన దేశంలో తొలుత ఆడారు. నలుగురు ఆడేలా దాన్ని రూపకల్పన చేశారు. ఆ తర్వాత అది పర్షియాకు చేరింది. అక్కడ రాజు/రాణి పావు అదనంగా చేర్చి, ఇద్దరు ఆడేలా మార్చారు. ఆ తర్వాత యూరప్, అక్కడి నుంచి చైనాకు ఆ ఆట చేరిందని నిపుణులు తేల్చిన వివరాలను ఈ సదస్సులో సమర్పించారు. పులిజూదం, పచ్చీసు, పాము–నిచ్చెన, అష్టాచెమ్మలు కూడా మన దేశం నుంచి ఇతర ఖండాలకు పాకినవేనని పేర్కొన్నారు.



దేవాదాస్‌కు నివాళులు అర్పించి రాజీవ్ కనకాలను ఓదారుస్తున్న చిరంజీవి

## దేవదాస్ కనకాలకు కన్నీటి వీడ్కోలు

- చిరంజీవి సహా పలువురు నటుల అశ్రునివాళి
- రాయదుర్గంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి

హైదరాబాద్: సీనియర్ నటుడు, దర్శకుడు, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు దేవదాస్ కనకాల (75) అంత్యక్రియలు శనివారం బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. రాయదుర్గంలోని మహాప్రస్థానంలో ఆయన భౌతికకాయానికి కుమారుడు రాజీవ్ కనకాల అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తండ్రి చితికి నిప్పంటించే సమయంలో రాజీవ్ కనకాల రోదించడం అందరినీ కలచి వేసింది. అంతకుముందు మణికొండలోని దేవదాస్ నివాసానికి ఆయన వద్ద నటనలో శిక్షణ పొందిన అనేక మంది శిష్యులు చేరుకొని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధం, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి దేవదాస్‌కు నివాళులు అర్పించి కుమారుడు రాజీవ్ కనకాల, కుమార్తె శ్రీలక్ష్మిని ఓదార్చారు. భార్య మరణించినప్పటి నుంచి దేవదాస్ ముభావంగా ఉంటున్నారని, ఈ క్రమంలో ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని ఆయన బంధువులు పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక వాహనంలో మణికొండ, రాయదుర్గం మీదుగా విస్పర్ వ్యాలీ కూడలి నుంచి మహాప్రస్థానానికి దేవదాస్ కనకాల భౌతికకాయాన్ని తరలించారు. అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో సినీనటులు, ఆయన శిష్యులు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్ కరెంట్‌కు బ్రేక్!

- కొన్ని నెలలుగా సరఫరా అంతంత మాత్రమే
- అక్కడి మార్వా థర్మల్ కేంద్రంలో సాంకేతిక సమస్యలతోనే..
- పునరుద్ధరణకు గడువుకోరిన ఛత్తీస్‌గఢ్ అధికారులు
- సానుకూలంగా స్పందించిన తెలంగాణ జెన్‌కో



సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం ఆ రాష్ట్రం నుంచి తెలంగాణకు సరఫరా కావాల్సిన 1000 మెగావాట్ల విద్యుత్‌కు బ్రేక్‌పడింది. ఛత్తీస్‌గఢ్‌లోని 1000 మెగావాట్ల మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో కొన్ని నెలలుగా రాష్ట్రానికి అంతంత మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతోంది. కొంతకాలంగా 500 మెగావాట్ల లోపు మాత్రమే విద్యుత్ సరఫరా కాగా, తాజాగా అది కూడా పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుత పరిస్థితిలో విద్యుత్ సరఫరా చేయలేమని, సాంకేతిక సమస్యలను అధిగమించి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ జెన్‌కో అధికారులకు ఛత్తీస్‌గఢ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. దీనికి జెన్‌కో యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి కరెంటు తెచ్చుకోవాల్సిన అవసరం లేకపోవడంతో సర్దుకుపోవాలని నిర్ణయించినట్లు తెలంగాణ జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా థర్మల్ విద్యుత్ కేంద్రంలో కొంత కాలంగా తీవ్ర సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిసింది.

**కరెంట్‌కు బదులు కరెంట్!**

విద్యుత్ విషయంలో ఇతర రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిని తెలంగాణ జెన్‌కో ఈ ఏడాది కూడా అమలు చేస్తోంది. ఏకధాటి వర్షాలతో రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ తగ్గిపోవడం, జల విద్యుదుత్పత్తి కూడా ప్రారంభం కావడంతో రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ మిగిలిపోతోంది. రాష్ట్ర అవసరాలు తీరాక, మిగిలిన విద్యుత్‌ను జెన్‌కో కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలకు 'ఇచ్చిపుచ్చుకునే విధానం'లో సరఫరా చేస్తోంది. జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి జెన్‌కో 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తోంది. రాష్ట్ర అవసరాలు పోగా, మిగిలిపోయిన విద్యుత్‌లో 200 మెగావాట్లను కర్ణాటకకు, 500 మెగావాట్లను పంజాబ్‌కు సరఫరా చేస్తోంది. గతేడాది కూడా తెలంగాణ జెన్‌కో కర్ణాటకకు విద్యుత్ సరఫరా చేసి, అవసరమైనప్పుడు కర్ణాటక నుంచి పొందింది. ఈ సారి కూడా తాము ఉత్పత్తి చేసిన కరెంటును కర్ణాటకకు అందిస్తున్నామని, తమకు అవసరం వచ్చినప్పుడు తిరిగి పొందేలా కర్ణాటకతో ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రభాకర్ రావు తెలిపారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణితో వ్యవహరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

**రెండేళ్లుగా ఇదే విధానం**

నాలుగు రోజులుగా ఉత్పత్తి అయిన 200 మెగావాట్ల విద్యుత్తును కర్ణాటకకు ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నప్పుడు దేశంలో ఏ రాష్ట్రానికి అవసరముంటే.. వారికి సరఫరా చేసి, వేసవిలో తెలంగాణకు ఎక్కువ డిమాండు ఉన్నప్పుడు తిరిగి పొందే విధానాన్ని తెలంగాణ జెన్‌కో గత రెండేళ్లుగా అవలంబిస్తున్నది. పవర్ బ్యాంకింగ్ విధానంగా పిలిచే ఈ పద్ధతి ద్వారా గతంలో రాజస్తాన్‌కు కూడా తెలంగాణ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. నిండు వేసవిలో రాజస్తాన్ నుంచి కరెంటు పొందింది. ఇప్పుడు కూడా పవర్ బ్యాంకింగ్ విధానం ద్వారానే పంజాబ్‌కు విద్యుత్ అందిస్తున్నట్లు ప్రభాకర్ రావు చెప్పారు. తమకు డిమాండ్ లేనప్పుడు వేరే రాష్ట్రాలకు ఇవ్వడం, తమకు డిమాండ్ ఉన్నప్పుడు వేరే రాష్ట్రాల నుంచి పొందడం వల్ల గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో ఎక్కువ ధరకు కొనాల్సిన అవసరం రాదని ప్రభాకర్ రావు వివరించారు.

## జూడాలతో మంత్రి ఈటల చర్చలు విఫలం

సాక్షి, హైదరాబాద్: నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లును వ్యతిరేకిస్తూ జూనియర్ డాక్టర్లు (జూడా) నిర్వహిస్తున్న సమ్మె శనివారం కూడా కొనసాగింది. మూడు రోజులుగా ఎమర్జెన్సీ సేవలను జూడాలు బహిష్కరించడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వారిని చర్చలకు పిలిచారు. శనివారం రాత్రి జూడాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూడాలు మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఎన్‌ఎంసీ బిల్లులో తాము కోరిన సవరణలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందుకు మంత్రి సైతం అంగీకరించారు. జూడాల డిమాండ్లను కేంద్రానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సమ్మెతో రోగులకు ఇబ్బంది కలుగుతోందని, సమ్మె విరమించాలని మంత్రి కోరారు. కేంద్రానికి నిరసన తెలిపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అయితే, జూడాలు మాత్రం సమ్మె కొనసాగించడానికే మొగ్గు చూపారు.

## ఫోన్లో తలాక్.. కేసు నమోదు

గోరఖ్‌పూర్: ట్రిపుల్ తలాక్ చట్టం వచ్చి నాలుగు రోజులు గడవక ముందే ఓ వ్యక్తి తన భార్యకు ఫోన్ ద్వారా తలాక్ చెప్పిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లాలో చోటుచేసుకుంది. సౌదీ అరేబియాలో ఉంటున్న తన అల్లుడు అబ్దుల్ రహీమ్, తన కుమార్తెకు బుధవారం తలాక్ చెప్పాడంటూ బాధితురాలి తండ్రి అహ్మద్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శనివారం రహీమ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 2014లో రహీమ్‌తో తన కుమార్తె ఖాతూన్ (25)తో వివాహం జరిగిందన్నారు. బుధవారం ఆమె ఇంటి పనులు చేసుకుంటుండగా, రహీమ్ ఫోన్‌చేయగా, అతని తండ్రి ఆమెకు ఫోన్ ఇచ్చారని, అందులో అతడు మూడు సార్లు తలాక్ చెప్పినట్లు ఆయన పోలీసులకు తెలిపారు. ఈ విషయం తెలిసి తాము వారింటికి చేరుకోగానే రూ. 1.5 లక్షల చెక్కు చేతిలో ఉంచి ఇంతటితో అంతా ముగిసిందని అన్నట్లు తెలిపారు. గతంలో కూడా తన కుమార్తెను వేధించారని ఆరోపించారు.

# రోగులతో ప్రేమగా మాట్లాడండి

- వైద్యులకు గవర్నర్ నరసింహన్ సూచన
- జీవీకే ఈఎంఆర్‌ఐలో సిమ్యులేషన్ కాంప్లెక్స్ ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు ఈటల రాజేందర్, మల్లారెడ్డి



సిమ్యులేషన్ కాంప్లెక్స్‌లో అత్యవసర వైద్య బోధనా తీరును పరిశీలిస్తున్న గవర్నర్ నరసింహన్, మంత్రులు ఈటల, మల్లారెడ్డి తదితరులు

మేడ్చల్ రూరల్: ప్రజలు వైద్యులను దేవుడితో సమానంగా భావిస్తారని, అలాంటి వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులను కసురుకోకుండా ప్రేమగా పలకరిస్తే సగం జబ్బు నయమవుతుందని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ అన్నారు. శనివారం ఇక్కడ శామీర్‌పేట్ మండలం దేవరయాంజాల్ పరిధిలోని జీవీకే ఈఎంఆర్‌ఐలో టాటా ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సిమ్యులేషన్ కాంప్లెక్స్‌ను గవర్నర్ నరసింహన్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, కార్మిక, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి మల్లారెడ్డితో కలసి ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశ ఆర్థికవృద్ధి గణనీయంగా పెరుగుతుందన్నారు. 'నాకు 1971లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో వైద్యులు అందించిన సేవల వల్ల మరో జన్మ పొంది, ఇప్పుడు మీ ముందు ఇలా ఉన్నాను'అని కొనియాడారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలు, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఫీజుల నియంత్రణపై సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టాలని, దీనిపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టి సారించాలని గవర్నర్ కోరారు. మధ్యతరగతి ప్రజలు నేటికీ మెరుగైన చికిత్స పొందలేక పోవడం, మెడికల్ కాలేజీల్లో ఫీజులు కట్టలేక దూరమయ్యే పరిస్థితి ఉండడం సరికాదని పేర్కొన్నారు. మంత్రి ఈటల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువకాలంలో ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందిస్తూ దేశంలోనే మంచి గుర్తింపు పొందిందన్నారు. పేద గర్భిణులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ రేవంత్‌రెడ్డి, జీవీకే ఈఎంఆర్‌ఐ వ్యవస్థాపకుడు జీవీకే రెడ్డి, డైరెక్టర్ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి, సీనియర్ వైద్యులు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం..**

వైద్యరంగంలో విశేష సేవలు అందించిన ప్రముఖ వైద్యులు కృష్ణకుమార్, కాకర్ల సుబ్బారావు, నాగేశ్వర్‌రెడ్డి, సోమరాజులకు జీవిత సాఫల్య పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు.

**మంత్రి మల్లారెడ్డికి మొట్టికాయలు...**

సిమ్యులేషన్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్మిక మంత్రి మల్లారెడ్డికి గవర్నర్ నరసింహన్ నుండి పరోక్షంగా మొట్టికాయలు పడ్డాయి. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ దేశంలో హైదరాబాద్ నంబర్ వన్‌గా ఉందని, మంచి మంచి డాక్టర్లు, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు ఇక్కడే ఉన్నాయని, దేశంలోనే సురక్షిత ప్రాంతంగా నగరం ఉందని అన్నారు. అనంతరం సమావేశ వ్యాఖ్యాత మాట్లాడుతూ హైదరాబాద్ సురక్షిత ప్రాంతమే, కానీ వర్షం పడితే మాత్రం ఇక్కడ 2 గంటలపాటు ట్రాఫిక్ నరకమే.. అని అనడంతో సభికులందరూ నవ్వులు చిందించారు. తర్వాత గవర్నర్ ప్రసంగిస్తూ 'మంత్రి మల్లారెడ్డి స్పీచ్‌లో హైదరాబాద్ గురించి మాట్లాడారు, వెంటనే ఆ వ్యాఖ్యాత బాగానే కౌంటర్ వేసింది. హైదరాబాద్‌లోనే పెద్ద ఆస్పత్రులు ఉన్నాయి, కానీ వాటి ఫీజులతో సామాన్యులకు మెరుగైన వైద్యం అందడంలేదు' అంటూ పరోక్షంగా మొట్టికాయలు వేశారు.

IBPS POs 4336
New Batches On 5th & 7th August
RACE www.race4job.com 9985 999900 9912 544004
DSNR | AMPT | NGDA | KPHB | MP | SEC | HPM

SI & కానిస్టేబుల్స్
T/M NEW BATCH : 07-08-2019@2PM
E/M NEW BATCH : 08-08-2019@8AM
Separate Batches for TM / EM
యూనిక్ 9492459622 9059949607

విజేత కాంపిటీషన్స్ vijetacompetitions.net పక్షపత్రిక రూ. 30
ఏ.పి. గ్రామ/వార్డు సచివాలయం సెక్రటరీస్
9963293399 | 9963511135

SI & కానిస్టేబుల్స్
S.I కానిస్టేబుల్స్ ఫలితాలలో అత్యధిక ర్యాంకులు, ఫలితాలు సాధించింది భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ మాత్రమే
05-08-2019 నుండి న్యూ బ్యాచెస్ ప్రారంభం
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్
చైతన్యపురి, DSNR, Hyd
040-66338639, 24064477

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792